నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 22

గురువారం, అక్టోబర్ 16, 2025 , పేజీలు - 12 వెల: 2/-




## నేడు శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునిడిని దర్శించుకుంటా...

- రూ.13, 400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఎక్స్ వేదికగా మోడీ తెలుగులో ట్వీట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా లో గురువారం పర్యటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా మిగతా2లో...

## జర్నలిస్టుల సంక్షేమానికి
# అత్యంత ప్రాధాన్యత

- త్వరలో అక్రిడిటేషన్ పాలసీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్15:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్వో మల్సూర్ తో కలిసి అక్రిడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడేవిధంగా శాస్త్రీయ పద్ధతిలో అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈనెల చివరినాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కితీసుకురావాలని ఆదేశించారు.

## వందేభారత్ 4.0 వర్షన్
# అభివృద్ధి

● కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15:** భారతదేశపు సెమి-హై-స్పీడ్ రైళ్ల జాబితాలో తర్వాత వర్షన్ రానుంది. వందేభారత్ 4.0 ను అభివృద్ధి చేయనున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం ప్రకటించారు. ఎగుమతి గిరాకీలకు అనుగుణంగా దాని రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. రైళ్ల ఆధునిక సాంకేతికత విషయంలో దేశాన్ని గ్లోబల్ సప్లయిర్‌గా మార్చేదిశగా ఇది కీలక అడుగు మిగతా2లో...

## పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను
# అవమానిస్తారా...?

- మాగంటి సునీతను అవమానించేలా మంత్రులు మాట్లాడుతారా
- చిల్లర రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే
- కాంగ్రెస్, బిజెపిలు రాష్టానికి చేసిందేమీ లేదు
- మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు



**హైదరాబాద్,అక్టోబర్15:** భర్తను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానించే విధంగా కాంగ్రెస్ మంత్రులు మాట్లాడటం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి గోపీనాథ్ గెలిచారని తెలిపారు. దురదృష్టవశాత్తూ గోపీనాథ్ చనిపోయారని... ఆ కుటుంబాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు. మాగంటి గోపీనాథ్‌కి పెళ్లికాని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు మిగతా2లో...

## జూబ్లీహిల్స్‌లో సాకులు వెదుకుతున్న బిఆర్ఎస్

- ఓటమి భయంతో ముందే కుంటిసాకులు: శ్రీధర్ బాబు


2లో



# మావోయిస్టులకు వరుస దెబ్బలు

- సిఎం ఫడ్నవీస్ ముందు లొంగిపోయిన మల్లోజుల
- అదే బాటలో తక్కళ్లపల్లి వాసుదేవరావు
- నేడు ఛత్తీస్ గడ్ సిఎం ముందు లొంగిపోతారని ప్రచారం
- సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 27 మంది లొంగుబాటు

**నాగపూర్/హైదరాబాద్, అక్టోబర్ 15:** ఏరివేత తప్పదు..లొంగిపోతే బతికిపోతారని కేంద్ర హోంమంత్రి హెచ్చిరికల నేపథ్యంలో మావోయిస్టులు భారీగా మిగతా2లో...



## హ్యామ్ రోడ్ల నిర్మాణంపై నేటి కేబినేట్‌లో నిర్ణయం

- అధికారులతో సమిక్షించిన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 15:** హ్యామ్ రోడ్లు, టిమ్స్ హాస్పిటల్స్ వంటి పలు ప్రాజెక్టులపై చర్చించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు, గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిన కారణంగా, ప్రభుత్వం హ్యామ్ విధానంలో పెద్ద ఎత్తున రాష్ట్ర రోడ్లు నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.రోడ్లు, భవనాలు శాఖపై సమీక్ష నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నేటి కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఎర్రమంజిల్ ప్రధాన కార్యాలయంలోని సమావేశంలో మంత్రి సమిక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ల నిర్మాణంపై సీరియస్‌గా ఉన్నారని, రాష్ట్రంలో నాణ్యమైన రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని దృష్టి సారిస్తున్నట్లు మంత్రి మిగతా2లో...

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా
# లంకల దీపక్ రెడ్డి

- ఖరారు చేసిన బిజెపి అదిష్టానం



**హైదరాబాద్,అక్టోబర్ 15:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిని భాజపా ప్రకటించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ.. బీజేపీ అభ్యర్థిని ఆ పార్టీ అగ్రనాయకత్వం ఖరారు చేసింది. లంకల దీపక్‌రెడ్డి పేరు ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. అభ్యర్థి ఎంపిక కోసం నియోజకవర్గంలోని పలువురి సీనియర్ల పేర్లను బీజేపీ పరిగణలోకి తీసుకుంది. అందుకు సంబంధించిన జాబితాను రూపొందించి.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు న్యూఢిల్లీ తీసుకు వెళ్లి.. బీజేపీ అధిష్టానం ముందు ఉంచారు. అధిష్టానం లంకల దీపక్ రెడ్డిని ఎంపిక మిగతా2లో...


2లో

## కాందహార్‌లో పాక్ వైమానిక దాడులు

- 12 మంది అఫ్గన్ పౌరుల మృతి

## పదేళ్ల అభివృద్ధికి..రెండేళ్ల
# అరాచకానికి మధ్య పోరు

● జూబ్లీహిల్స్‌లో సునీత నామినేషన్‌లో పాల్గొన్న కెటిఆర్ ● జూబ్లీహిల్స్ నుంచి బిఆర్ఎస్ విజయయాత్ర అన్న కెటిఆర్

**హైదరాబాద్, అక్టోబర్ 15:** జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీలు, ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న ఎన్నిక కాదని.. పదేండ్ల అభివృద్ధి, పాలనకి.. రెండు సంవత్సరాల అరాచక పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పదేళ్ల రైతుబంధు పాలనకు, రెండు సంవత్సరాల రాక్షస పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నికగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురు చూస్తున్నారని.. ఆమె గెలుపుతోనైనా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.2500 ఇస్తుందని ఆశిస్తున్నారన్నారు. లక్షల మంది రైతన్నలు ఈమె గెలుస్తుందని ఆశిస్తున్నారని తెలిపారు.ఆ తర్వాతే తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని.. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, తర్వాత మోసపోయిన యువతి యువకులు ఎదురు చూస్తు



న్నాన్నారు. తమ ఇళ్లు కూలగొట్టిన అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి గెలవాలని, ఆ అరాచకాలు ఆగాలని హైదరాబాద్ నగర పేదలు మిగతా2లో...

# మావోయిస్టులకు వరుస దెబ్బలు

(మొదటి పేజీ తరువాయి)

లొంపోతున్నారు. లొంగిపోయిన వారు బతికిపోతే.. లొంగని వారు తూటలకు బలవుతున్నారు. వచ్చే మార్చిలోగా మావోలను అంతం చేస్తామని, ఆపరేషన్ కగార్ చేపట్టి వందలాది మందిని మట్టుపెట్టారు. ఈ క్రమంలో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయన ఆయుధాలు అప్పగించారు. ఇదిలావుంటే మావోయిస్టు పార్టీకి మరో బిగ్ షాక్ తగిలింది. మల్లోజుల బాటలో కీలక నేతలు నడిచేందుకు సిద్ధమయ్యారు. మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు రెడీ అయ్యారు. గురువారం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ముందు ఆశన్న లొంగిపోనున్నారని సమాచారం. ఆయనతో పాటు మరో 70 మంది మావోయిస్టులు కూడా సీఎం ముందు జనజీవన స్రవంతిలో కలవనున్నారు. బుధవారం ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో 27 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రకటించారు. వీరిపై రూ.50లక్షల రివార్డు ఉంది. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో ఈ మేరకు మల్లోజులను పోలీసులు మీడియా ముందుకు తీసుకొచ్చారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయన ఆయుధాలు అప్పగించారు. ఈ రెండు షాకులతో మావోస్టులు అల్లాడుతుంటే.. తాజాగా ఆశన్న లొంగిపోతున్నారనే వార్త.. వారికి మరో దెబ్బ తగినట్లే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత, దాదాపు రెండో స్థానంలో చలామణి అవుతున్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి బుధవారం ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట అధికారికంగా లొంగిపోయారు. సీఎం సమక్షంలో వీరంతా తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మల్లోజుల, ఆయన బృందాన్ని సీఎం ఫడణవీస్ జన జీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. తీవ్ర ఒడిదొడుకులతో సాయుధ ఉద్యమం బలహీనపడుతోందన్న ప్రచారం నేపథ్యంలో మావోయిస్టు పార్టీకి ఇది ఇబ్బందికర పరిణామంగా గమనించాలి. మావోయిస్టు పార్టీ వైఖరి సరిగా లేదంటూ కొన్ని రోజులుగా మల్లోజుల బహిరంగ లేఖలు రాస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పార్టీలో దశాబ్దాలుగా జరుగుతున్న తప్పిదాలకు తానే కారణమని పేర్కొంటూ అత్యున్నత నిర్ణాయక కమిటీ పొలిట్‌బ్యూరో నుంచి వైదొలిగారు. తాజాగా ఉద్యమాన్ని పూర్తిగా వదిలిపెట్టి అజ్ఞాతం వీడారు. మల్లోజులపై వందకు పైగా కేసులు ఉన్నాయి. మల్లోజుల సొంత రాష్ట్రం తెలంగాణ. పెద్దపల్లికి చెందిన మల్లోజుల వెంకటయ్య, మధురమ్మ దంపతులకు వేణుగోపాల్‌రావు మూడో సంతానం. తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసిన తండ్రి నుంచే వేణుగోపాల్, ఆయన రెండో అన్న కోటేశ్వరరావు స్ఫూర్తి పొందారు. చదువు పూర్తయిన అనంతరం తన అన్న పిలుపు మేరకు ఉద్యమంలో ప్రవేశించారు. పార్టీలో ఆయనను అభయ్, సోను, భూపతి, వివేక్ పేర్లతో పిలిచేవారు. వీరిలో పది మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిపై మొత్తం రూ.50 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టులు అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని సూచించారు. మావోయిస్టు కంచుకోట బస్తర్‌లో సైతం గడ్చిరోలి తరహా భారీ ఎత్తున మావోయిస్టులు లొంగిపోయేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ ఉత్తర బస్తర్ డివిజన్ ఇన్‌ఛార్జి రాజ్ మాన్ సహా పలువురు లొంగిపోనున్నట్లు సమాచారం. బస్తర్ ఐజీ సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ ఇంద్ర కళ్యాణ్ ఈ మేరకు మావోయిస్టులతో చర్చలు జరుపుతున్నారు.

# పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానిస్తారా...?

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో దుఖంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కాంగ్రెస్ మంత్రులు మాగంటి సునీతని అవమానించే విధంగా నానా మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విజ్ఞత మరిచి, విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు విజ్ఞులని.. మంచి, చెడులని ఆలోచిస్తారని తెలిపారు. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు హరీశ్‌రావు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్ లోకి చేరారు. హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఒక ఆడబిడ్డను ఆశీర్వదించాలనే పలువురు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ ఏం చేసిందనేది ఒకసారి ప్రజలు ఆలోచించాలని సూచించారు. తెలంగాణకి కాంగ్రెస్, బీజేపీ ద్రోహం చేశాయని విమర్శించారు హరీశ్‌రావు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పేదొకటి, చేసేదొకటని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ మొహబ్బత్‌కి దుకాణ్ అని అంటారని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటారని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతోంది ఏమిటి..?.. హైడ్రా పేరిట పేదవారి ఇళ్లు కూలగొట్టడం మొహబ్బత్ దుకాణ్ ఆ..? అని ప్రశ్నించారు. బడా బాబుల ఇళ్లు ఎందుకు కూలగొట్టడం లేదని నిలదీశారు. గరీబోళ్ల ఇల్లు కూలగొట్టి వేల కుటుంబాలను రోడ్డుమీదకి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ బిహార్‌లో ఓటు చోరీ అంటున్నారని... జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మాత్రం ఓటు చోరీ చేస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో రేవంత్‌రెడ్డి ఓటు చోరీ చేయకుండా నిజాయితీగా ఉండాలని చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి లేదా అని ప్రశ్నించారు హరీశ్‌రావు. 'జూబ్లీహిల్స్‌లో భర్తను కోల్పోయిన సునీతని ఒడగొట్టాలని.. 20 వేల దొంగ ఓట్లను కాంగ్రెస్ కూడగట్టింది. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని అన్నారు. ప్రతి అక్కకు, చెల్లెకు కాంగ్రెస్ రూ.55,000 బాకీ పడింది. జూబ్లీహిల్స్‌లో మహిళలకు ఒక్కొక్కరికీ రూ.55,000 ఇచ్చి రేవంత్‌రెడ్డి సర్కార్ ఓటు అడగాలన్నారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఇస్తా అన్నారని.. ఇవ్వకుండా మోసం చేశారు. ఒక అవ్వకు, తాతకు రూ.44,000 రేవంత్‌రెడ్డి బాకీపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిందేముంది.. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టుడు తప్ప అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రతి బస్తీకి బస్తీ దవాఖాన పెట్టారు. హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలని కేసీఆర్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం మందులు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో గర్భిణులు డెలివరీకి పోతే ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేసి కేసీఆర్ కిట్ ఇచ్చి ఆటోలో ఇంటికాడ దిగబెట్టాం. రేవంత్‌రెడ్డి సర్కార్‌లో బతుకమ్మ చీరలు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు ఇవ్వట్లేదు. కేసీఆర్ హయాంలో 20,000 లీటర్ల నీళ్లు ఉచితంగా ఇస్తే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి నల్లా బిల్లు వసూలు చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో గరీబోళ్లకి నీళ్లు ఉచితంగా ఇచ్చాం. భాగ్యనగరంలో నల్లా సమస్యలు పెరిగాయి. అధికారులు నల్లా బిల్లులు వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ని జూబ్లీహిల్స్ ఎన్నికలో ఓడిస్తేనే బుద్ధి వస్తుంది' అని హరీశ్‌రావు విమర్శించారు. 'తెలంగాణలో ఆరు గ్యారెంటీలని 100 రోజుల్లో అమలు చేస్తామని సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో చెప్పించారు. ఇప్పుడు ఆరు గ్యారెంటీలని పూర్తిగా అమలు చేయడం లేదు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రావడమే కష్టం. భర్తను కోల్పోయిన ఆడబిడ్డను మీరందరూ దీవించాలి. బీజేపీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటుంది. కానీ గోదావరి పుష్కరాలకు.. ఆంధ్రప్రదేశ్‌కి రూ.100కోట్లు ఇచ్చి తెలంగాణకు గుండు సున్నా ఇచ్చింది. ఇది సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ ఎలా అవుతోంది..?. తెలంగాణ నీటిని దోపిడీ చేసే బనకచర్ల ప్రాజెక్టుకి బీజేపీ ప్రభుత్వం మద్దతిస్తోంది. అనుమతులు ఇస్తోంది. తెలంగాణకు ఏమి ఇస్తున్నారో బీజేపీ నాయకులు చెప్పాలి. దేశంలో 157 మెడికల్ కాలేజీలు ప్రకటిస్తే ఒక్క మెడికల్ కాలేజీని కూడా తెలంగాణకు ఇవ్వలేదన్నారు. 'తెలంగాణలో బీజేపీకి 8 ఎంపీలను గెలిపిస్తే.. రాష్ట్రానికి మీరు చేసిన మంచి ఇదేనా. గోధుమలకు రూ.2,585, వడ్లకు రూ.2,369 ఇస్తున్నారని... గోధుమలకు ఓ నీతి వడ్లకు మరో నీతి ఉంటుందా..?. అన్నారు. 2014లో బీజేపీ అధికారంలో వచ్చిన నాడు గోధుమలకు, వడ్లకు రూ.1400 మద్దతు ధర ఉండేది. గోధుమలకు మద్దతుధర పెంచి వడ్లకు పెంచకపోవడం తెలంగాణ రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. కాంగ్రెస్‌కి నిజాయితీ ఉంటే బాకీ కార్డు పంపిస్తాం. మీరు పడ్డ బాకీని చెల్లించి జూబ్లీహిల్స్‌లో ఓటు అడగాలని పేర్కొన్నారు. తెలంగాణ గొంతు నొక్కడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది. ఆడపిల్ల పెళ్లికి కల్యాణలక్ష్మి, గర్భిణులకి కేసీఆర్ కిట్టు ఇచ్చాం. రూ.2000ల పెన్షన్ ఇచ్చి అవ్వాతాతల గౌరవం పెంచాం. షీ టీమ్స్‌తో ఆడపిల్లల భద్రత పెంచాం. కాంగ్రెస్‌వి మొసలి కన్నీళ్లు, ఆపద మొక్కులు తప్పా ప్రజల సంక్షేమం పట్టదని విమర్శించారు.

## హ్యామ్ రోడ్ల నిర్మాణంపై నేటి కేబినేట్‌లో నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)


పేర్కొన్నారు. రేపు క్యాబినెట్‌లో తీసుకునే నిర్ణయం రాష్ట్ర రోడ్ల నిర్మాణానికి మైలురాయిగా ఉంటుందని, వచ్చే 30 నెలల్లో తెలంగాణలో 'దేశంలోనే బెస్ట్ రోడ్స్' అనే పేరుని అందించగల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. రోడ్ల నిర్మాణం దశలవారీగా, హ్యామ్ విధానం ప్రకారం అమలు చేయబడనుంది. అదేవిధంగా, పేద ప్రజలకు కార్పోరేట్ స్థాయి వైద్యం అందించే టిమ్స్ హాస్పిటల్స్ పనుల్లో వేగం పెంచి, అత్యంత త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు.

## రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

**సంగారెడ్డి,అక్టోబర్15:** ఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని కేతావత్ శర్మన్ నాయక్ (55) అనే వ్యక్తి మృతి చెందారు. సంఘటన చిలిపిచెడ్ మండలం సోమక్కపేట్ శిలంపల్లి రోడ్ మార్గంలో జరిగింది. ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంగూడ తండా గ్రామపంచాయతీ పరిధిలోని అంబర్య తాండకు చెందిన కేతావత్ శర్మన్ నాయక్ (55) శిలాంపల్లి నుండి తన ఇంటికి వస్తున్న మార్గమధ్యంలో రెండు బైకులు ఢీకొని శర్మన్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. సోమక్కపేట గ్రామానికి చెందిన బందేల్లి, గంగిరెడ్డుల గూడెంకు చెందిన శ్రీనుకు గాయాలు కాగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

## అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

● రోబోటిక్స్ బిగ్ డేటా వంటివాటి ఉపయోగం: ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడి



**బెంగళూరు,అక్టోబర్15:** అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ బిగ్ డేటా వంటివాటిని ఉపయోగించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ అన్నారు. వికసిత భారత్‌కు దూతగా 2040లో భారతీయ వ్యోమగామి చందమామపై అడుగుపెట్టనున్నాడని నారాయణన్ పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధి కోసం ప్రస్తుతం ఇస్రో అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు నారాయణన్ వెల్లడించారు. వాటిలో 80వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్లను తయారుచేయడం, 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రుడిపై అధ్యయనం కోసం వీనస్ ఆర్బిటర్ మిష ఏర్పాటు వంటి లక్ష్యాలను ఏర్పరుచు కున్నామన్నారు. 2027లో చేపట్టబోయే మానవ సహిత గగనయాత్ర మిషన్ ట్రాక్‌లో ఉందని వెల్లడించారు. 2040 నాటికి తొలి మానవసహిత జాబిల్లి యాత్ర చేపట్టాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని..అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇస్రో ప్రణాళికలను పంచుకున్న వి. నారాయణన్ గగన్‌యాన్‌లో భాగంగా తాము మరిన్ని ప్రయో గాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు 2027లో ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. కొన్నేళ్ల క్రితం అంతరిక్షరంగంలో రెండు లేక మూడు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని.. ప్రస్తుతం ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణలపై అధ్యయం కోసం 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ అన్నారు.

## నేడు శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునిడిని దర్శించుకుంటా...

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కర్నూలు జిల్లా పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ పెట్టారు. అచ్చమైన తెలుగులో ఈ ట్వీట్ పెట్టారు ప్రధాని మోదీ. ఆంధ్రప్రదేశ్‌లో 'రేపు అంటే అక్టోబర్ 16వ తేదీన పర్యటిస్తాను. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తాను. ఆ తర్వాత కర్నూలులో రూ.13, 400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమా ల్లో పాల్గొంటాను. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతో పాటు మరిన్ని రంగాలకు సంబంధించినవి ఉన్నాయని ప్రధాని మోదీ తన ట్వీట్ ద్వారా వెల్లడించారు.

## వందేభారత్ 4.0 వర్షన్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

కానుందని వెల్లడించారు.సీఐఐ ఇంటర్నేషనల్ రైల్ కాన్ఫరెన్స్‌లో కేంద్రమంత్రి మాట్లాడారు. మోదీ రైల్వేల అభివృద్ధిపై బలంగా దృష్టి సారించిందని వెల్లడించారు.11 ఏళ్లలో 35,000 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని చెప్పారు. జపాన్ బుల్లెట్ రైల్ నెట్‌వర్క్ మాదిరిగానే హైస్పీడ్ ప్యాసింజర్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా గంటకు 350 కి.మీ వేగంతో రైలు ప్రయాణించేలా వాటి డిజైన్ ఉంటుందని తెలిపారు.

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నామినేషన్ పక్రియ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దాంతో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. బుధవారం నామినేషన్ దాఖలు చేసారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు అధికార కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.. ఎన్ని కల ప్రచారం లో ఇప్పటికే దూసుకు పోతున్నారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెం బ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ బరిలో దిగి గెలిచారు. అయితే అనారోగ్యం కారణంగా ఆయన ఇటీవల మరణించారు. ఇక బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి తాజాగా ప్రకటించింది. ఉప ఎన్నిక పోలింగ్ నవంబర్ 11వ తేదీన జరగను ంది. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెల్లడి కానున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది ఆ రోజుతో తెలిపోనుంది. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది.

## పదేళ్ల అభివృద్ధికి..రెండేళ్ల అరాచకానికి మధ్య పోరు

(మొదటి పేజీ తరువాయి)

కోరుకుంటున్నారన్నారు. మూతపడుతున్న బస్తీ దావఖానాలు, ఉచిత తాగునీరు ఆగిపోతున్న విష యాలు ప్రజలందరూ చూస్తున్నారని.. కాంగ్రెస్ పార్టీ ఒక ఇల్లు కూడా హైదరాబాదులో కట్టలేదని.. కేసీఆర్ కట్టిన హైదరాబాద్‌లో కట్టిన లక్ష ఇళ్లు, ఇచ్చిన ఇళ్ల పట్టాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా హైదరాబాద్ నగర ప్రజలకు గుర్తుకు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన మైనార్టీలకు ఈ ఎన్నిక ఒక అవకాశంగా భావిస్తున్నా రని.. ప్రభుత్వంలో ఒక్క మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వకుండా దారుణంగా వారిని అవమాన పరిచిన మైనార్టీలు, ఈ ఎన్నికను రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి ఒక అవకాశంగా భావిస్తున్నట్లుగా చెప్పారు. తమకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్నీ మోసమని, గుణపాఠం చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీలు సిద్ధంగా ఉన్నారని.. దళితబంధు, అభయహస్తం అని చెప్పి మోసం చేసిన దళితులు కూడా ఆగ్రహంతో ఉన్నారని.. తమ అభ్యర్థికి అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతున్నదని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ఆధ్వర్యంలో మరోసారి పాలన రావడానికి, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ఈ ఉప ఎన్నిక పునాది కాబోతున్నదన్నారు.

## కాందహార్‌లో పాక్ వైమానిక దాడులు

**ఇస్లామాబాద్, అక్టోబర్ 15:** కాందహార్ ప్రావిన్స్‌లోని పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్ దళాలు జరిపిన వైమానిక దాడుల్లో 12మందికి పైగా ఆఫ్ఘన్ పౌరులు మృతి చెందినట్టు తెలుస్తోంది. ఇది తాలిబన్ - పాకిస్థాన్ దళాల మధ్య తాజాగా కాల్పులకు దారితీశాయి. దీంతో రెండు పాత మిత్రదేశాల మధ్య వైరం తీవ్రతరమైంది. దీనిపై ఇరుపక్షాలూ ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకున్నాయి. బుధవారం ఉదయం, కాందహార్‌లోని స్పిన్ బోల్డాక్ జిల్లాపై పాకిస్థాన్ దళాలు తేలికపాటి, భారీ ఆయుధాలతో దాడులు ప్రారంభించాయి. ఫలితంగా 12మందికి పైగా ఆఫ్ఘాన్ పౌరులు అమరులయ్యారు. కనీసం 100 మంది గాయపడ్డారని ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపారు. పాకిస్థాన్ చేసిన దాడి.. ఒక నివాస భవనాన్ని తాకడంతో ఆ ఇంట్లో చాలామంది పిల్లలు చనిపోయినట్టు తెలుస్తోంది. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆఫ్ఘన్ దళాలు కూడా ప్రతీకార చర్యకు దిగాయి. కాగా, పాకిస్థాన్ జరిపిన దాడిలో 15మంది పౌరులు మరణించారని ఒఈఖ వార్తా సంస్థ నివేదించింది. గాయపడిన వారిలో 80మందికి పైగా మహిళలు, పిల్లలు ఉన్నార ని తెలిపింది. బుధవారం నాడు కాబూల్ శివార్లలో ఒక ఇంధన ట్యాంకర్ పేలింది. ఫలితంగా, భారీ అగ్నిప్రమాదం సంభవించిందని టోలోన్యూస్ నివేదిం చింది. వివాదం తగ్గే సూచనలు కనిపించకపోవడం, పాకిస్థాన్ మంత్రులను చర్చలకు ఆఫ్ఘనిస్తాన్ అనుమతించకపోవడంతో మధ్యవర్తులుగా వ్యవహరించ డానికి ఖతార్, సౌదీ అరేబియాకు ఇస్లామాబాద్ ఫోన్ చేసినట్టు తెలుస్తోంది.

## జూబ్లీహిల్స్‌లో సాకులు వెదుకుతున్న బిఆర్ఎస్

- ఓటమి భయంతో ముందే కుంటిసాకులు: శ్రీధర్ బాబు

**హైదరాబాద్, అక్టోబర్ 15:** జూబ్లీహిల్స్‌లో ఓటమి భయంతో బిఆర్ఎస్ రకరకాల ప్రచారాలు చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.దేశంలో ఓట్ల చోరీ జరిగిందని చెప్పిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓడిపోతామనే బీఆర్ఎస్ నేతలు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా తయారు చేసిందే గత బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది రామరాజ్యమని అభివర్ణించారు.

## భవ్య శ్రీలక్ష్మిని సన్మానించిన ఫోటోగ్రఫి యూనియన్ సభ్యులు



చర్చ, అశ్వారావుపేట:జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన పట్టణానికి చెందిన భవ్య శ్రీలక్ష్మిని ఫొటోగ్రఫీ యూనియన్ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. పట్టణానికి చెందిన కేశిబోయిన వీరాంజనేయులు, రమాదేవి దంపతుల కుమార్తె భవ్య శ్రీ లక్ష్మి గంగారం లోని డిఏవి పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. ఈనెల 11వ తేదీన హైదరాబాద్ సఫలిగూడ క్రీడా మైదానంలో డి.ఏ.వి. స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో తన మేధస్సును, ప్రావీణ్యాన్ని చాటుతూ అద్భుత ప్రతిభ కనబర్చింది. తన ఆటతీరు, నైపుణ్యంతో ఇతర పోటీదారులను వెనక్కి నెట్టి జాతీయ స్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించడమే కాకుండా, పాఠశాలకు, మండలానికి గౌరవం తీసుకువచ్చింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని మంగళవారం అశ్వారావుపేట మండల ఫోటోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు భవ్య శ్రీ లక్ష్మిని ఘనంగా సత్కరించారు. భవ్యకు పూలమొక్క అందించి,
శాలువా వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ అసోసియేషన్ మాట్లాడుతూ తమ సహచర సీనియర్ ఫోటోగ్రాఫర్ వీరాంజనేయులు కుమార్తె భవ్య శ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు షేక్ రంజాన్, కార్యదర్శి పవన్, సీనియర్ ఫోటోగ్రాఫర్ వరా రాము, షేక్ షఫీ, తడికమళ్ళ అభిలాష్, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## బంద్‌కు బీసీ సంఘాల జేఏసీ పిలుపు






చర్చ, అశ్వారావుపేట: బీసీలకు 42% రిజర్వేషన్‌పై హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 18వ తేదీన చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త బంద్ నిర్వహించనున్నట్లు బీసీ సంఘాల నాయకులు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో బీసీ సంఘాల జేఏసీ నాయకులు సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీలకు అతీతంగా బీసీ ఉప కులాలు కలిసికట్టుగా పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంకా ప్రసాదరావుని కలిసి బంద్‌కు మద్దతు కోరారు. ఈనెల 18న బంద్‌కు అన్ని వర్గాల నుండి సంపూర్ణ మద్ధతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని సంఘ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కురిశెట్టి నాగబాబు, ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు, ఫకీరయ్య, చిన్నంశెట్టి సత్యనారాయణ,
లింగిశెట్టి వెంక టేశ్వ రరావు, తాళం సూరిబాబు, అంకోలు వెంకటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, బుక్కురి బుచ్చి బాబు, పేరం నాగబాబు, దేరంగుల ప్రసాద్, ఆళ్ల సత్తిబాబు, సోమని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుల నియామకానికి అభిప్రాయ సేకరణ చేసిన ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్ర







చర్చ, సత్తుపల్లి:ఖమ్మం జిల్లా డిసిసి నూతన అధ్యక్షుల నియామకం కోసం సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నుండి ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్ర విడివిడిగా అభిప్రాయ సేకరణ చేశారు. పట్టణంలోగల ఎమ్మార్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో మహేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని అందరి ఏకాభిప్రాయంతో ఎన్నుకుంటామని, అందరి అభిప్రాయాలను గోప్యంగా తెలియ చేయాలని సూచించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక ఎమ్మెల్యే మట్ట రాగమయి మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష పదవికి ఎవరినైతే నిర్ణయిస్తారో, ఆ మెజారిటీ అభిప్రాయాన్ని పైకమిటీ దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు నిర్ణయిస్తారని తెలియజేశారు. శాసనసభ ఎన్నికలలో ఎలాగైతే కష్టపడి పని చేశారో వచ్చే స్థానిక ఎన్నికలలో కూడా ఆ విధంగానే కష్టపడి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని వర్గాలలో ప్రచారం చేసి పార్టీ గెలుపునకు దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్, సత్తుపల్లి ఇంచార్జ్ చక్కిలం రాజేశ్వరరావు, ఖమ్మం డిసిసిబి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పిసిసి జనరల్ సెక్రెటరీ నూతి సత్యనారాయణ, 5 మండలాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## దుమ్ము లేపేస్తున్నారు

- కొత్తగూడెం హేమచంద్రపురం రోడ్డుకు మోక్షం ఎప్పుడు
- భారీ వాహనాలతో నిత్యం ఇబ్బందులు







చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :భారీ వాహనాలు పగటివేళలో కొత్తగూడెం పట్టణంలోకి వెళ్లకుండా పోస్టాఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రాపురం మీదుగా బైపాస్ ఏర్పాటు చేశారు. అయితే ఈ రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్ నుంచి హేమచంద్రాపురం వరకు రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. ముఖ్యంగా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ సమీపంలోని సింగరేణి స్కూల్, సీఎస్ఐ చర్చ్ వద్ద రహదారి అత్యంత దయనీయ స్థితిలో ఉంది. ఈ మార్గంలో తరచుగా బొగ్గు టిప్పర్లు వేగంగా వెళ్లడంతో దుమ్ము దూళి ఎగిసిపడి ఆ ప్రాంతమంతా ముసురుకుంటోంది. ఇళ్లలో పరిస్థితి అయితే చెప్పలేని విధంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఆ రోడ్డు వెంబడి వాకింగ్‌కు వెళ్లే వారు, ప్రకాశం స్టేడియంలో క్రీడాకారులు, ప్రయాణికులు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాప్ యజమానులు దుమ్మును పీల్చి శ్వాస సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ కొత్తగూడెం %-% హేమచంద్రపురం రహదారికి మోక్షం ఎప్పుడు లభిస్తుందో అని ప్రభావిత ప్రాంతాల ప్రజలు వేచి చూస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడి కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉంది. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిస్తే అసలు గుంతలు ఏర్పడక ఎన్నో వాహనాలు ప్రమాదాల భారిన పడుతున్నాయి. రహదారి మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని, అప్పటి వరకు అయినా ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డుపై నీళ్లు చల్లి దుమ్ము, ధూళి లెగకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


# మత్తులో యువత చిత్తు

- వైట్‌నర్, ఫెవికాల్, గంజాయి ఆస్వాదిస్తున్న యువత
- నిత్యం మత్తులో జోగుతూ అసాంఘీక కార్యలకలాపాలు
- కఠినంగా వ్యవహరించకుంటే యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:యుక్త వయస్సులో లక్ష్యాలను సాధించాల్సిన యువత మత్తులో జోగుతున్నారు. నిషేధిత గంజాయితోపాటు ఎక్కడైనా దొరికే వైట్‌నర్, ఫెవికాల్ వంటి వాటిని మత్తుకోసం ఉపయోగిస్తున్నారు. నిత్యం వీటిని ఆస్వాదిస్తున్న యువకులు కొందరు ఆ మత్తులో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం లేకపోలేదు. ఎక్సైజ్ శాఖతోపాటు పోలీసులు ఇలాంటి యువతకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు నిషేధిత గంజాయిపై ఉక్కుపాదం మోపడం, విచ్చలవిడిగా దొరికే వైట్‌నర్, ఫెవికాల్ వంటి వాటి అమ్మకాలపై ఆంక్షలు విధించినప్పుడే యువత మత్తుకు బానిసలు కాకుండా అరికట్టవచ్చునని వైద్యులు పేర్కొంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో ఇప్పుడు ఎక్కడ చూసినా కొందరు యువత నిత్యం మత్తులో తూగుతూ కన్పిస్తున్నారు. అది మద్యం మత్తు అనుకుంటే పొరపడినట్లే. గంజాయిపై నిషేధం, ధర ఎక్కువగా ఉండటంతో టీనేజర్స్ ఫెవికాల్, వైట్‌నర్‌లపై దృష్టి సారించారు. వైట్‌నర్స్ బుక్‌షాపుల్లో, ఫెవికాల్ వంటివి వుడ్ షాపుల్లో విరివిగా దొరుకుతుండటం, ధర కూడా తక్కువగా ఉండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని పోస్టాఫీస్, రామాటాకీస్, బర్లిఫిట్ ఏరియా, రామవరం, గాజులరాజం బస్తీ, హనుమాన్‌బస్తీ వంటి పలు మాస్ ఏరియాల్లో యువకులు ఎక్కువగా వీటిని వినియోగిస్తున్నట్లు సమాచారం. ఎక్కడ పడితే అక్కడ ఆయా ఫెవికాల్ డబ్బాలు, కవర్లు, వైట్‌నర్‌లు కన్పిస్తున్నాయి.

### విష రసాయనాలతో మత్తులోకి

గంజాయి గురించి అందరికీ తెలిసినప్పటికీ వైట్‌నర్, ఫెవికాల్




వంటివి సైతం మత్తును కలిగిస్తాయనే విషయం కొందరికి మాత్రమే తెలుసు. ముఖ్యంగా టీనేజర్లు వీటి గురించి తెలుసుకుని చీప్‌గా దొరికే వాటి ద్వారా మత్తులో విహరిస్తున్నారు. ఫెవికాల్‌లో టోలోయిన్ హెక్సేన్ వంటి విష రసాయనం ఉంటుంది. దీనిని పీల్చడం ద్వారా మనిషి మెదడులో కొన్ని మార్పులు జరిగి మత్తులోకి తీసుకువెళ్తుంది. దీనివల్ల తల తిప్పడం, అస్పష్టంగా కన్పించడం వంటివి జరుగుతాయి. ఇక వైట్‌నర్‌లో ట్రైక్లోరో ఇథేన్, బ్రోమో ప్రొపేన్ వంటి రసాయనాలు ఉంటాయి. వైట్‌నర్‌ను వాడటం వల్ల ఈ రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి యువతను మత్తుకు బానిస అయ్యేలా చేస్తాయి. హైదరాబాద్ వంటి నగరంలో గత కొన్నేళ్ల క్రితం ఈ వైట్‌నర్‌కు యువత బానిసలుగా మారి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడటమే కాకుండా కొందరు మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఇది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వ్యాపించడంతో పలువురు భయాందోళనకు గురవుతున్నారు.

### వైట్‌నర్, ఫెవికాల్‌తో క్యాన్సర్ ముప్పు

వైట్‌నర్, ఫెవికాల్ వంటి వాటిని మత్తు కోసం ఉపయోగిస్తున్న యువత కొన్నాళ్లకు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలున్నాయని వైద్యులు చెప్తున్నారు. గంజాయి కారణంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపనుండగా, వైట్‌నర్, ఫెవికాల్ వల్ల క్యాన్సర్ ముప్పు పొంచి ఉంది. దీర్ఘకాలంగా వీటిని సేవిస్తే మరణం కూడా సంభవించవచ్చునని వైద్యులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా యువత మత్తులో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతూ వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మరొకరికి ఆదర్శంగా నిలుస్తూ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాల్సిన యువత ఇలా మత్తులో జోగుతూ తమ ప్రాణాలను సైతం ఫణంగా పెడుతుండటంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### ఘూ పెట్టి.. కఠినంగా వ్యవహరించాలి




మత్తుపదార్థాలు సేవిస్తున్న యువతపై పోలీస్ వ్యవస్థ నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు తల్లిదండ్రులు. తమ పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు మత్తు కలిగించే గంజాయి, ఫెవికాల్, వైట్‌నర్‌లపై దృష్టి సారించి, అవి లభ్యం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఫెవికాల్ అనేది పలు పనులకు తప్పనిసరిగా ఉపయోగించేది అయినప్పటికీ వాటి విక్రయాలపై దృష్టి సారించాలని, అంతేకాకుండా వాటిని వాడిన తరువాత డబ్బాలు వంటి వాటిని డిస్పోజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు అంటున్నారు.

## బీసీ రిజర్వేషన్ కోరుతూ సిపిఐ ప్రదర్శన

- అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన

చర్చ, మణుగూరు:42% బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని, దీనికి చట్టబద్ధత కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత నివేదికపై జాప్యం విడనాడాలని సీపీఐ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మికుమారి అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోడానికి వెంటనే బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం మణుగూరులో ప్రదర్శన, నరిసన చేపట్టారు. తొలుత సిపిఐ కార్యాలయం నుండి ప్రదర్శనగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ సెంటర్‌కు చేరుకొని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మికుమారి మాట్లాడుతూ బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వయిస్త ఉందని, రాష్ట్రంలో శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి, రాష్ట్ర గవర్నర్ కి పంపించి నెలలు గడుస్తున్న దీని పట్ల కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, బీసీలు 42 శాతం రిజర్వేషన్ వస్తే రాజ్యాధికారంలో భాగస్వామ్యం అవుతారని విద్యా ఉద్యోగం ఉపాధి రంగాల్లో అందరికీ అవకాశాలు



దక్కుతాయని ప్రజలు ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు వెళుతుందని, కావాలని కొందరు దురుద్దేశంతో కోర్టులకు వెళుతూ బీసీలను అనగ తొక్కుతూ, రిజర్వేషన్ అడ్డుకోవాలని చూస్తున్నారని వారు ఆరోపించారు. ఏది ఏమైనా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని, దీని కోసం రేపు 18వ తారీకు బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపుకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, 18వ తేదీన జరుగు బంద్‌కు సిపిఐ మద్దతు ఇస్తుందని, దీనికి పెద్ద ఎత్తున తరలిరావాలని వారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ మండల కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్‌రావు, ఎడారి



రమేష్, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, మహిళా సమైఖ్య మండల అధ్యక్ష కార్యదర్శులు బోలగాని సమ్మక్క , సుజాత, సిపిఐ సీనియర్ నాయకులు ఎస్.కె.సర్వర్, మంగి వీరయ్య, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, నాయకులు నోముల రవి, రాములు, పులిగల రమేష్, మాజీ ఎంపీటీసీ పాయం లక్ష్మయ్య, కన్నెపోయిన ప్రసాద్, ఎస్ డి ఉమర్, వెంకటేశ్వర్లు, బోసెట్టి సంపత్, కోళ్ల నరసింహారావు, చక్రపాణి, యాకూబ్, డొంక రాములు, రంగు ఆంజనేయులు బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

చర్చ, భద్రాచలం:రహదారి భద్రతను పెంపొందించే లక్ష్యంతో స్థానిక ట్రాఫిక్ పోలీసులు మదర్ థెరిసా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలు, వాటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు సూచనలు చేశారు. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో యువతలో, ముఖ్యంగా కళాశాల విద్యార్థుల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే విద్యార్థులు విధిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కు దూరంగా ఉండాలని హితవు పలికారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ





వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, దీనివల్ల కలిగే తీవ్ర పరిణామాలను వివరించారు. అలాగే, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి, ప్రమాదాలను నివారించడానికి అమలు చేస్తున్న ట్రాఫిక్ ఆంక్షల గురించి విద్యార్థులకు వివరించారు.




పాదచారులు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిగ్నల్స్ ను అనుసరించడం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఎస్‌హెచ్ఐ వెంకటేశ్వరరావు. ఏఎస్సై. శంకర్, పిసి చిన్న వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పలకు నిత్య మహా అన్నదానం

చర్చ, సత్తుపల్లి:కల్లూరు మండలంలోని అయ్యప్ప మాల ధరించిన భక్తులకు గత ఆరు సంవత్సరాలుగా అఖిల భారత అయ్యప్ప ప్రచార ధర్మ సభ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రచార ధర్మ సభ జిల్లా అధ్యక్షులు కాటేపల్లి రజనీకాంత్ అన్నారు. హిందూ సాంప్రదాయాలకనుగుణంగా కార్తీక మాసం నుండి సంక్రాంతి వరకు 41 రోజులు పాటు నిర్విరామంగా నిర్వహించే దీక్ష అనంతరం శబరిమలైలో నవంబర్ 16న తెరుచుకొనే అయ్యప్ప ఆలయానికి చేరుకొని అయ్యప్ప అనుగ్రహం కోసం నిష్టతో దీక్ష చేసే భక్తులకు దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 500 నుండి 600 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్రాప్రు. అంతేకాకుండా భక్తుల సౌకర్యార్థం అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే అయ్యప్ప ఆలయం నిర్మించుకొని భక్తులకి ఇటువంటి ఇబ్బందులు కలగకుండా అఖిలభారత









అయ్యప్ప ధర్మ ప్రచార సభ పనిచేస్తుందన్నారు. దీక్షా సమయంలో అయ్యప్పలు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో అనేక దైవాధీన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు బ్రాంచి అధ్యక్షులు లంక అప్పల నాయుడు, కమిటీ సభ్యులు ఆళ్ల వెంకటేశ్వరరావు, మల్లాది బస వయ్య, ఏనుగుల అంజి, గద్దె నరేష్, రాంబాబు, ఆంజనేయులు, జల్లా మాధవరావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై నిర్లక్ష్యం వీడండి

- యుద్ధప్రాతిపదికన మరమ్మత్తు పనులు పూర్తిచేయండి
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కూనంనేని
- రోడ్ల మరమ్మత్తులు, నిర్మాణంపై ద్రుష్టి సారించాం : ఎమ్మెల్యే కూనంనేని
- ముర్రేడు వాగుబ్రిడ్జి రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**చర్ల, భద్రాద్రి కొత్తగూడెం :** పట్టణ, గ్రామీణ రహదారులు, అంతర్గత రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని, ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే నిర్లక్ష్యాన్ని సహించబోనని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులను హెచ్చరించారు. పట్టణంలోని ముర్రేడు బ్రిడ్జి రోడ్డులో జరుగుతున్న మరమ్మత్తు పనులను బుధవారం మున్సిపల్, ఆర్ అండ్ బి, పోలిసు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా కూనంనేని మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రోడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలవల్లే ప్రజలకు ఈ దుస్థితి ఏర్పడుతోందని, నిర్మాణాల్లో నాణ్యత లోపించి అనతికాలంలోనే రోడ్లు ద్వంసమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు నాణ్యతతో నిర్మించాలని, ఎలాంటి నాణ్యత లోపించినా అధికారుల్లో బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతల విషయంలో రాజకీయాలు తగవని, సమస్య ఉంటే బాధ్యతగల పౌరులుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోస్టాఫీసు సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు, సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి సింగరేణి ప్రధాన ఆస్పత్రి, అదేవిధంగా సింగరేణి మెయిన్ స్టోర్స్ వరకు మూడు రోడ్లను యుద్ధ ప్రాతిపదికనే పునర్నిర్మాణ పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ మూడు రోడ్ల నిర్మాణంకోసం సంస్థ ద్వారా రూ.2.80కోట్లు మంజూరయ్యాయని, పనులను కొద్దిరోజుల్లోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కూనంనేని తెలిపారు. రెండో దఫాగా బస్టాండు సెంటరు నుంచి త్రిమాత టెంపుల్ వరకు రోడ్డు పునర్నిర్మాణం, రోడ్డు వెడల్పు, బస్టాండు గేట్ సెంటర్లలో హైమాస్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఆర్ అండ్ బి అధికారులు, నాయకులు లగడపాటి రమేష్, దేవరగట్ల రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఖరీఫ్ ధాన్యం కనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు





**పత్రికా ప్రకటన, నల్గొండ, 15.10.2025 :** బుధవారం రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ,ఇతర ఉన్నతాధికారులతో హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాలు, సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం సేకరణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకుగాను 375 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా ఇప్పటికే అన్ని కేంద్రాలకు అవసరమైన సామాగ్రిని పంపించామని, ఇంకా మరో 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించే విషయంలో లారీల సమస్య తలెత్తకుండా చూడాలని, మిల్లుల వద్ద అన్లోడింగ్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, ఆయా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు ,అలాగే తేమ కొలిచే యంత్రాలు, తూకం వేసే యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలని , నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. మండల స్థాయిలో ఐకెపి కేంద్రాలకు సంబంధించి ఏపీఎంలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. హార్వెస్టర్ల వివరాలను సైతం సేకరించాల్సిందిగా ఆయన ట్రాన్స్పోర్ట్ ,పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించేందుకుగాను ముందుగా 40 లారీలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు ఆదేశించారు. అంతక ముందు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం ఆల్ టైం రికార్డ్ సాధించిందని, ఈ వానాకాలం 148.3 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని తెలిపారు. ఈ ఖరీఫ్ లో పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నందున జిల్లా అధికార యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని, అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని, ప్రత్యేకించి ధాన్యం రవాణా పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎక్కడ రవాణా సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చే విధంగా అవగాహన కల్పించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం అమ్మేందుకు నిరీక్షించే పరిస్థితి తీసుకురావద్దని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని, ఈ విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని, రైతులకు ఎక్కడ ఆసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. గత యాసంగిలో అధికారులు, మిల్లర్లు , ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల సమన్వయంతో సత్ఫలితాలను సాధించడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలు ధాన్యం సేకరణను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా 2025- 26 ఖరీఫ్ ధాన్యం సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యంతో పాటు, పత్తి, మొక్కజొన్న, సోయా పంటల సేకరణ పై కూడా దృష్టి సారించాలని అన్నారు. అదనపు ఎస్పీ రమేష్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపీకృష్ణ ,వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ ,జిల్లా సహకార అధికారి పత్యానాయక్, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. జారీ చేసిన వారు సహాయ సంచాలకులు, సమాచార శాఖ, నల్గొండ

# గత రెండు నెలలుగా నల్లగొండ జిల్లా మరియు సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలలో రైతులు కొన్ని సంవత్సరాలుగా పెంచుకున్న శ్రీగంధం చెట్లను నరికి షాగును అమ్ముకుంటున్న అంతర్ రాష్ట్ర నిందితులను అరెస్టు చేసిన నల్లగొండ జిల్లా పోలీస్ - కె.శివరాం రెడ్డి, డి.ఎస్.పి, నల్లగొండ










**నల్లగొండ :** జిల్లాలో గత రెండు నెలలుగా రైతులు కొన్ని సంవత్సరాల కాలం పాటు పెంచుకున్న శ్రీగంధం చెట్లను అక్రమంగా నరికి దొంగతనాలకు పాల్పడుతున్నారని సమాచారం మేరకు తేది : 30.09.2025 రోజున అర్ధ రాత్రి సమయములో కనగల్ మండల పరిధి లోని నేషనల్ హైవే 595 రోడ్ కి సమీపములోని ఒక శ్రీ గంధం చెట్లు ఉన్న చిలుక విద్యాసాగర్ తోట లోకి వెళ్లి చెట్లు కోసే రంపం మిషన్ లు, గొడ్డళ్ళు, ఉపయోగించి తోటలో 10 శ్రీగంధం చెట్ల మొద్దులు దొంగిలించుకొని, ఇంకా 5 శ్రీగంధం చెట్ల నరికి వదిలివేసినారు అని చిలుక విద్యాసాగర్ రెడ్డి పిర్యాదుపై కేసు నమోదు చేయనైనది.ఇట్టి కేసు పరిశోధనలో భాగంగా, జిల్లా ఎస్.పి. శ్రీ. శరత్ చంద్ర పవర్, ఐపిఎస్, గారి ఆదేశాల ప్రకారం, నల్లగొండ డి.ఎస్.పి కె.శివరాం రెడ్డి గారి ఆధ్వర్యములో నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేయుచుండగా, ఈ రోజు తేది 15.10.2025 ఉదయం 06.00 గం,,ల సమయంలో కనగల్ పోలీసులు నల్గొండ %-% దేవరకొండ రహదారిపై రంగారెడ్డి బంగ్లా వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా దేవరకొండ వైపు నుండి నల్గొండ వైపు కి రెండు బైక్ %ాా-31-దీూ-1571;ాా-28-ఆ%2491 లపై వెళ్తు చున్న ముగ్గురు అనుమానస్పదముగా వెనుకకు తన బైక్ లను తిప్పుకొని వెళ్ళు చుండగా వారిని కనగల్ పోలీస్ వారు పట్టుబడి చేసి వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న 3 రంపాలు, 3 గొడ్డలు, ఫెన్సింగ్ వైర్ కట్ చేసే ఒక కట్టర్, ఒక ఆక్సల్ బ్లేడ్, మూడు మొబైల్ ఫోన్ లు రెండు బైక్ ల పై వెళ్తున్నా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా ! నిందితులవివరాలుఅన్నాభౌ లక్ష్మణ్ గైక్వాడ్ , నివాసం: మహారాష్ట్ర స్టేట్ (పరారీలో) విలాస తండ్రి కుక్కనీయ, వయస్సు: 21 సంవత్సరములు, కులము:పార్ది



ఆదివాసీ, గంధిగ్రామ్ గ్రామం, జానకుపూర్ తాలూకా, కాట్నీ జిల్లా, మధ్యప్రదేశ్: దద్దు సింగ్ తండ్రి రామ్ సింగ్, వయస్సు: 20 సంవత్సరములు, కులము:పార్ది ఆదివాసీ,, అరుద్యా గ్రామం %ం% తాలూకా, కాట్నీ జిల్లా, మధ్యప్రదేశ్. మజాన్ తండ్రి అప్పెన్ సింగ్, వయస్సు: 20 సంవత్సరములు, కులము:పార్ది ఆదివాసీ, సుగువా గ్రామం, లాలక్పూర్ తాలూకా, కాట్నీ జిల్లా, మధ్యప్రదేశ్. జవాన్ మధ్యప్రదేశ్ రాష్ట్రం (పరారీలో) అజబా మధ్యప్రదేశ్ రాష్ట్రం (పరారీలో) ?

**నిందితులు నేరం చేయు విధానం.**

పైన తెల్పిన ఏ-2 నుండి ఏ-6 నేరస్తులు వారందరు మధ్య ప్రదేశ్ రాష్ట్రము, అజబా గవన్ గ్రామం, రిటీ తహసిల్, కట్నీ మరియు పన్నా జిల్లాలకు చెందిన వారు. వీరు దేశము లోని వివిధ ప్రాంతలో సంచార జీవనము గడుపుతూ రుద్రాక్షలు %ం% పూసలు అమ్ముకొంటూ జీవనం గడుపుతుంటారు, వీరు ఎక్కడికి వెళ్ళిన గ్రామ శివారు ప్రాంతలో గుడారాలు వేసుకొని నివసిస్తుంటారు, గత రెండు నెల క్రితం వీరికి మహారాష్ట్ర కు చెందిన ఏ-1 అన్నాభాహు లక్ష్మణ్ గైక్వాడ్ అను వ్యక్తి పరిచయం అయినాడు. వీరు అంత హైదరాబాద్ లో ఉన్న పుడూ ఏ-1 వీరి గుడిసెల వద్దకు వచ్చేవాడు. మీరు ఎన్ని రోజులు రుద్రాక్షలు అమ్మిన మీరు ధనవంతులు కాలేరని,మీరు నేను చెప్పినట్టు చేస్తే మీరు తొందరగా అధిక డబ్బులు సంపాదించవచ్చు అని, తెలంగాణ రాష్ట్రములోని వివిధ ప్రాంతలోని రైతులు శ్రీ గంధం చెట్లు సాగు చేస్తుంటారు, అట్టి శ్రీ గంధం కర్రలకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంది, కావున అట్టి చెట్లను నరికి ఏ-1 కు ఇస్తే, ఏ-1 వాటిని అక్రమ రవాణా చేసి, అట్టి కర్రలను అమ్మి మీకు అట్టి డబ్బులో వాటా ఇస్తాను అని వారితో చెప్పగా, అలా దొంగతనముగా రైతుల కష్టపడి కొన్ని సం,, ల నుండి సాగు చేసుకొంటున్న శ్రీ గంధం చెట్లును నరికి వాటి కర్రలను దొంగలించడం నేరము అని తెలిసిన కూడా అధిక డబ్బులు సంపాదించవాలనే దూరాశ తో దొంగతనం చేయడానికి ఒప్పుకొని, నల్గొండ జిల్లాలో గత రెండు నెలలో కనగల్ మండలంలోని తెలకంటి గూడెం, తిమ్మన్న గూడెం,నార్కట్ పల్లి మండలం,గుర్రంపోడు మండలం,నల్లగొండ రూరల్, చండూరు మండలం మొత్తం 6 దొంగతనాలు చేసినారు.వీరు 40 కేజిల షాగును అప్పచెప్పగా, ఒక్కొక్కరికి రూ. 10,000/- చొప్పున 50,000/- ఇవ్వడం జరిగింది నేరం ఒప్పుకొగా నిందితులను నేడు అరెస్టు చేసి రిమాండుకు తరలించడం జరిగింది.వీరు వివిధ ప్రాంతాల్లో రైతులు పెంచిన సుమారు 166 శ్రీగంధం చెట్ల నరికి నష్టపరచగా సుమారు 1 కోటి 66 లక్షల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లింది..

**నిందితుల నుండి స్వాదీన పర్చుకున్న వస్తువుల వివరాలు**

1) వీరి వద్ద నుండి 11 శ్రీగంధం మొద్దులు
2) దొంగతనానికి ఉపయోగించే రెండు బైక్ నెం 3) 3 రంపాలు, 2 గొడ్డలు, ఫెన్సింగ్ వైర్ కట్ చేసే ఒక కట్టర్,
4) 2-మొబైల్ ఫోన్ లు స్వాధీనం. నిందితుల పై వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు ఇట్టి కేసును నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి గారి పర్యవేక్షణలో త్వరితగతిన చేదించిన సిఐ-చండూర్ కె ఆది రెడ్డి, ఎస్.ఐ. లు కె రాజీవ్ రెడ్డి, కనగల్, వెంకన్న, చండూర్, సైదా బాబు, నల్లగొండ రూరల్, రైటర్ వి. రమేశ్, జానకి రాములు, తిరుమలేష్, శ్రీకాంత్, రాజు, బాలకోటి, శంకర్, శేఖర్,సురేశ్, .రమేశ్, వెంకట్ రెడ్డి లను జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవర్ ఐపిఎస్ గారు అభినందించినారు.

# డీసీసీ అధ్యక్ష ఎంపిక సమావేశం

- ఏఐసీసీ, టీపీసీసీ అబ్జర్వర్స్ తో కలిసి హాజరైన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు





**చర్ల, భద్రాద్రి కొత్తగూడెం:** డీసీసీ ఎంపిక పారదర్శకంగా ఉంటుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపిక దరఖాస్తుల స్వీకరణకు గురువారం కొత్తగూడెం క్లబ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిసి అధ్యక్షుల ఎన్నిక సందర్భంగా కొత్తగూడెం పట్టణ కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకుల అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఏఐసిసి అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం, డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య, ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, టీపీసీసీ అబ్జర్వర్స్ ఈడ్పుగంటి సుబ్బారావు, సాగరిక, సంజీవ్ ముదిరాజ్ కోఆర్డినేటర్ కె నాగేందర్ రెడ్డి లతో కలిసి పాల్గొన్న ఆయన డీసీసీ ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, పార్టీ కోసం పని చేసిన వారికి ఇదో మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీ పర్యటనలో పాల్గొన్న ఐఎన్టీయూసీ నాయకులు



**చర్ల, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి పర్యటించగా, ఆయన పర్యటనలో ఐఎన్టీయూసీ కాంట్రాక్టు ఓబీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. కొత్తగూడెం క్లబ్ లో నిర్వహించిన డీసీసీ నూతన అధ్యక్ష పదవికి ఆశావహుల నుండి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఆళ్ల మురళి ఆధ్వర్యంలో సింగరేణి కాంట్రాక్టు ఓబీ కార్మికులు కలిసి సీఎం రేవంత్ రెడ్డి రూ.5,500 బోనస్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్, ఓబీ ప్రెసిడెంట్ జెట్టి మోహన్, వైస్ ప్రెసిడెంట్ బూరుగు సతీష్, జాయింట్ సెక్రటరీ జోగు ప్రదీప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కనకబోయిన రామ్మూర్తి, సీనియర్ నాయకులు దామెదర్, మాదాసు శ్రీనివాస్, దాసరి రమేష్, తంగ రాజు, అజ్మతుల్లా, అజీమ్, ఆదినారాయణ, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# గో పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానంపై జిల్లా స్థాయి గోవిజ్ఞాన పరీక్షలు



**చర్ల, భద్రాద్రి కొత్తగూడెం:** గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ అవగాహన పెంచే లక్ష్యంతో, రాష్ట్ర స్థాయి అర్హత కోసం జిల్లాస్థాయి గోవిజ్ఞాన ఎంపిక పరీక్షలు నిర్వహించారు. కొత్తగూడెం పట్టణం రామవరం స్వర్ణ భారతి ఉన్నత పాఠశాలలో గో సేవ విభాగం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యులు కేవై స్వామి నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఈ పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ రైతు యొక్క హలం, ఆవు యొక్క ఫలం దేశాభివృద్ధికి మూల స్తంభాలు అయిన గోవును రక్షించుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పరీక్షలకు ముందు జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 12 వేల మంది విద్యార్థులు పాల్గొనగా, అందులోంచి 450 మంది విద్యార్థులను ఎంపిక చేసి తుది జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వెటర్నరీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పంచగవ్య వైద్య నిపుణురాలు శైలజ, గో సేవ కార్యకర్తలు రామచంద్రరావు, రాజేశ్వరరావు, చైతన్య కిషోర్, డాక్టర్ త్రిపాల్, సతీష్ ఖండేల్వాల్, పుణ్యానాయక్, నాగచైతన్య , పట్టణ గో సేవ ప్రముఖ కుసుమ వెంకటేష్ పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

- నిందితుడు అరెస్టు, బంగారు ఆభరణాలు రికవరీ
- వివరాలు వెల్లడించిన భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్






**చర్ల, చర్ల:** తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడిన నిందితుడిని చర్ల పోలీసులు అరెస్టు చేసి, రూ.7.60 లక్షల విలువైన బంగారు ఆభ రణాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు తెలియజేశారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో సుబ్బంపేట గ్రామ శివార్లలో వాహన తనిఖీలు జరుగుతుండగా పోలీసులను చూసి ఒక వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా అతడిని వెంబడించి పట్టుకున్నట్లు చెప్పారు. విచారణలో అతను ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన ముత్యబోయిన ప్రేమ్‌చంద్ అలియాస్ బన్నీ అని తేలిందన్నారు. అతడు చర్ల మండలం గాంధీనగరంలో తన స్నేహితుడి ఇంట్లో మూడు రోజులపాటు ఉండి, తాళాలు వేసి ఉన్న ఇళ్లను గమనించేవాడన్నారు. ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి కోడిరెక్కల భాస్కరరావు ఇంట్లో తాళాలు పగులగొట్టి ప్రవేశించి 66.414 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.80,000 నగదు దొంగిలించినట్లు విచారణలో తెలిపిందన్నారు. భాధితుడి ఫిర్యాదు మేరకు చర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపారన్నారు. నిందితుడు చర్లలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి భద్రాచలం మదర్ థెరిసా కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడని, మద్యం, దురలవాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడినట్లు ఏఎస్పీ వెల్లడించారు. నిందితుడి వద్ద నుండి పూర్తి బంగారు నగలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో చర్ల సిఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ, సిబ్బంది పాల్గొన్నారు.

# మొలకలచెరువు నకిలీ మద్యం కేసులో మరో కీలక పరిణామం



**చిత్తూరు, అక్టోబరు15:** మొలకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసు లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అరెస్టై మదనపల్లి జైల్లో రిమాండ్‌లో ఉన్న పదిమంది నిందితులను ఎక్సైజ్ పోలీసుల కస్టడీకి అనుమతించింది తంబళ్లపల్లి కోర్టు. అయితే, మూడు రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. కోర్టు అనుమతితో (గురువారం) ఉదయం తమ కస్టడీలోకి తీసుకోనున్నారు ఎక్సైజ్ పోలీసులు.నకిలీ మద్యం తయారీ కేసులో పదిమంది నిందితులని ఈనెల 5వ తేదీ అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. వీరిని సమగ్ర విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని వారం రోజులకు ముందే తంబళ్లపల్లె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు ఎక్సైజ్ పోలీసులు. ఇవాళ(బుధవారం) విచారణ అనంతరం మూడు రోజుల కస్టడీకి అనుమతించింది న్యాయస్థానం. ఇప్పటివరకు మొత్తం 23 మందిపై కేసు నమోదు చేయగా.. 15 మంది నిందితులని అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ కేసులో మరో 8 మంది నిందితలు అరెస్ట్ కావాల్సి ఉంది.

# షర్మిలా మతి తప్పి మాట్లాడటం మానుకో యామిని శర్మ స్ట్రాంగ్ కౌంటర్



**విజయవాడ, అక్టోబరు15:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకి బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. షర్మిల మతి తప్పి మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. 2.0 అనేది గబ్బర్ సింగ్ ట్యాక్స్ కాదని.. గ్రేట్ సిస్టమ్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అని అభివర్ణించారు. (బుధవారం) విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు యామిని శర్మ.జీఎస్టీ 2.0.. భారత్ ఆర్థిక స్వావలంబనకు పునాది అని ఉద్ఘాటించారు. జీఎస్టీపై షర్మిల మాట్లాడింది అర్థం లేని రాజకీయ పిచ్చి ప్రచారం మాత్రమేనని ధ్వజమెత్తారు. జీఎస్టీ 2.0 సామాన్యులపై పన్ను భారాన్ని తగ్గించి.. చిన్న వ్యాపారాలకు సులభతరం చేస్తూ, రాష్ట్రాలకు మరింత ఆర్థిక స్వాతంత్ర్యం ఇస్తోందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌కి ఇవి ఎందుకు కనిపించవని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకి అభివృద్ధి కన్నా అబద్ధాల మీద రాజకీయాలు చేయడం అలవాటని విమర్శించారు యామిని శర్మ.ప్రత్యేక హోదా పేరు చెప్పి ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్‌నేనని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్‌కి ప్రత్యేక హోదా గురించి మాట్లాడే హక్కు లేదని ఫైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి హోదాని ఆచరణలో చూపిస్తోందని స్పష్టం చేశారు. కర్నూలులో జరుగబోయే జీఎస్టీ 2.0 ఉత్సవం కేవలం సభ కాదని.. ఇది రాష్ట్ర ఆర్థిక శక్తి పునరుద్ధరణ వేడుక అని అభివర్ణించారు. ఈ సభలో ప్రజలతో కలిసి ఆర్థిక సంస్కరణల సంబురాలు చేయాలని యామిని శర్మ పేర్కొన్నారు.

# అందుకే గూగుల్‌పై జగన్ అండ్ కోకి కోపం



**నెల్లూరు, అక్టోబరు15:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడసంచలన వ్యాఖ్యలు చేశారు. గూగుల్‌పై జగన్ మోహన్ రెడ్డి, ఆయన బ్యాచ్‌కు అంత కడుపు మంట ఎందుకని ఫైర్ అయ్యారు. విశాఖకు గూగుల్ రావడాన్ని వైసీపీ తప్పా అందరూ స్వాగతిస్తున్నారని చెప్పుకొ చ్చారు. నెల్లూరు వేదికగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. గూగుల్‌లో 6093 అని కొడితే జగన్ రెడ్డి జైలు జీవితం మొత్తం బయటకొస్తోందని సెటైర్లు గుప్పించారు.గూగుల్ టేకవుట్ టెక్నాలజీ ద్వారా వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన వారిని సీబీఐ గుర్తించిందని తెలిపారు. జగన్ రెడ్డి అండ్ కో గుట్టు రట్టు చేసిందని గూగుల్‌పై కోపం పెంచుకొని ఉంటారని విమర్శించారు. రాజా ఆఫ్ కరప్షన్ అని కొట్టినా జగన్ చరిత్రనే గూగూల్ చూపిస్తోందని ఎద్దేవా చేశారు. తండ్రిని అడ్డుపెట్టుకుని వేల కోట్లు దోపిడీ చేసిన అవినీతి చరిత్ర బయటకు వస్తోందని.. అందుకునే గూగుల్ అంటేనే కడుపు మంటతో జగన్ అండ్ కో రగిలిపోతున్నారని దెప్పిపొడిచారు. రూ.1.33 లక్షల కోట్లతో గూగుల్ ఏపీకి రావడం చాలా గొప్ప విషయమని ఉద్ఘాటించారు.

# లిక్కర్ షాపుల వద్ద కొత్త రూల్స్




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కల్తీ మద్యం నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు లిక్కర్ షాపులు, బార్ల వద్ద అసలైన, నాణ్యమైన మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఏపీ ఎక్సైజ్ శాఖ పలు నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇకపై లిక్కర్ షాపుల వద్ద మద్యం బాటిళ్లను ఎలా పడితే అలా అమ్మడానికి వీల్లేదు. మద్యం బాటిల్ మీద ఉన్న క్యూఆర్ కోడి స్కాన్ చేసిన తర్వాతనే మద్యం అమ్మకాలు జరపాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ఏపీ ఎక్సైజ్ శాఖ ఇప్పటికే లిక్కర్ షాపు యజమానులు, బార్ల యజమానులకు ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ఏపీ ప్రభుత్వం యాప్ తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ పేరుతో మొబైల్ అప్లికేషన్ అందుబాటులోకి తెచ్చింది.ఈ యాప్ ద్వారా మద్యం బాటిల్ మీద ఉన్న క్యూఆర్ కోడ్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాల్సి ఉంటుంది. అలా స్కాన్ చేయగానే ఆ మద్యం ఎక్కడ తయారైంది, ఎటు నుంచి ఎటు వెళ్లిందనే వివరాలు తెలుస్తాయి. ఈ నేపథ్యంలో లిక్కర్ షాపులు. బార్ల వద్ద మద్యం బాటిల్ స్కాన్ చేయడం తప్పనిసరి. అమ్మేముందు లిక్కర్ షాపు యజమానులు మద్యం బాటిల్ స్కాన్ చేసిన తర్వాతనే విక్రయించాల్సి ఉంటుంది. అలాగే తమ వద్ద విక్రయించే మద్యం.. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నాణ్యమైనది, నిజమైనదని ధ్రువీకరించాం..

# సిహెచ్‌సిలో మొదలైన సిజేరియన్ ఆపరేషన్లు

- హర్షం వ్యక్తం చేస్తున్న చర్ల ప్రజలు
- సిబ్బందిని అభినందించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే డిసిహెచ్ఎస్





**చర్ళ, చర్ల:** భద్రాద్రి జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో సైతం వైద్య సదుపాయాలు బలోపేతం అవుతున్నాయి. జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్ ప్రత్యేక దృష్టి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు చొరవ కలగలిపి జిల్లాలోని వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రులలో ఆశించిన స్థాయిలో సేవలు అందుతున్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతమైన చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. గత కొన్నాళ్ళుగా ప్రాథమిక వైద్యానికే పరిమితమైన వైద్య సదుపాయాలు నేడు స్పెషాలిటీ వైద్య సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. ఎంఎల్ఏ చొరవతో ప్రత్యేక దృష్టి పెట్టిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అదనపు ప్రోత్సాహాలు ప్రకటించి గర్భిణి స్త్రీల ఆరోగ్య రీత్యా ఒక ప్రసూతి వైద్యురాలు, ఒక పిల్లల వైద్య నిపుణుడు, ఒక మత్తు వైద్యుడిని నియమించారు. ఈ నియామకంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ప్రత్యేక చొరవ చూపించారు. ఈ క్రమంలో బుధవారం చర్ల సిహెచ్‌సిలో మొదటి సీజేరియన్ ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. చర్ల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన తన్నీరు రాజేశ్వరి మొదటి కాన్పు కోసం రాగా సుఖప్రసవం కోసం ప్రయత్నం చేసి కాన్పు చేయలేని పరిస్థితిలో తల్లి బిడ్డ క్షేమం కోసం ఎమర్జెన్సీ ఆపరేషన్ చేసి పండంటి మగ బిడ్డకి ఊపిరిపోశారు. గతంలో ప్రసూతి సేవల కోసం 60 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే పరిస్థితులు ఉండేవి. కానీ ఏజెన్సీలోని చర్లలో సైతం ప్రసూతి సేవలను అందుబాటులో తెచ్చిన ఎంఎల్ఏ తెల్లం వెంకటరావు, కలెక్టర్ జితేష్ పాటిల్, డిసిహెచ్ఎస్ రవి బాబులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న స్పెషాలిటీ సేవల పట్ల చర్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆపరేషన్ లో ప్రసూతి వైద్యురాలు శ్రావణి, పిల్లల వైద్యులు రవి కుమార్,
మత్తు వైద్యుడు శివ రామ కృష్ణ , నర్సింగ్ ఆఫీసర్ ఝాన్సీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ ఏపీ పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి



**కర్నూలు జిల్లా, అక్టోబరు15:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటనలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. పోలీసు అధికారులు ప్రణాళిక ప్రకారం సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ పర్యటనపై కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షలో అడిషనల్ డీజీ ఎన్.మధుసూదన్ రెడ్డి, ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, సెంథిల్ కుమార్, సత్యయేసు బాబు, ఫక్కీరప్ప కాగినెల్లి, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ప్రధాని మోదీ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యల ఏర్పాట్లపై డీజీపీ పలు సూచనలు చేశారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు.ప్రధాని పర్యటనలో ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన సాఫీగా, ప్రశాంతంగా జరిగేలా గట్టి చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. సామాన్య ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వీవీఐపీలు వెళ్లేంతవరకు ఎక్కడ ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు.

# ప్రధాని ఏపీ పర్యటన కొత్త అవకాశాలకు ద్వారమన్న మంత్రి




**కర్నూలు, అక్టోబర్ 15:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ (గురువారం) జిల్లాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రి అచ్చెన్నాయుడు (బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహిం చారు. సహచర మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి , కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష జరిపారు. వేదిక, భద్రత, పార్కింగ్, నీటి సదుపాయాలపై చర్చించారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించారు. ప్రతి శాఖ అధికారులు, కూటమి నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సక్రమ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సభ విజయవంతం కోసం క్షేత్రస్థాయిలో సమర్థ ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. ప్రధాని పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కొత్త అవకాశాల ద్వారమన్నా రు. ప్రజల్లో ఉత్సాహం నింపి సభను చారిత్రాత్మకంగా మార్చా లని పిలుపునిచ్చారు. ప్రధాని పర్యటన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నూతన దిశా నిర్దేశం అవుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.కాగా. ప్రధాని మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కర్నూలు ఎయిర్పోర్ట్‌కు రానున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో సుండిపెంట వెళ్లనున్నారు ప్రధాని. రోడ్డు మార్గంలో శ్రీశైలం భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. ఉదయం 11.15 గంటలకు శ్రీశైలం ఆలయంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను మోదీ దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12.10 శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం సుండిపెంటకు చేరుకొని అక్కడ నుంచి హెలికాప్టర్లో నేరుగా నన్నూరు రాగమయూరి గ్రీన్ హిల్స్ ఎలిప్యాడ్స్‌కు వస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రధాన మంత్రి బహిరంగ సభ జరుగనుంది. సాయంత్రం 4:05 గంటలకు కార్యక్రమం ముగించుకుని కర్నూలు ఎయిర్ పోర్ట్‌కు వెళ్లనున్న ప్రధాని మోదీ.. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళతారు.

# వైసీపీ కోడిగుడ్డు తెస్తే టీడీపీ గూగుల్ తెచ్చింది



**గన్నవరం, అక్టోబర్ 15:** గూగుల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రావడం గర్వ కారణమని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బుధవారం గన్నవరంలో స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. వైసీపీ కోడిగుడ్డు తెస్తే.. టీడీపీ గూగుల్‌ను తెచ్చిందన్నారు. యంగెస్ట్ స్టేట్‌గా ఉన్న ఆంధ్రప్రదేశ్ నేడు గూగుల్ రాకతో హైఎస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ స్టేట్‌గా మారిందన్నారు. గతంలో బొబ్బట్లు, అప్పడాలు, పచ్చళ్లు కంపెనీలను తీసుకొచ్చిన వారికి ఐటి కంపెనీ విలువ ఏం తెలుసంటూ వైసీపీ నేతలకు ఆయన చురకలంటించారు.కాల్ సెంటర్‌లు కూడా తీసుకురాలేని మాజీ మంత్రి డేటా సెంటర్ గురించి మాట్లాడడం విచిత్రంగా ఉందని వైసీపీ నేతను ఎద్దేవా చేశారు. అమెరికాలోని లౌడన్ కౌంటీ లాగా ఏపీకి గూగుల్ రాకతో టెక్ ఎకానమిక్ పవర్ హౌస్‌గా విశాఖపట్నం మారబో తోందంటూ సంతోషం వ్యక్తం చేశారు. 20 లక్షల ఉద్యోగాలను మంత్రి లోకేష్ ఇస్తున్నారని. వాటిని అడ్డుకోవడమే పనిగా వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. గూగుల్ రాకను వ్యతిరేకిస్తున్నారో, స్వాగతిస్తున్నారో స్పష్టంగా చెప్పాలంటూ వైసీపీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. రూ. 5 వేల కోట్లు టర్నోవర్ ఉండే కేడీసీసీ బ్యాంక్‌కు తాను చైర్మన్ అయిన తర్వాత.. రూ. 9 వేల కోట్లకు పెంచి దేశంలోనే నెం.1 స్థానంలో నిలిపానని ఆయన వివరించారు.కానీ 12 మంది డీసీసీబీ చైర్మన్‌ల పదవీ కాలాన్ని జగన్ రెడ్డి పొడిగించి తన పదవిని మాత్రం రెన్యూవల్ చేయ లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధిపై జగన్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి అది అంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. అందుకే గూగుల్ రాకపై ఆయన నోరు మెదపడం లేదన్నారు. గూగుల్ రావడం వలన ప్రయోజనాలపై వైసీపీలోని ఏ మేధావితో అయినా తాను చర్చకు సిద్ధమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సవాల్ విసిరారు.

# పదేళ్లలో ఏపీ రూపురేఖలు మారిపోతాయ్



**విజయవాడ, అక్టోబర్ 15:** ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 16 సీట్లు టీడీపీకి పట్టం కట్టారని. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అంతా కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలతో పాటు, ఏపీలోనూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేలా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ డేటా సెంటర్‌కు విశాఖ వేదిక కావడం గొప్ప విషయమని.. అమెరికా తర్వాత ఏపీకే ఈ డేటా సెంటర్ రాబోతుందని తెలిపారు. సముద్ర గర్భం ద్వారా కేబుల్ వేసి, ప్రపంచం మొత్తం లింక్ చేయబోతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి వల్ల తెలుగు వాడి ప్రతిష్ట విశ్వ వ్యాప్తం అవుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఐటీ విప్లవం తీసుకు వచ్చినప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారని గుర్తుచేశారుఇరవై ఏళ్లల్లో హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో అందరూ చూశారన్నారు. ఇప్పుడు పదేళ్లల్లో ఏపీ స్వరూపం మొత్తం మారిపోతుందని తెలిపారు. రాయలసీమలోని అనేక ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటుకు అనేక మంది ముందుకు వస్తున్నారన్నారు. చంద్రబాబు సారధ్యంలో అన్ని ప్రాంతాలను సమంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఇన్ని మంచి పనులు చేస్తుంటే... ఏపీకి పెట్టుబడులు పెట్టడం జగన్‌కు నచ్చడం లేదని విమర్శించారు. అందుకే వారి పార్టీల నాయకులతో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కోడి గుడ్డు పెట్టాలి, పొదగాలి అన్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు అసలు మాట్లాడే అర్హత ఉందా అని అన్నారు. నవంబర్ 15న ఇన్వెస్ట్‌మెంట్ మీట్ విశాఖలో జరగబోతోందని.. ఆర్థిక రాజధానిగా విశాఖ ఆదర్శంగా నిలవబోతుందని అన్నారు మంత్రి.సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజల సంక్షేమానికి సీఎం పెద్ద పీట వేశారన్నారు. ఇవన్నీ చూడలేక రాష్ట్రంలో అస్థిరిత పరిస్థితిని తీసుకువచ్చేందుకు వైసీపీ కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. నకిలీ మద్యం విషయంలో జనార్ధన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ అందరూ చూశారని.. తప్పకుండా త్వరలోనే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# 57 మందితో జేడీయూ తొలి జాబితా

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను నితీష్ కుమార్ సారథ్యంలోని జేడీయూ బుధవారంనాడు ప్రకటించింది. 57 మంది అభ్యర్థులతో ఈ జాబితా విడుదలైంది. సానాబార్సా నుంచి రత్నేష్ సదా, మోర్వా నుంచి విద్యాసాగర్ నిషద్, ఎక్మా నుంచి ధుమాల్ సింగ్, రాజ్‌గిర్ నుంచి కౌశల్ కిషోర్ వంటి ప్రముఖులు బరిలో ఉన్నారు. పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలకు కూడా టిక్కెట్ లభించింది.కేబినెట్ మంత్రి విజయ్ కుమార్ చౌదరి (సరై రంజన్), నరేంద్ర నారాయణ్ (ఆలంనగర్), నిరంజన్ కుమార్ మెహజా (బిహారిగంజ్), రమేష్ రిషి దేవ్ (సింఘేశ్వర్), కవితా సాహ (మధేపుర), గందేశ్వర్ షా (మహిషి), అతిరేక్ కుమార్ (కుషేశ్వర్‌స్థాన్) పోటీలో ఉన్నారు. ఇతర ప్రముఖుల్లో అనంత్ కుమార్ సింగ్ (మోకామ), శ్యామ్ రజక్ (ఫుల్వారి), మదన్ సాహ్ని (బహదూర్‌పూర్), శ్రీ భగవాన్ సింగ్ కుష్వాహ



(జగదీష్‌పూర్), కోమల్ సింగ్ (గ్రైఘాట్) ఉన్నారు.నియోజకవర్గాల్లో మార్పులుఈసారి టిక్కెట్ల కేటాయింపుల్లో పలు నియోజకవర్గాల్లో మార్పులు కూడా చోటు చేసుకున్నాయి. అమన్ భూషణ్ హాజారి టిక్కెట్ కేన్సిల్ చేసి కుష్వేశ్వర్‌స్థాన్ నుంచి అతిరేక్ కుమార్‌కు సీటు ఇచ్చారు. బార్ బిఘ నుంచి సుదర్శన్ టిక్కెట్‌ను ఉపసంహరించుకు న్నారు. ఆ స్థానంలో ఎవరు పోటీ చేస్తారనేది అధికారికంగా ఇంకా ప్రకటించ లేదు. టిక్కెట్ల కేటాయింపుల్లో పార్టీ నేతల్లో అసంతృప్తులు సైతం వ్యక్తమవుతున్నాయి. ఎన్డీయే కూటమిలో పెరుగు తున్న ఉద్రిక్తతలను ఈ పరిణామాలు సూచిస్తున్నా యని చెబుతున్నారు. ఎన్డీయే కూటమిలో ప్రధాన భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జేడీయూ చెరో 101 స్థానాల్లో పోటీ చేస్తుండగా, లోక్ జన్‌శక్తి (రామ్ విలాస్) 29 చోట్ల, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం చెరో 6 చోట్ల పోటీ చేస్తున్నాయి. నవంబర్ 6,11 తేదీల్లో పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

# బెదిరింపులు నాకేం కొత్త కాదులే ఆర్ఎస్ఎస్‌పై ఇక పోరాటమే

**బెంగళూరు:** ఆర్ఎస్ఎస్ కు సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలపై బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, ఇవి తమ కుటుంబానికి కొత్తవి కాదని, తన పోరాటాన్ని ఆపేది లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్ణాటక ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంలోనూ మా ధ్వని వినిపించినప్పుడు బెదరింపు కాల్స్ వచ్చాయన్నారు. నా తండ్రి మల్లికార్జున ఖర్గేకు ల్యాండ్‌లైన్‌కు ఫోన్ చేసి పలుమార్లు బెదరించారన్నారు. ఇప్పటికీ సఫ్దర్‌జంగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు కొనసాగుతోందన్నారు.బెంగళూరు సదాశివనగర్ ఇంటి ల్యాండ్‌లైన్‌కు పలుమార్లు ఫోన్ వచ్చిందన్నారు. ఇటువంటి బెదరింపు కాల్స్‌కు భయపడేది లేదన్నారు. తనకు మాత్రం నిరంతరంగా వాట్సపకాల్స్, హెచ్చరికలు వస్తూనే ఉంటాయన్నారు. ఎఫ్ఐఆర్ నమోదుకు అవకాశం ఉన్నా ఇవి ఎన్‌క్రిప్టెడ్ కాల్ కావడంతో ఎక్కడనుంచి వచ్చాయనేది గుర్తించడం కష్టతరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భయపడలేదని అధికారంలో ఉన్నప్పుడు వెనకడుగు వేయడం ఎందుకన్నారు. ఆర్ఎసఎస్ కొన్ని సంఘాలు తత్వసిద్ధాంతాల గురించి మండిపడ్డారు. నూరేళ్ల కింద



టే ఇలాంటి బెదిరింపులు ఉన్నాయన్నారు.మహాత్మాగాంధీని బలిగొన్నారని, అంబేద్కర్‌ను ముగించేందుకు ప్రయత్నించారన్నారు. ఆర్ఎస్ఎస్?కు వందేళ్ల చరిత్ర ఉంటే కాంగ్రెస్ 135 ఏళ్ల చరిత్ర కల్గిన పార్టీ అన్నారు. తాను ఒంటరి కాదని, సిద్ధాంతాల ఆధారంగా ఉంటాయన్నారు. బుద్ధ, బసవ, అంబేడ్కర్ సిద్ధాంతాలు పాటిస్తామని, రాజ్యాంగంపై అపార నమ్మకం ఉందన్నారు. ఆర్ఎసఎస్ తత్వ సిద్ధాంతాలలో అందరికీ అవకాశ ం లేదన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఏ కార్యక్రమం జరపాలన్నా అనుమతులు అవసరమని, ఏ పార్టీకైనా ఈ నిబంధన ఉంటు ందన్నారు. పదిమంది కర్రలు పట్టుకుని రోడ్డెక్కుతామంటే అనుమతులు ఉండాలన్నారు.కర్రలు తిప్పుతూ వస్తుంటే ప్రభుత్వ ం మౌనంగా ఉండాలా. అన్నారు. తాను పిలుపునిచ్చి అంబేద్కర్ వాదులంతా నీలం చొక్కాలతో కర్రలు పట్టుకుని ఊరేగుతామంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుం టుందా..? అంటూ ప్రశ్నించారు. వారికెందుకు మినహాయింపు అని ప్రశ్నిం చారు. కొన్ని పోరాటాలు సమైక్యంగా చేయాల్సి ఉంటుందని, మరికొన్ని ఒంటరిగా చేయాల్సి ఉంటుందన్నారు. కర్ణాటక ఉనికిని కాపాడుకునే విషయంలో అందరూ ఒక్కటి కావాలన్నారు. నా వ్యాఖ్యల తర్వాత సీఎం, డీసీఎం, మంత్రులు సంతోష్ లాడ్, దినేశ్ గుండూరావు మాట్లాడారన్నారు. పోరాటం తమ హక్కు అన్నారు.

# నామినేషన్ వేసిన తేజస్వి గెలుపు మాదేనంటూ ధీమా

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలో-పోటీకి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ రఘోపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీకి బుధవారంనాడు నామినేషన్‌వేశారు. వైశాలి జిల్లా హాజీపూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో తేజస్వి(35) నామినేషన్ వేశారు. తేజస్వి తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్, తల్లి రబ్రీదేవి హాజరయ్యారు.తేజస్వి యాదవ్ రఘోపూర్ నుంచి వరుసగా రెండుసార్లు గెలిచారు. హ్యాట్రిక్ గెలుపును ఆశిస్తున్నారు. ఈసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో పాటు బీహార్‌ను అభ్యుదయపథంలోకి తీసుకువెళ్లాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు.ఇంటింటికీ ఒక ప్రభుత్వ ఉద్యోగంనామినేషన్ సందర్భంగా తేజస్వి మాట్లాడుతూ, రఘోపూర్ ప్రజలు తనపై నమ్మకం ఉంచి రెండుసార్లు గెలిపించారని, మూడోసారి కూడా ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని తాము సంకల్పించామని, బిహార్‌లో నిరుద్యోగితను నిర్మూలిస్తామని అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో



పాటు రాష్ట్రాన్ని అభ్యుదయం వైపు నడిపించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. రెండు సీట్లలో పోటీ చేస్తానని కొందరు ప్రచారం చేస్తున్నారని, అయితే తాను రాష్ట్రంలోని 243 సీట్లకు పోటీ చేస్తున్నానని నవ్వుతూ చెప్పారు.జేడీయూ నితీష్‌తో లేదునితీష్ కుమార్ జేడీయూపై తేజస్వి విమర్శలు గుప్పించారు. జేడీయూను లలన్ సింగ్, సంజయ్ ఝూ, విజయ్ చౌదరి నడిపిస్తున్నారని, నితీష్‌తో జేడీయూ ఎంతమాత్రం లేదని తేజస్వి చెప్పారు. ఆ ముగ్గురు నేతలు పార్టీని బీజేపీకి అమ్మేశారని, నితీష్ కుమార్‌ను దెబ్బతీసారని ఆరోపించారు.లాలూ, రబ్రీని గెలిపించిన రఘోపూర్రఘోపూర్ నియోజకవర్గం నుంచి ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీదేవి గతంలో ఎన్నికయ్యారు. బిహార్ ముఖ్యమంత్రులుగా కూడా వారు బాధ్యతలు నిర్వహించారు. కాగా, తేజస్వి మూడోసారి రఘోపూర్ నుంచి నామినేషన్ వేయడంతో ఆయన సన్నిహితులతో పాటు, కుటుంబ సభ్యులు మిసా భారతి (పాటలీ పుత్ర ఎంపీ, పెద్ద సోదరి), రాజ్యసభ సభ్యుడు సంజయ్ యాదవ్ కూడా హాజరయ్యారు. తేజస్వి నామినేషన్ వేసే ముందు పాట్నాలోని లాలూ ఇంటి నుంచి హాజీపూర్ సబ్ డివిజన్ కార్యాలయం వరకూ 40 కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు.

# 2040 నాటికి తొలి మానవసహిత జాబిల్లి యాత్ర

**న్యూ ఢిల్లీ :** భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తొలి మానవసహిత అంతరిక్ష మిషన్ 'గగన్‌యాన్' 2027 నాటికి సిద్ధం అవుతుందని ఇస్రో వెల్లడించింది. 2040 నాటికి సిబ్బందితో కూడిన చంద్రుడిపై తొలి యాత్ర చేపట్టాలని ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారని ఇస్రో చైర్మన్ వీ నారాయణన్? తెలిపారు. అందుకు అనుగుణంగానే 2040 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఝూరండ్ రాజధాని రాంచీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 35 వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.80వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్ల తయారీఅంతరిక్ష రంగ అభివృద్ధి కోసం ప్రస్తుతం ఇస్రో అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు వెల్లడించారు. 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, వాటిలో 80వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్లను తయారుచేయడం, చంద్రుడిపై అధ్యయనం కోసం వీనస్ ఆర్బిటర్ మిషన్ ఏర్పాటు వంటి లక్ష్యాలను ఏర్పరుచుకున్నామని తెలిపారు. అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , రోబోటిక్స్ బిగ్ డేటా వంటివాటిని ఉపయోగించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు 2027లో ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు ఇస్రో చైర్మన్ వీ నారాయణన్? వెల్లడించారు."2040 నాటికి స్వదేశీ సిబ్బందితో చంద్రుడిపై మిషన్ పూర్తి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకాలు ఇచ్చారు. దీని ద్వారా మన పౌరులను చంద్రుడిపైకి దింపి సురక్షితంగా తిరిగి తీసుకురావాలి. మోదీ స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో అంతరిక్ష రంగానికి సంస్కరణలు ప్రవేశపెట్టారు. భారతీయ అంతరిక్ష కేంద్రం () 2035 నాటికి అందుబాటులోకి వస్తుంది. అంతరిక్షంలో ప్రారంభ మాడ్యూల్స్ 2027 నాటికి అందుబాటులోకి వస్తాయి. కొన్ని సంవత్సరాల క్రితం అంతరిక్ష రంగంలో కేవలం ఒకటి లేదా రెండు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవి. కానీ, ఈరోజు ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణలపై 300 కంటే ఎక్కువ మంది పనిచేస్తున్నారు. వ్యవసాయం, విపత్తు ప్రతిస్పందన, నిర్వహణ, టెలికమ్యూనికేషన్, రియల్-టైమ్ రైలు, వాహన పర్యవేక్షణలో ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల అధ్యయనానికి ఇవి ఉపయోగపడతాయి. 35 సంవత్సరాల క్రితం కంప్యూటర్ విప్లవాన్ని ఎవరూ ఊహించనట్లుగా, అలాగే , రోబోటిక్స్ అంతరిక్ష పరిశోధన తదుపరి యుగాన్ని నిర్వచిస్తాయి"

# 57మందితో తొలి జాబితా విడుదల చేసిన జేడీయూ

బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ యునైటెడ్ జేడీ(యూ) బుధవారం 57 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. మొత్తం 101 స్థానాల్లో పోటీ చేయనున్న జేడీయూ, మిత్రపక్షమైన చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్‌జన్ శక్తి పార్టీ కోరుతున్న 4 స్థానాల్లో సైతం జేడీయూ అభ్యర్థులను ఖరారు చేయడం గమనార్హం.2020 ఎన్నికల్లో జేడీ(యూ) గెలిచిన మోర్వా, సోన్‌బర్సా, రాజ్‌గిర్, గైఘాట్, మతిహాని అసెంబ్లీ స్థానాలను వదులుకోకూడదని నితీశ్ గట్టిగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అందుకే పదేపదే చర్చలు జరిపినప్పటికీ, ఈ బలమైన నియోజకవర్గాలను వదులుకోవడానికి జేడీ(యూ) ఇష్టపడడం లేదు.వేగంగా పావులు కదుపుతున్న నితీశ్‌బిహార్‌లో మిత్రపక్షం బీజేపీ తమ అభ్యర్థుల జాబితా ప్రకటించిన ఒక్కరోజు తరువాత జేడీ(యూ) తమ తొలి అభ్యర్థుల లిస్ట్‌ను విడుదల చేసింది. వీరిలో ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న ఐదుగురు నేతలు కూడా ఉన్నారు. వీరితోపాటు అనంత్ కుమార్ సింగ్ సహా ముగ్గురు బలమైన వ్యక్తులు, నలుగురు మహిళా అభ్యర్థులు కూడా ఉండడ విశేషం.జేడీ(యూ) మొదటి జాబితాలో చోటు దక్కించుకున్న మంత్రులు ఏయే స్థానాల నుంచి బరిలోకి



దిగుతున్నారంటే గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రవణ్ కుమార్-నలంద, జలవనరుల మంత్రి విజయ్ కుమార్ చౌదరి - సరైరంజన్, సమాచార, ప్రజా సంబంధాల మంత్రి మహేశ్వర్ హజారి -కల్యాణ్‌పూర్, సాంఘిక సంక్షేమ మంత్రి మదన్ సాహ్ని -బహదూర్‌పూర్, ప్రొహిబిషన్ మినిస్టర్ రత్నేశ్ సదా - సోంబార్సా అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగుతున్నారు.ఇక జేడీ(యూ) మొదటి జాబితాలో నలుగురు మహిళా అభ్యర్థులు ఉన్నారు. వీరిలో కవితా సాహా - మాధేపుర, కోమల్ సింగ్- గైఘాట్, అశ్వమేధ దేవి- సమస్తిపూర్, రవీనా కుష్వాహ - విభూతిపూర్ నుంచి పోటీ చేయనున్నారు. అయితే జేడీయూ ఫస్ట్ జాబితాలోని 57 మంది అభ్యర్థుల్లో 30 మంది కొత్తవారు కావడం గమనార్హం.243 మంది సభ్యులు గల బిహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో బీజేపీ, జేడీ(యూ) చెరో 101 స్థానాల నుంచి పోటీ చేయనున్నాయి. కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)- 29 సీట్లు, కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం)- 6 సీట్లు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహ సారథ్యంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం)- 6 సీట్లలో పోటీ చేయనున్నాయి.పోటీకి దూరంగా ప్రశాంత్ కిశోర్‌మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సమయంలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని ప్రకటించారు. పార్టీ కోసం ఎన్నికల్లో పని చేస్తానని, పోటీకి దూరంగా ఉంటున్నట్లు తెలిపారు.

# ఏడో తరగతి ఫెయిలైన డిప్యూటీ సీఎం పై గొప్ప వైద్యుడిని బరిలో దించాం

**బీహార్ :** బీహార్ లో అసెంబ్లీ ఎన్నికల సందడి జోరందుకుంది. అన్ని పార్టీల నేతలు అభ్యర్థుల ఎంపికలో బిజీబిజీగా ఉన్నారు. ఈ విషయంలో జన్ సురాజ్ పార్టీఒక అడుగు ముందే ఉంది. మొత్తం 243 స్థానాలకుగాను ఇప్పటికే రెండు జాబితాల్లో 116 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది.ఈ నేపథ్యంలో జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్‌ను పట్నాలో మీడియా పలుకరించింది. ఎన్నికల్లో మీరు వ్యక్తిగతంగా ఎందుకు పోటీ చేయడం



లేదని ప్రశ్నించింది. అన్ని స్థానాల్లో తన పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడమే తన లక్ష్యమని, తాను ప్రత్యేకంగా పోటీ చేయాల్సిన అవసరం లేదని అన్నారు.బీహార్‌లో అధికారమే లక్ష్యంగా తాము బరిలో దిగుతున్నామని పీకే చెప్పారు. ఈ ఎన్నికల్లో 243 స్థానాలకుగాను 150 స్థానాలు గెలువాలన్నది తమ టార్గెట్ అన్నారు. 150 స్థానాలకు ఒక్క స్థానం తగ్గినా తాము ఓడినట్లుగానే పరిగణిస్తామని ధీమా వ్యక్తంచేశారు. తమ పార్టీ నుంచి గొప్పగొప్ప వ్యక్తులను బరిలో దించుతున్నమన్నారు.తారాపూర్ నియోజకవర్గంలో జన సురాజ్ పార్టీ తరఫున ఓ గొప్ప వైద్యుడిని బరిలో దించామని ప్రశాంత్ కిశోర్ తెలిపారు. ఏడో తరగతి ఫెయిలైన డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరిని ఈ ఎన్నికల్లో ఆ వైద్యుడు ఓడించి తీరుతారని అన్నారు. బీజేపీ నాయకుడైన సామ్రాట్ చౌదరి ఎన్డీయే కూటమి తరఫున మరోసారి తారాపూర్ నుంచి పోటీచేస్తున్నారు.

# బీజేపీ రెండో జాబితా అలీనగర్ నుంచి సింగర్ మైథిలీ ఠాకూర్

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల రెండవ జాబితాను భారతీయ జనతా పార్టీ బుధవారంనాడు విడుదల చేసింది. 12 మంది అభ్యర్థులు, వారు పోటీ చేసే నియోజకవర్గాలను తాజాగా ప్రకటించింది. ఈసారి టెక్కెట్ దక్కిన వారిలో ఫోక్ సింగర్ మైథిలీ ఠాకూర్ మాజీ ఐపీఎస్ అధికారి ఆనంద్ మిశ్రా తదితరులు ఉన్నారు. అలీనగర్ నియోజకవర్గం నుంచి మైథిలీ ఠాకూర్ పోటీ



చేయనుండగా, బక్సర్ నుంచి ఆనంద్ మిశ్రా పోటీ చేస్తారు.బిహార్‌లోని మధుబని జిల్లా బేనిపట్టికి చెందిన మైథిలీ ఠాకూర్ ఇటీవల బీజేపీలో చేరారు. అవకాశం వస్తే తన సొంత నియోజకవర్గం నుంచి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని చెప్పారు. మైథిలీ ఠాకూర్‌ను బిహార్ 'స్టేట్ ఐకాన్'గా కూడా ఎన్నికల కమిషన్ గతంలో నియమించింది. రాష్ట్రానికి సాంస్కృతిక అంబాసిడర్‌గా కూడా గుర్తింపు తెచ్చుకున్నారు. క్లాసికల్, ఫోక్ సంగీతంలో శిక్షణ పొందిన ఆమెకు బిహార్ ఫోక్ మ్యూజిక్‌కు చేసిన సేవలకు సంగీత నాటక అకాడమీ 2021లో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందజేసింది.కాగా, మైథిలీ ఠాకూర్‌తో పాటు మరో మహిళా అభ్యర్థి ఛోటీ కుమారికి ఛాప్రా సీటును బీజేపీ కేటాయించింది. బీజేపీ మొత్తం 101 స్థానాలకు గాను ఇంతరకూ 83 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. సోమవారంనాడు తొలి జాబితాలో 71 మంది అభ్యర్థులకు టిక్కెట్లు ఇచ్చింది. బిహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతలుగా నవంబర్ 6,11 తేదీల్లో పోలింగ్ జరుగనుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

# మరణశిక్ష పడిన ఖైదీకి ఆప్షన్ ఇవ్వలేమన్న కేంద్రం

**న్యూ ఢిల్లీ :** మరణశిక్ష పడిన ఖైదీలకు ప్రస్తుతం అనుసరిస్తున్న ఉరితీత విధానాన్ని తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. అయితే మరణశిక్ష అమలులో ఉరితీత విధానాన్ని మార్చే ఉద్దేశం లేదని కేంద్రం కోర్టుకు తెలిపింది. దాంతో ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. కాలానుగు



ణంగా మార్పులను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ సమస్య అని వ్యాఖ్యానించింది.సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా ఈ పిటిషన్ దాఖలు చేశారు. మరణశిక్ష పడిన ఖైదీకి కనీసం ఉరితీతా? లేదంటే ప్రాణాంతక ఇంజెక్షనా? అనే ఆప్షన్ ఎంచుకునే అవకాశమైనా ఇవ్వాలని పిటిషనర్ తన పిటిషన్‌లో కోరారు. అమెరికాలోని 49 రాష్ట్రాలు మరణశిక్ష అమలులో ప్రాణాంతక ఇంజెక్షన్ విధానాన్ని అనుసరిస్తున్నాయని, దానివల్ల మరణ సమయంలో శిక్షపడ్డ నేరస్థుడికి తక్కువ వేదన ఉంటుందని ఇప్పటికే పలు అధ్యయనాల్లో తేలిందని పిటిషనర్ పేర్కొన్నారు.దాంతో సుప్రీం ధర్మాసనం.. పిటిషనర్ ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలలని, దాన్ని పరిగణించేలా చూడాలని ప్రభుత్వ తరఫు న్యాయవాదికి సూచించారు. అయితే పిటిషనర్ సూచన సాధ్యమయ్యేది కాదని, దాన్ని ఇప్పటికే తమ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్నామని న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇది విధానపరమైన నిర్ణయమని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటుచేసే అంశాన్ని గతంలో పరిశీలించినట్లు తెలిపారుప్రభుత్వ తరఫు న్యాయవాది సమాధానంపై ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. కాలానుగుణంగా ఎన్నో అంశాల్లో మార్పులు వచ్చాయని, కానీ ప్రభుత్వం మాత్రం ఆ మార్పులను స్వీకరించేందుకు సిద్ధంగా లేదని, అదే ఇక్కడ సమస్యగా మారిందని వ్యాఖ్యానించింది. అయితే ప్రస్తుతానికి దీనిపై తాము ఎలాంటి విధానపరమైన ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబర్ 11కు వాయిదా వేసింది.

# పుతిన్ యుద్ధాన్ని ఎందుకు కొనసాగిస్తున్నాడో తెలియదు

**ఉక్రెయిన్:** ఉక్రెయిన్‌లో లో యుద్ధాన్ని కొనసాగించడంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంసతృప్తి వ్యక్తం చేశారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద వివాదంగా ఈ యుద్ధాన్ని అభివర్ణించారు. పుతిన్‌తో తనకు చాలా మంచి సంబంధాలు ఉన్నాయని.. బహుశా ఇప్పటికే అలాగే ఉన్నాయని చెప్పుకొచ్చారు. పుతిన్ ఈ యుద్ధాన్ని ఎందుకు కొనసాగిస్తున్నాడో నాకు తెలియదని.. కానీ, యుద్ధం అంత



మంచిది కాదన్నారు. అమెరికా అధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశానికి ముందు.. ట్రంప్ వైట్‌హౌస్‌లో అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో జరిగిన ద్వైపాక్షిక సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నాలుగు సంవత్సరాలుగా జరుగుతుందని.. ఈ యుద్ధం వారంలోనే పూర్తవ్వాల్సి ఉందని.. రష్యా 1.50లక్షల మంది సైనికులను కోల్పోయారన్నారు. ఇది భయంకరమైన యుద్ధమని.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన మరణాల పరంగా అతిపెద్ద సంఘటనగా పేర్కొన్నారు.

# అఫ్గాన్‌కు స్నేహహస్తంలో దౌత్యనీతి

ప్రపంచం చాలా విస్తృతం అయిన ప్రాంతం. ఎవరితో అయినా మంచిగా ఉండడమే అవసరం. దౌత్యనీతి కూడా అంతే. ఫలానా వారి కూటమిలో ఉన్నాం కనుక ఇతరులతో సంబంధ బాధవ్యాలు వద్దనుకునే రోజులు కావివి. ఎవరితో అయినా అంటే పొరుగుదేశాలతో సత్సంబంధాలు నెరపాల్సిందే. అఫ్గనిస్తాన్‌లో తాలిబన్ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత ఆ దేశ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తఖీ ఇటీవల భారత్ రావడం, ఆ దేశం కూడా సత్సంబంధాలు కోరుకోవడానికి సూచికగా చూడాలి. మనం ఇరుగుపొరుగుతో మంచిగా ఉండాలని చూడడంలో తప్పులేదు. పాక్‌తో కూడా స్నేహహస్తం చాచినా అందిపుచ్చుకోలేని దౌర్భాగ్యం పాక్ పాలకులది. వారు భారత్‌లో ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న క్రమంలో ఇటీవల ఆపరేషన్ సిందూర్ తో గట్టిగా బుద్ది చెప్పాం. అయినా దాని గుణం మారడం లేదు. ముఖ్యంగా తాలిబన్లకు పాక్‌తో గొడవులు ఉన్నాయి. మనతో ఎలాంటి గొడవు లేవు. ఈ క్రమంలో మనతో బంధం పటిష్టం చేసుకోవాలని, మన సాయం పొందాలని అఫ్గనిస్తాన్ కోరుకుంటోంది. దీనిని అంగీకరించడం ద్వారా పాక్‌కు చెక్ పెట్టే అవకాశం వచ్చింది. అఫ్గాన్‌తో స్నేహం వల్ల ప్రయోజనాలే తప్ప నష్టం లేదని విదేశాంగ నిపుణులు కూడా చెబుతు న్నారు. ఇదో రకంగా వ్యూహాత్మక అడుగుగా భావిస్తున్నారు. అలాగే చైనా, అమెరికాలకు చెక్ పెట్టే అవకాశం కూడా ఉంది. నిజానికి ఏ దేశ దౌత్య నీతి అయినా దాని సొంత ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుంది. అన్ని దేశాలూ స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటాయి. రష్యాతో చమురు బేరంపై అమెరికా కక్షకట్టినా మనం పెద్దగా పట్టించుకోలేదు. సుంకాలు విధించినా మనం బెదరలేదు. ఇప్పుడు అమెరికాకు మెల్లగా తెలిసి వస్తోంది. భారత్ పవర్ ఏమిటో ట్రంప్ రుచి చూస్తున్నారు. ఈ క్రమంలో తాలిబాన్లతో చిగురిస్తున్న భారత మైత్రి కూడా అంతే. మనతో స్నేహం కోసం వచ్చిన వారిని కాదనలేం. అలాగే తాలిబన్ ప్రభుత్వాన్ని ఇప్పటికీ గుర్తించలేదు. ఓ రకంగా చెప్పాలంటే ఇదొక ఆసక్తికరమైన పరిణామంగానే చూడాలి. దీనిని కొందరు రాజకీయం చేస్తూ...తాలిబన్లతో జతకట్టడమేంటని విమర్శలు చేస్తున్నారు. ఇది వారి సంకుచిత ఆలోచనలను సూచిస్తుంది. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇలా వ్యవహరించడమేంటని దేశంలోని కొందరికి సహజంగా అశ్చర్యం కలిగించవచ్చు. కానీ విదేశాంగ విధానంలో ఇదో గొప్ప ముందడుగుగా చూడాలి. అఫ్ఘానిస్తాన్‌లోని తాలిబాన్లకు పాలానుభవం తక్కువ. మతఛాందసమే వారి ఎజెండా. అయితే దేశంలో ఇది సాగినా ప్రపంచంలో సాగదు. అందుకే వారు కూడా చెలిమి కోసం పరితపిస్తున్నారు. ఈ కారణంగానే వారు పాక్‌తో వైరం కారణంగా భారత్‌కు చేరువవుతున్నారు. అఫ్ఘానిస్తాన్ తాలిబాన్ల ప్రభుత్వాన్ని రష్యా మినహా భారత్‌తో సహా ప్రపంచ దేశాలు ఏవీ ఇప్పటి వరకు గుర్తించలేదు. అఫ్ఘానిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అమీర్‌ఖాన్ ముత్తఖీని మోదీ సర్కారు స్వాగతించడం మారుతోన్న దౌత్య సమీకరణాలకు సంకేతంగా చూడాలి. తాలిబాన్లు అనేవారిని సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా పాక్,అ అమెరికా, ఇరాన్, ఇరాక్ లాంటి దేశాలు పెంచి పోషించాయి. అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ సేనలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి అమెరికాతో సహా పాశ్చాత్య దేశాలన్నీ కలిసికట్టుగా పాక్ సహకారంతో తాలిబాన్లను రూపొందించారు. వీరంతా తిరుగుబాటు చేసి ఆనాటి దేశ అధ్యక్షుడు నజీబుల్లాను పదవీచ్యుతిడిని చేసి ఉరితీసి చంపారు.



తాలిబాన్లకు వ్యతిరేకంగా పోరాడిన అహ్మద్ షా మసూద్‌కు భారత్ అన్ని విధాలుగా సహాయమందించింది. తాలిబాన్ల మొదటి ప్రభుత్వం 1996-2001లో అఫ్ఘానిస్తాన్‌లో పాకిస్థాన్‌కు ఆడింది ఆటగా సాగింది. ఆ తర్వాత అమెరికా, నాటో దేశాల చేతుల్లో కీలు బొమ్మలు అయిన పాలకులు 2021 వరకు అఫ్ఘానిస్తాన్‌ను పరిపాలించినా తాలిబాన్లను నిర్మూలించలేకపోయారు. అమెరికా నిష్క్రమణ అనంతరం 2021లో అఫ్ఘానిస్తాన్‌లో మళ్లీ అధికారాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబాన్లు ఈ సారి పాక్ పాలకుల కనుసన్నలలో కాకుండా స్వతంత్రంగా బాహ్య ప్రపంచం వైపు చూడడం మొదలుపెట్టారు. పాకిస్థాన్‌తో విబేధిస్తూ తమ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్య మివ్వడం ప్రారంభించారు. దీనికితోడు వారి సరిహద్దు సమస్య తీవ్రంగా ఉంది. ఫక్తూన్ ప్రాంతం తమదని వారు బ్రిటిష్ కాలం నుంచే పోరాడుతున్నారు. ఓ రకంగా బ్రిటిష్ గీసిన సరిహద్దును అఫ్గాన్లు ఎప్పుడూ సమర్థించడం లేదు. అంగీకరించడం లేదు. దాయాది దేశానికి ఊపిరాడనివ్వకుండా చేస్తోన్న తాలిబాన్లతో భారత్ వ్యూహాత్మక స్నేహం మన దేశ ప్రయోజనాలు లక్ష్యంగా ఉన్ననడంలో ఎలాంటి సందేహం లేదు. భారత్‌కు చెప్పుకోదగ్గ ఈ దౌత్య విజయం డోనాల్డ్ ట్రంప్ చేసిన గాయాల తర్వాత ఒక ఉపశమనంగా చూడాలి. గతంలో పాకిస్థాన్ చెప్పినట్లుగా తాలిబాన్ల అధినాయకుడు ముల్లా ఉమర్ నడువగా ఇప్పుడు అతని కుమారుడు, ప్రస్తుత రక్షణమంత్రి ముల్లా యాఖూబ్ మాత్రం భిన్నంగా నడుచుకుంటున్నాడు. అఫ్ఘానిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రి ముత్తఖీ భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశం కావడం పాకిస్తాన్‌ను కలవరపరిచిందనే చెప్పాలి. ఓవైపు అంతర్గత దాడులు, వేర్పాటు వాదలు విజృంభణ వంటి సమస్యలు ఎదుర్కొంటున్న పాక్ ఈ పరిణామాన్ని ఊహించలేదు. అమెరికాతో జతకట్టిన సంబరంలో భారత్‌కు పక్కలో బల్లెంగా మారాలని కలలు కంటున్న తరుణంలో ఇది ఓ కొత్త తలనొప్పి అని చెప్పక తప్పదు. ఇకపోతే పహల్గాంలో ఉగ్రదా డిని పాకిస్థాన్ పేరు ప్రస్తావిస్తూ అఫ్ఘానిస్తాన్ మాత్రం నిర్ద్వం ద్వంగా ఖండించింది. ఇది మాములు విషయం కాదు. భారత దౌత్యనీతికి విజయం. మొత్తంగా మనకు వ్యతిరేకంగా అమెరికా పాక్‌ను దువ్వడం, అఫ్గాన్ మనకు చేరువ కావడం అన్నది ప్రపంచంలో మారుతున్న సమీకరణాల కు సంకేతంగా చూడాలి. ఇందులో దేశ ప్రయోజనాలే తప్ప మరోటి ఎంతమాత్రం లేదు. అఫ్గాన్ ద్వారా మనం లబ్ది పొందే అవకాశం దక్కడంతో పాటు, పాక్‌కు చెక్ పెట్టేందుకు మరింత బలం చేకూరిందనే చెప్పాలి.

# నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా...

**ప్రజల వద్దకే వెళ్లి వారినే అడుగుతా**

**ప్రజల్లో మమేకం కావడం ద్వారా దారివేస్తా**

**జాగృతి జనం బాట చేపట్టిన కవిత**

**పోస్టర్ ఆవిష్కరణలో సంచలన విషయాలు వెల్లడి**




**హైదరాబాద్,అక్టోబర్15:** జాగృతి జనం బాట పేరుతో కల్వకుంట్ల కవిత తెలంగాణలోని జిల్లాల్లో యాత్ర చేసేందుకు సిద్ధమయ్యారు. ఓ రకంగా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా జాగృతిని తీసుకుని వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. అలాగే ఇది బిఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా చేస్తున్న దండయాత్రగానే చూడాలి. ఈ సందర్భంగా బుధవారం నాడు యాత్రపై మీడియాతో కవిత మీట్లాడుతూ.. నాలుగు నెలల పాటు యాత్ర ఉంటుందని.. ప్రతి జిల్లాల్లో రెండు రోజులు ఉంటామన్నారు. జిల్లాల్లో ఉన్న అన్ని వర్గాల ప్రజలతో కలిసి మాట్లాడతామని చెప్పారు. జాగృతి జనం బాట పోస్టర్‌ను కవిత విడుదల చేశారు. పోస్టర్‌పై తెలంగాణ తల్లి, జయశంకర్ ఫోటోలు ఉన్నాయి. కేసీఆర్ ఫోటో లేకుండానే కవిత పోస్టర్‌ను విడుదల చేశారు. అంతేకాకుండా కేసీఆర్ ఫోటో తీసేయడానికి కారణాలు కూడా కవిత మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. సామాజిక తెలంగాణ కోసం ఏం చేయాలనే విషయాలను ప్రజల నుండే తెలుసుకుంటా మన్నారు. సామాజిక తెలంగాణ అంటే నినాదం కాదు విధానమని వివరించారు. తాము ఉన్నన్ని రోజులు సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే గురువులన్నారు. పెద్ద పెద్ద నాయకులను కూడా ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారని గుర్తుచేశారు. ప్రజల దగ్గరికి వెళ్ళి సమస్యలు తెలుసుకుంటామని కవిత అన్నారు. కేసీఆర్ ఫోటో లేకుండానే యాత్ర చేస్తామన్నారు కవిత. కేసీఆర్ లేకుండా తెలంగాణ రాలేదని.. అయితే కేసీఆర్ ఫోటో పెట్టుకుంటే నైతికంగా కరెక్ట్ కాదని చెప్పుకొచ్చారు. 'నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా' అని అన్నారు కవిత. జాగృతి పెట్టినప్పుడు కూడా కేసీఆర్ ఫోటో పెట్టలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జాగృతి పెట్టినప్పుడు జయశంకర్ ఫోటో పెట్టామన్నారు. కేసీఆర్‌కు పుట్టడం తన అదృష్టమని.. 'మా దారులు వేరే అయినప్పుడు నా లైన్ నేను తీసుకోవడం కరెక్ట్' అని అన్నారు. కేసీఆర్ ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారని.. ఆ పార్టీ నుండి తనను సస్పెండ్ చేశారని తెలిపారు. నైతికంగా కరెక్ట్ కాదనే కేసీఆర్ ఫోటో తీసేస్తున్నట్లు వెల్లడించారు. దుర్మార్గుల నుంచి చెట్టును కాపాడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశానని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. జాగృతి మొదటి నుంచి స్వతంత్రంగా పని చేసిందని.. కేసీఆర్ నుంచి ఒక్క ఆలోచన తీసుకోలేదన్నారు. తాను బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత పార్టీతో జాగృతి అనుసంధానంగా పని చేసిందని వివరించారు. తన సస్పెన్షన్‌కు కారణాలను విశ్లేషించుకున్నానని తెలిపారు. పేగులు తెగేదాక తెలంగాణ కోసం కోట్లాడానని అన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నామని..సామాజిక తెలంగాణ సాధించుకోలేక పోయామని వ్యాఖ్యలు చేశారు. సామాజిక తెలంగాణ కోసం మాట్లాడడం తప్పా అని ప్రశ్నించారు. ఏదో తప్పు మాట్లాడినట్టు చూపించి కుట్ర చేసి బయటకి పంపారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్న రంగం లేదన్నారు. అనేక సమస్యలు తెలంగాణను పట్టి పీడిస్తున్నాయన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారాన్ని పక్కన పెట్టి ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్క రూపాయి కూడా తేలేకపోతున్నారని విమర్శించారు. పది సంవత్సరాల్లో తెచ్చిన ఫలితాలు ఇప్పుడు అందడం లేదని కవిత వ్యాఖ్యలు చేశారు. 'పార్టీ వద్దనుకున్నాక పదవి ఎందు కు. చాలా క్లారిటీతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశా. రాజీనామా చేసిన తర్వాత కూడా ఆమోదించడం లేదు. రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్ రాజకీయం ఏంటో పార్టీ పెట్టాలో లేదో ఇప్పటికీ క్లారిటీ లేదు. ప్రజలతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటాను. ప్రజలే గురువులు. కాబట్టి ఏం చేయాలో వారినే అడుగుతా. కేసీఆర్‌కు మచ్చ రాకుండా ఉండాలనే ప్రయత్నం చేశాను. కానీ నన్ను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దారులు వేసినప్పుడు ధైర్యం ఉండాలి. బనకచర్ల, గోదావరి జలాలు లాంటి అన్ని అంశాలను మాట్లాడుతాం. యూరియా నుండి బస్సుల దాకా అన్ని రంగాల్లో సమస్యలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ చిన్న విషయం. ఉపఎన్నికతో జాగృతికి సంబంధం లేదు' అని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# అలనాటి గాయని రావు బాలసరస్వతి దేవి అస్తమయం


**● అనేక చిత్రాల్లో పాటలు పాడిన ఘనత ఆమెది**




**హైదరాబాద్,అక్టోబర్15:** అలనాటి గాయని రావు బాలసరస్వతి దేవి (97) అనారోగ్యంతో హైదరాబాద్ మణికొండ లోని స్వగృహంలో బుధవారం ఉదయం 8 గంటలకు తుదిశ్వాస విడిచారు. 1928 ఆగస్ట్ 29న జన్మించిన రావు బాలసరస్వతి గొంతు ఆకాశవాణి సంగీత కార్యక్రమాల తో తెలుగు వారికి సుపరిచితం. ఆకాశ వాణి కార్యక్రమంతో తెలుగు వారికి పరిచ యమయ్యారు. 'సతీ అనసూయ' చిత్రంలో తొలి పాటను ఆలపించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీతో పాటు పలు భాషల్లో 2000కు పైగా పాటలు పాడారు. బాల సరస్వతి అసలు పేరు సరస్వతిదేవి. చిన్నప్పటి నుంచే పాటలు పాడడంతో అందరూ ఆమెను బాలసరస్వతి అని పిలిచారు. దీంతో ఆమెకు బాలసరస్వతిగా గుర్తింపు వచ్చింది. 'సతీఅనసూయ ధ్రువవిజయం' అనే చిన్నపిల్లలు నటించిన సినిమాలో గంగ పాత్రలో బాల సరస్వతి కనిపించారు. తల్లిదండ్రులకు ఇష్టం లేకపోవడంతో పాటు నటనపై ఆసక్తి లేకపోవడంతో ఆ తర్వాత అవకాశాలు వదులుకున్నారు. సినిమాలలో తొలి నేపథ్య గాయనిగానూ ఆమె ఎంతో పేరు తెచ్చుకున్నారు. 'స్వప్నసుందరి, పిచ్చిపుల్లయ్య, పెళ్ళిసందడి, శాంతి, షావుకారు, దేవదాసు, లైలా మజ్ను, భాగ్యలక్ష్మి, మంచి మనసుకు మంచి రోజులు' తదితర చిత్రాల్లో ఘంటసాల, ఏ.ఎం.రాజా, సౌందర్‌రాజన్, పితాపురం నాగేశ్వరరావు, జిక్కి, ఏ.పి. కోమల లాంటి వారితో కలిసి ఆమె పాటలు పాడారు. రావు బాల సరస్వతి అసలు పేరు సరస్వతి. తల్లి తండ్రుల పేర్లు విశాలాక్షి, కావేటి పార్థసారధి. ఆమె తండ్రి గాయకులు, ప్రధానంగా వీణ, సితారు వాయించేవారు. చెన్నై లో కొంత కాలం ఉండి అనంతరం గుంటురుకి మారారు. ఆలకూరు సుబ్బయ్య వద్ద బాల సరస్వతి 1939లో కర్ణాటక సంగీతం మూడు సంవత్సరాలు అభ్యసించారు. ఆపైన బాల సరస్వతిని ఆమె తండ్రి ముంబై తీసుకెళ్ళి, హిందుస్తానీ సంగీత ప్రముఖులైన ఖేల్కర్, సినీ సంగీత దర్శకులు వసంత్ దేశాయ్ వద్ద అభ్యాసం చేయించారు. అలానే మద్రాసులో పిచ్చుమణి అయ్యర్ దగ్గర ఆమె వీణ నేర్చుకున్నారు. సి. పుల్లయ్య దర్శకత్వం వహించిన 'సతీ అనసూయ'లో రావు బాలసరస్వతి గంగ వేషం వేశారు. ఆ యూనిట్ లో ఆమె చిన్నపిల్ల. దానికి ఆకుల నరసింహారావు సంగీత దర్శకులు. చిన్నప్పుడు పాటలు పాడటానికి వెళ్ళినప్పుడు ఆమెను బేబీ సరస్వతి అని పిలిచేవారు. ఆ తర్వాత బాల సరస్వతి అనడం మొదలు పెట్టారు. అదే చివరకు ఆమె పేరు అయిపోయింది. బాల సరస్వతి సుమారు 12 సినిమాలలో బాల నటిగా కనిపించారు. 1943లో ప్లే బ్యాక్ కొత్తగా వచ్చింది. దానికి ముందు ఎవరి పాటలు వారే పాడుకునే వారు. ఆ సమయంలో భాగ్యలక్ష్మి సినిమాకు మొట్టమొదటగా ప్లే బ్యాక్ పాడారు బాల సరస్వతి. పెద్దాయక ఆమె తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషా చిత్రాలలో పాటలు పాడారు. ముఖ్యంగా శ్రీశ్రీ, ఆరుద్ర, కొసరాజు, కృష్ణశాస్త్రి రాసిన పాటలను ఆమె ఎక్కువగా పాడారు.కోలంక జమిందారీకి చెందిన రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు ఆమెను 1944లో వివాహమాడారు. జమిందారీ కట్టుబాట్ల వల్ల, నటిగా సినిమాల్లో పాల్గొనడం తగ్గించారు. రాను రాను సినీ నేపథ్య గాయనిగా ఎన్నో అవకాశాలు వచ్చినా వదులుకోవాల్సి వచ్చింది. అయితే ఆమె ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో ఎన్నో లలిత గీతాలు ఆలపించారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ మొదలైన దక్షిణ భారత భాషల్లో సైతం ఎన్నో పాటలు పాడారు. 1974లో విజయనిర్మల దర్శకత్వం వహించిన 'సంఘం చెక్కిన శిల్పాలు' చిత్రంలో ఆమె పాట పాడారు. అదే సమయంలో సి. నారాయణరెడ్డి రాసిన మీరా భజన్స్ నూ గానం చేశారు. అష్టపదులు, తరంగాలు, జావళీలు, తెలుగు మీరా భజనలు, లలిత గీతాలను సాలూరి హనుమంతరావు, సాలూరి రాజేశ్వర రావు, రమేష్, బాలాంత్రపు రజనీకాంత రావు, పెండ్యాల నాగేశ్వర రావు మొదలైన ప్రముఖ సంగీత కర్తల నిర్దేశకత్వరలో ఆమె పాడగా,

# సీనియర్ టీచర్లకు టెట్ తిప్పలు

ఉపాధ్యాయులందరూ సర్వీసులో కొనసాగాలంటే తప్పనిసరిగా రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగం నుంచి రిటైర్ కావాలని సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. అయిదేళ్లలోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు కూడా ప్రమోషన్ కావాలంటే టెట్ పాస్ కావాల్సిందేనని కోర్టు వెల్లడించింది. 2010 ఆగస్టు 23కు ముందు దేశవ్యాప్తంగా నియామకమైన ఉపాధ్యాయుల్లో దాదాపు 25 లక్షలమంది టీచర్ల ఉద్యోగాలకు టెట్ గండం పొంచి ఉంది. 'ఉపాధ్యాయులకు ప్రమోషన్ కోసమే కాకుండా సర్వీసులో కొనసాగాలంటే కూడా తప్పనిసరిగా టెట్ పాస్ కావాల'ని చెప్తూనే... రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం మానవతా దృక్పథంతో 'అయిదేళ్ల లోపు సర్వీసు ఉన్న వారికి టెట్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు, మిగిలిన వారికి టెట్ పాస్ కావడానికి తీర్పు తేదీ నుంచి రెండేళ్లు సమయం ఇస్తున్నట్లు' సుప్రీంకోర్టు తెలిపింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2011లో విడుదల చేసిన టెట్ మార్గదర్శకాల ఉత్తర్వులు జీవో 51లోని పేరా-11లోనూ, తదుపరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2015లో విడుదల చేసిన టెట్ గైడ్‌లైన్స్ జీవో 36లోని పేరా-12లోనూ... 23 ఆగస్ట్ 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయించినట్లు స్పష్టంగా పేర్కొంది. టెట్ రాయడానికి వయోపరిమితి 18 - 44 ఏళ్లుగా నిర్ణయించింది. అందుకే 2010 నాటికి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు మరొక పోస్టు కోసం ప్రత్యక్ష నియామకం ద్వారా డీఎస్సీ/ టీఆర్టీ రాయాలనుకున్నవారు మినహా ఎవరూ గత 15 ఏళ్లుగా టెట్ రాయాలనే ఆలోచనే చేయలేదు.తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ ప్రమోషన్లలో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించేందుకు 2024 మే 3న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పలు ఉపాధ్యాయ సంఘాలు ఢిల్లీ వెళ్లి NCTE చైర్మన్‌కు విన్నవించాయి. దీంతో రాష్ట్ర విద్యాశాఖ కోరిన విధంగా టెట్ ఎవరెవరికి అవసరమో స్పష్టతనిస్తూ ఆ జాతీయ సంస్థ వివరణ ఉత్తర్వులు (F.No. NCTE/23/2024 - Academic Section- HQ%/124856) ఇచ్చింది.



# దొంగ ఓట్లు తెచ్చిందే బీఆర్ఎస్ ఎంపీ ఫైర్



నిజమాబాద్, అక్టోబర్ 15: జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ జరిగిందని కేటీఆర్ అనటం హాస్యాస్పదమని ఎంపీ అర్వింద్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొంగ ఓట్లు తెచ్చిందే బీఆర్ఎస్ పార్టీ అని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో అపార్టుమెంట్‌లో 43 ఓట్లు దొంగ ఓట్లైతే, బోధన్‌లో బీఆర్ఎస్ హయాంలో 42 దొంగ పాస్‌పోర్టులు ఇచ్చిన సంగతి మరిచారా అంటూ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్థులకు గతంలో ఆశ్రయం ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీనే అని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో డ్రగ్స్, మత్తు పదార్థాల దందాకు తెరలేపింది కేటీఆర్ కాదా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ క్లబ్బుల్లో డ్రగ్స్ సరఫరా చేసింది కేటీఆర్ అని మండిపడ్డారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అంశంలో కాంగ్రెస్ డ్రామాలాడుతోందని ఎంపీ విమర్శించారు. 42 శాతం అమలు ప్రాసెస్ కాంగ్రెస్ సరిగా చేయలేదన్నారు. ఈ అంశంలో బీజేపీని కార్నర్ చేసే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రోజురోజుకీ దిగజారిపోతోందన్నారు. జిల్లాలో ఇటీవల సీఎం పర్యటనతో ఒరిగిందేమి లేదన్నారు. జిల్లాలో ఆర్వోబీల నిధులు వెంటనే విడుదల చేయకపోతే నిరాహార దీక్ష చేపడతానని.. దీపావళి వరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమయం ఇస్తున్నా అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఆర్వోబీల నిధులు కేంద్రం ఇచ్చినా. రాష్ట్ర ప్రభుత్వం వాళ్ళ అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. గత ప్రభుత్వం వాడుకున్న డబ్బులను కాంగ్రెస్ ప్రభుత్వం రికవరీ చేయాలని.. పనుల కోసం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ తన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గద్దన్నారు. జాతీయ పసుపు బోర్డు కోసం స్థలం అడిగితే ఇవ్వడం లేదని ఎంపీ అర్వింద్ విమర్శలు గుప్పించారు.

# మాగంటి సునీతని అవమానిస్తారా మంత్రులపై హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్, అక్టోబరు 15: భర్తను కోల్పోయి దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానించే విధంగా కాంగ్రెస్‌మంత్రులు మాట్లాడటం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి గోపీనాథ్ గెలిచారని తెలిపారు. దురదృష్టవశాత్తూ గోపీనాథ్‌చనిపోయారని. ఆ కుటుంబాన్ని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక లో గెలిపించాలని కోరారు. మాగంటి గోపీనాథ్‌కి పెళ్లికాని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని పేర్కొన్నారు హరీశ్‌రావు. చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు ఎంతో దుఖంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కాంగ్రెస్ మంత్రులు మాగంటి సునీతని అవమానించే విధంగా నానా మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విజ్ఞత మరిచి, విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు విజ్ఞులని.. మంచి, చెడులని ఆలోచిస్తారని తెలిపారు. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు హరీశ్‌రావు. (బుధవారం) జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్ లోకి నేతలు భారీగా చేరారు. హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఒక ఆడబిడ్డను ఆశీర్వదించాలనే పలువురు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ ఏం చేసింది అనేది ఒకసారి ప్రజలు ఆలోచించాలని సూచించారు. తెలంగాణకి కాంగ్రెస్, బీజేపీ ద్రోహం చేశాయని విమర్శించారు హరీశ్‌రావుపేదల ఇళ్లు కూలగొడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పేదొకటి, చేసేదొకటని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ మొహబ్బత్‌కి దుకాణ్ అని అంటారని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటారని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతోంది ఏమిటి. హైడ్రా పేరిట పేదవారి ఇళ్లు కూలగొట్టడం మొహబ్బత్ దుకాణ్ ఆ. అని ప్రశ్నించారు. బడా బాబుల ఇళ్లు ఎందుకు కూలగొట్టడం లేదని నిలదీశారు. గరీబోళ్ల ఇల్లు కూలగొట్టి వేల కుటుంబాలను రోడ్డుమీదకి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదు..? అని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ బిహార్‌లో ఓటు చోరీ అంటున్నారని. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మాత్రం ఓటు చోరీ చేస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో రేవంత్‌రెడ్డి ఓటు చోరీ చేయకుండా నిజాయితీగా ఉండాలని చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి లేదా అని ప్రశ్నించారు. హరీశ్‌రావు. కాంగ్రెస్ దొంగ ఓట్లని కూడగట్టింది 'జూబ్లీహిల్స్‌లో భర్తను కోల్పోయిన సునీతని ఒడగొట్టాలని.. 20 వేల దొంగ ఓట్లను కాంగ్రెస్ కూడగట్టింది. మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని అన్నారు. ప్రతి అక్కకు, చెల్లెకు కాంగ్రెస్ రూ. 55,000 బాకీ పడింది. జూబ్లీహిల్స్‌లో మహిళలకు ఒక్కొక్కరికీ రూ. 55,000 ఇచ్చి రేవంత్‌రెడ్డి సర్కార్ ఓటు అడగాలి. వృద్ధులకు రూ. 4,000 పెన్షన్ ఇస్తా అన్నారని.. ఇవ్వకుండా మోసం చేశారు. ఒక అవ్వకు, తాతకు రూ. 44,000 రేవంత్‌రెడ్డి బాకీపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిందేముంది.. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టుడు తప్పా. కేసీఆర్ ప్రతి బస్తీకి బస్తీ దవాఖాన పెట్టారు. హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలని కేసీఆర్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం మందులు ఇవ్వలేని పరిస్థితి. బీఆర్ఎస్ హయాంలో గర్భిణులు డెలివరీకి పోతే ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేసి కేసీఆర్ కిట్ ఇచ్చి ఆటోలో ఇంటికాడ దిగబెట్టాం. రేవంత్‌రెడ్డి సర్కార్‌లో బతుకమ్మ చీరలు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు ఇవ్వట్లేదు. కేసీఆర్ హయాంలో 20,000 లీటర్ల నీళ్లు ఉచితంగా ఇస్తే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి నల్లా బిల్లు వసూలు చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో గరీబోళ్లకి నీళ్లు ఉచితంగా ఇచ్చాం. భాగ్యనగరంలో నల్లా సమస్యలు పెరిగాయి. అధికారులు నల్లా బిల్లులు వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ని జూబ్లీహిల్స్ ఎన్నికలో ఓడిస్తేనే బుద్ధి వస్తుంది' అని హరీశ్‌రావు విమర్శించారు.

# కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ సమీక్ష




హైదరాబాద్: సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం దిగుబడిలో తెలం గాణ ఆల్ టైం రికార్డ్ సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ వానాకాలంలో రికార్డ్ స్థాయిలో 148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. అధిక దిగుబడి, అధిక కొనుగోళ్ల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలులో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకార్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న రవాణా వసతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రైతులు ఎక్కడ కుడా నిరీక్షించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన అంశంలో అత్యవసరం అనుకుంటే అదనపు ఖర్చులకు వెనకాడ వద్దని వివరించారు. ధాన్యం కొనుగోలు వివరాలను సత్వరమే నమోదు చేయాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. నమోదు అయిన కొనుగోళ్లకు 48 గంటలలో చెల్లింపులు జరగాలని అధికారులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు అందరూ.. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ముందుకు వెళ్లాలని సూచించారు. మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లింపులకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు.

# నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా కవిత సంచలన ప్రకటన




హైదరాబాద్, అక్టోబర్15: జాగృతి జనం బాట పేరుతో కల్వకుంట్ల కవితతెలంగాణలోని జిల్లాల్లో యాత్ర చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నాడు యాత్రపై మీడియాతో కవిత మీట్లాడుతూ.. నాలుగు నెలల పాటు యాత్ర ఉంటుందని.. ప్రతి జిల్లాల్లో రెండు రోజులు ఉంటామన్నారు. జిల్లాల్లో ఉన్న అన్ని వర్గాల ప్రజలతో కలిసి మాట్లాడతామని చెప్పారు. సామాజిక తెలంగాణ కోసం ఏం చేయాలనే విషయాలను ప్రజల నుండే తెలుసుకుంటామన్నారు. సామాజిక తెలంగాణ అంటే నినాదం కాదు విధానమని వివరించారు. తాము ఉన్నన్ని రోజులు సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే గురువులన్నారు. పెద్ద పెద్ద నాయకులను కూడా ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారని గుర్తుచేశారు. ప్రజల దగ్గరికి వెళ్ళి సమస్యలు తెలుసుకుంటామని కవిత అన్నారు. అది కరెక్ట్ కాదు. కేసీఆర్ ఫోటో లేకుండానే యాత్ర చేస్తామన్నారు కవిత. కేసీఆర్ లేకుండా తెలంగాణ రాలేదని.. అయితే కేసీఆర్ ఫోటో పెట్టుకుంటే నైతికంగా కరెక్ట్ కాదని చెప్పుకొచ్చారు. 'నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా' అని అన్నారు కవిత. జాగృతి పెట్టినప్పుడు కూడా కేసీఆర్ ఫోటో పెట్టలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జాగృతి పెట్టినప్పుడు జయశంకర్ ఫోటో పెట్టామన్నారు. కేసీఆర్‌కు పుట్టడం తన అదృష్టమని.. 'మా దారులు వేరే అయినప్పుడు నా లైన్ నేను తీసుకోవడం కరెక్ట్' అని అన్నారు. కేసీఆర్ ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారని.. ఆ పార్టీ నుండి తనను సస్పెండ్ చేశారని తెలిపారు. నైతికంగా కరెక్ట్ కాదనే కేసీఆర్ ఫోటో తీసేస్తున్నట్లు వెల్లడించారు. దుర్మార్గుల నుంచి చెట్టును కాపాడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశానని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

# బీసీ సమాజాన్ని మోసం చేస్తున్నారు : రాజాసింగ్



హైదరాబాద్: తాజాగా మరోసారి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఇదేమి రాజ్యం. ఇదేమి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం. తెలంగాణలో ఎన్నికలు జరిగినప్పుడల్లా లేదా ప్రముఖ నాయకుడు వచ్చినప్పుడల్లా, భవిష్యత్తులో ఒక బీసీ తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతాడని అందరూ అంటారు. తెలంగాణలో చిన్న ఎన్నికల గాని పెద్ద ఎన్నికల గాని వస్తే బీసీలనే మర్చి పోతారు.' అని రాజాసింగ్ ఆరోపించారు. 'బీసీలు మన తెలంగాణ భారతీయ జనతా పార్టీ లోపట ఎక్కడున్నారో కొద్ది చెప్తారా కిషన్ రెడ్డి. నేను ఇంతకు ముందు ఎప్పుడూ ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు లేదా ఓబీసీల గురించి మాట్లాడలేదు. నేను హిందూత్వం గురించి మాత్రమే మాట్లాడుతాను. కానీ నేను ఈరోజు దాని గురించి మాట్లాడటానికి కారణం మీరు ప్రతి ఎన్నికల్లో బీసీ కార్డును ప్లే చేసి, బీసీ సమాజానికి మీరు మోసం చేస్తారు. అందుకే నేను ఈరోజు చెప్పాల్సి వచ్చింది.' అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై రాజాసింగ్ మరోసారి తన మాటల తూటాలను వదిలారు. అయితే తాజాగా (మంగళవారం) కూడా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపణలు చేశారు. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిజీ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మీరు ఎన్ని ఓట్ల తేడాతో ఓడిపోతారు? జూబ్లీ హిల్స్ ప్రజలు మిమ్మల్ని అడుగుతున్నారు. బీఆర్ఎసను గెలిపిస్తారా? కాంగ్రెస్‌ను గెలిపిస్తారా..? అని సోషల్ మీడియాలో మిమ్మల్ని జనాలు అడుగుతున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. మీ గౌరవం ప్రమాదంలో ఉందా ?' అని రాజాసింగ్ వ్యాఖ్యలు చేశారు.

# రాష్ట్ర కార్యాలయంలో కొట్టుకున్న బీజేపీ, బీసీ సంఘాల నేతలు




హైదరాబాద్: హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఫొటోల విషయంలో బీజేపీ, బీసీ సంఘాల నేతల మధ్య వాగ్వాదం జరగడంతో ఇరువర్గాల నేతలు తన్నుకున్నారు. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ ఆర్. కృష్ణయ్య వారించేందుకు ఎంత ప్రయత్నించినా వినిపించుకోలేదు. దీనికి సంబంధించిన వీడి యో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 18వ తేదీన బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరేందుకు బీసీ సంఘాల నేతలతో కలిసి ఆర్. కృష్ణయ్య ఇవాళ ఉదయం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిశారు. అనంతరం ఇద్దరూ కలిసి ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న క్రమంలో బీజేపీ, బీసీ సంఘాల నేతల మధ్య వాగ్వాదం నెలకొంది. జూనియర్ అయ్యి ఉండి ఫొటోలకు ఎలా ముందుకు వెళ్తావని గుజ్జా కృష్ణ, గుజ్జా సత్యం ఒకరినొకరు తిట్టుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఆర్. కృష్ణయ్య, రాంచందర్‌రావు ఎదురుగానే ఈ గొడవంతా జరిగింది. కొట్టుకోవడం ఆపేయాలని వారిద్దరూ ఎంత వారించినా వినిపించుకోలేదు. ఈ క్రమంలో సహచర నాయకులు అతి కష్టం మీద అదుపు చేయాల్సి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి బయటకొచ్చింది.

# కాంగ్రెస్ మంత్రుల తీరు దుశ్శాసునుడిని మించిపోయింది



హైదరాబాద్ : భర్తను కోల్పోయి బాధలో మాగంటి సునీత కన్నీళ్లు పెడితే డ్రామా, సీరియల్ అంటూ అవమానిస్తున్న కాంగ్రెస్ మంత్రుల తీరు దుశ్శాసనుడిని మించిపోయింది అని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎట్టైనా గెలవాలని మహిళలను అవమానించేలా ఘోరమైన సంస్కృతికి తెరలేపింది కాంగ్రెస్ అని ఆయన మండి పడ్డారు. ఇందిరా గాంధీ చనిపోతే చాలామంది కన్నీళ్లు పెట్టుకున్నారు మీ దృష్టిలో అది కూడా సీరి యల్, డ్రామానేనా? అని ఆర్ఎస్పీ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడి యాతో మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ అన్న మాటలు చూస్తే.. ఇలాంటి మంత్రి కూడా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా అని అనిపిస్తుంది. మాగంటి సునీత కన్నీళ్లు పెడితే డ్రామాలు చేయడం అందరికీ వచ్చు. ఇది సినిమా కాదు సీరియల్ కాదు అనడం సరికాదు. రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయినప్పుడు చాలా మంది కన్నీళ్లు పెట్టారు.. అది కూడా డ్రామాలేనా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. మాగంటి సునీత జామా మసీదు ఎదుట రోడ్డు మీద నిలబడి కాంగ్రెస్ బాకీ కార్డులు పంచితే కేసు నమోదు చేశారు. ఆమె మసీదులోకి వెళ్లలేదు, రోడ్డు మీద నిలబడి ప్రచారం చేయడం ఏ రకంగా నేరం అవుతుంది. డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు చేయగానే వెంటనే మాగంటి సునీత మీద, ఆమె కూతురు చిన్న అమ్మాయి అక్షర మీద కేసు నమోదు చేశారు. అని మెన్షన్ చేశారు.. ఎందుకంటే ఇంకెవరైనా బీఆర్ఎస్ నాయకులు ప్రచారంలో తిరిగితే వారిపై కూడానమోదు చేసి జైళ్లలో వేయాలని చూస్తున్నారు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# తెలంగాణ కేడర్‌కు నలుగురు ఐపీఎస్‌లు కేటాయింపు




హైదరాబాద్ : తెలంగాణ కేడర్‌కు నలుగురు ఐపీఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన అయాషా ఫాతిమా, మహారాష్ట్రకు చెందిన మందారే సోహం సునీల్, రాజస్థాన్‌కు చెందిన మనీషా నెహ్రా, జార?ండ్‌కు చెందిన రాహుల్ కాంత్‌లను కేటాయించగా.. తెలంగాణ హెూం స్టేట్‌కు చెందిన అభిజిత్ పాండేను మణిపూర్ కేడర్‌కు, ఎస్ దీప్తి చౌహాన్‌ను యూపీ కేడర్‌కు కేటాయించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది మహిళా ఐపీఎస్‌ల సంఖ్య పెరిగింది. 174 మంది ట్రైనీల్లో 62 మంది మహిళలు ఉండగా.. 35.63 శాతంగా నమోదైంది. ఈ ఏడాది పరేడ్ కమాండర్‌గా తమిళనాడు కేడర్‌కు చెందిన అంజిత్ ఏ నాయర్ నాయకత్వం వహించనున్నారు. మొత్తం 174లో పురుషులు 112, మహిళా ఐపీఎస్‌లు 62 మంది ఉన్నారు. ఇందులో పెళ్లయిన మహిళల్లో 13 మంది కాగా.. పెళ్లి కాని వారు 49 మంది ఉన్నారు. పురుషుల్లో 28 మంది పెళయిన వారు కాగా.. 84 మంది పెళ్లి కానివారున్నారు. ఈసారి ఐపీఎస్ సాధించిన వారిలో 25 ఏళ్లలోపు పురుషులు 14 మంది ఉండగా.. మహిళలు ఏడుగురు ఉన్నారు. అలాగే 25 నుంచి 28 ఏళ్ల లోపు వారు మొత్తం 87 మంది ఉండగా.. ఇందులో మహిళలు 37, పురుషులు 50 మంది ఉన్నారు. 28 ఏళ్లు పైబడిన వారు మొత్తం 66 మంది కాగా.. 18 మంది మహిళలు, 48 మంది పురుషులు. 88 మంది వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఉండగా.. మహిళలు 24 మంది, పురుషులు 64 మంది ఉన్నారు. గతంలో ఎలాంటి వర్క్ ఎక్స్‌పీరియన్స్ లేనివారు 86 మంది ఉండగా.. పురుషులు 48 మంది, మహిళలు 38 మంది. ఎప్పటిలాగే ఈసారి కూడా ఇంజినీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారు 87 మంది ఉన్నారు. సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి 36 మంది.. ఆర్ట్స్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి 29 మంది, ఎంబీబీఎస్ చేసిన ఎనిమిది మంది, కామర్స్ నుంచి ఎనిమిది మంది, లా చేసిన వారు ఆరుగురు ఐపీఎస్‌లు ఉన్నారు.

# గాయని బాల సరస్వతి కన్నుమూత



హైదరాబాద్, అక్టోబర్ 15: తెలుగులో తొలి నేపథ్య గాయని బాల సరస్వతి(97) మృతి చెందారు. హైదరాబాద్‌లో ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆరేళ్ల వయసు ఉన్నప్పటినుంచే బాల సరస్వతి పాటలు పాడడం మొదలుపెట్టారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీతో పాటు పలు భాషల్లో మొత్తం 2000కి పైగా ఆమె పాటలు పాడారు. లలిత సంగీత దిగ్గజంగా పేరుందిన బాల సరస్వతి దేవి 1939లో మహానంద సినిమాతో తెలుగులో తొలి నేపథ్య గాయనిగా గుర్తింపు పొందారు. ఆకాశవాణి కార్యక్రమంతో తెలుగు వారికి పరిచయమైన బాల సరస్వతి.. 'సతీ అనసూయ' సినిమాలో తొలి పాటను పాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ తొలి దశలో అనేక మధుర గీతాలు ఆలపించారు. తెలుగు, తమిళ సినిమాల్లో 1930 నుంచి 1960 వరకు పాటలు పాడటంతో పాటు పలు చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు.

# చివరి పరీక్షను ఇలా గెలుద్దాం!

**వరాహ ద్వాదశి**

జీవితంలోని ఆఖరి క్షణంలో చేసే ఆలోచన చివరి పరీక్షలాంటిది. ఈ చివరి పరీక్షకు జీవితాంతం సిద్ధం కావాలి. జీవితమంతా ఆ భగవతుణ్ణి స్మరించే సాధన చేయగలిగితే మన ఆఖరి క్షణాల్లో రాసే ఆ చిట్ట చివరి పరీక్షలో తప్పకుండా ఉత్తీర్ణులం అవుతాం. మనమందరం మన రోజువారీ జీవితాలలో తీరిక లేకుండా గడిపేస్తున్నాం. మనుగడ కోసం చేసే ఈ పోరాటంలో మనం ఎన్నో కష్ట సుఖాలను ఎదుర్కొంటూ ఉంటాం. మన రోజువారీ విధులను నిర్వర్తిస్తూనే భగవంతుడికి చేరువయ్యే మార్గాన్ని 'భగవద్గీత' బోధించింది. అదే విధంగా మనకు ఎన్నో పండుగలు, విశేషమైన ఉత్సవాలు ఉన్నాయి. వాటిని జరుపుకోవడం ద్వారా భగవన్నామస్మరణను మరింత ఎక్కువగా చేసుకోవచ్చు. భగవం తుణ్ణి, ఆయన దివ్య లీలల్లోని అంతరార్థాన్నీ పరిపూర్ణంగా అర్థం చేసుకున్న వారు మోక్షాన్ని పొందుతారని, భగవత్ సన్నిధానాన్ని చేరుకుంటారనీ పెద్దలు చెప్పారు. అటువంటి ఒక అవకాశమే శ్రీ వరాహ ద్వాదశి. ఇది శ్రీ వరాహస్వామిగామహా విష్ణువు అవత రించిన రోజు.

**వరాహస్వామి వాగ్దానం**

శ్రీ వరాహావతార లీలను ప్రపంచవ్యాప్త



హరేకృష్ణ ఉద్యమ సంస్థా పకాచార్యుడైన శ్రీల ప్రభుపాదులు వివరిస్తూ"సృష్టి ఆరంభం నుంచి దేవతలు, దైత్యులు అనే ఇరు వర్గాల వారు విశ్వంలోని లోకాలన్నిటినీ శాసించేవారు. భగవంతుడు ఏర్పరచిన ఈ సృష్టిలో నిర్దిష్ట నియమానుసారం... గ్రహాలన్నీ అంతరిక్షంలో తేలియాడుతూ ఉండేవి. వాటిలో కొన్ని జలాలతో నిండి ఉండగా, మిగిలిన సగం అసంఖ్యాకమైన గ్రహాలతో కూడిన లోకాలతో నిండి ఉండేది. ఈ గ్రహాలు కక్ష్యలో తిరిగే క్రమానికి అసురుడైన హిరణ్యాక్షుడు విఘాతం కలిగించాడు. దీనితో భూలోకం తన భార రహిత స్థితిని కోల్పోయి జలాలలోకి జారి పోయింది. ఆ సమయంలో... ఈ జగత్తుకు స్థితికారకుడైన మహా విష్ణువు... భీకరమైన సూకర రూపాన్ని ధరించి, తన దంతాలతో భూమండలాన్ని జలాల నుంచి పైకి ఎత్తి పట్టాడు. ఆ సందర్భంలో వరాహస్వామిని హిరణ్యాక్షుడు అడ్డగించబోగా... స్వామి తన దంతాలతో అతణ్ణి గుచ్చి సంహరించాడు. భగవంతుడి అవతారాలకు ఉన్న విశిష్టత ఇదే. అసాధారణమైన పరిస్థితుల్లోనే ఆయన అవతరిస్తాడు. మనుష్యుడి ఆలోచనకైనా అందని పరమాద్భుతమైన రీతిలో తన లీలలను ప్రదర్శిస్తాడు. అటువంటి భగవంతుణ్ణి సదా స్మరించుకోవడమే ముక్తికి మార్గం అని పురాణాలు చెబుతున్నాయి. మరి మేము ప్రతిరోజూ భగవన్నామ స్మరణ చేస్తున్నాం. కానీ జీవితంలోని ఆఖరి క్షణంలో దేవుణ్ణి స్మరించుకోలేని ప్రమాదకర పరిస్థితిలో ఉంటే ఎలా? అని కొందరు భక్తులకు సందేహం కలుగవచ్చు. "ఒకవేళ నా భక్తుడు మరణ సమయంలో దేహానికి కలిగే అవాంతరాల కారణంగా నన్ను స్మరించలేకపోతే... నేనే నా భక్తుణ్ణి స్మరించి, నా దివ్య ధామానికి తీసుకువెళ్తాను" అని 'వరాహ పురాణం'లో శ్రీవరాహస్వామి చేసిన వాగ్దానం... ఆ సందేహానికి సమాధానం ఇస్తుంది. వరాహ ద్వాదశి రోజున... వరాహమూర్తిని స్మరించాలి. హరేకృష్ణ మంత్రాన్ని జపించాలి. అన్నదానం, గోసేవలను నిర్వహించడం వల్ల స్వామి అనుగ్రహం కలుగుతుంది.

## శనిదేవుడు మోసుకొస్తున్న లక్ష్మీ యోగం..ఈ రాశుల వారి జతకాలు మారిపోయినట్టే..!

భారతీయ జ్యోతిషశాస్త్రంలో శనిని ఒక ముఖ్యమైన గ్రహంగా పరిగణిస్తారు. దీనిని కర్మ కారకుడిగా, న్యాయానికి అధిపతిగా భావిస్తారు. శని వ్యక్తి యొక్క కర్మలను బట్టి ఫలితాలను ఇస్తాడు అని నమ్ముతారు. శని అనుగ్రహం ఉంటే, వ్యక్తికి కష్టపడే తత్వం, నిబద్ధత, మరియు ఓర్పు వంటి లక్షణాలు లభిస్తాయి. వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారు మరియు సమాజంలో గౌరవం పొందుతారు. శని దోషం ఉంటే, వ్యక్తి అనేక సమస్య



లను ఎదుర్కోవలసి వస్తుంది. ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, మరియు ఉద్యోగంలో ఒత్తిడి వంటివి కలుగుతాయి. శనిదేవుని అనుగ్రహం ప్రధానం గా కొన్ని రాశుల వారి మీద చూపించనుంది. ఆ రాశులను ఓసారి పరిశీలిస్తే శని దేవుడికి అత్యంత ఇష్టమైన రాశులలో కుంభ రాశి కూడా ఒకటి. కుంభ రాశి వారికి శనిదేవుని అనుగ్రహం పుష్కలంగా ఉంటుంది. ఈ రాశి వారు ఎప్పుడు ఉల్లాసంగా ఉంటారు. ఈ రాశి వారు సాధారణంగా యాక్టివ్‌గా ఉంటారు. సమాజంలోమంచి పేరు గౌరవం పొందుతారు. పని ప్రదేశంలో ప్రశంసలు అందుతారు.

# స్థిరమైన బుద్ధి

మన జీవిత ప్రయాణం లో మనం ఎన్నో విషయాల ను వింటూ ఉంటాం. వాటిలో ఒకే అంశం గురించి విరుద్ధమైన అభిప్రాయాలు ఉంటాయి. ఇది మనకు కలవరపాటు కలిగిస్తాయి. వార్తలు కావచ్చు, ఇతరుల అనుభవాలు కావచ్చు, నమ్మకాలు కావచ్చు. వాటి మీద వివిధ అభిప్రాయాలు, వాదనలు విన్నప్పుడు కూడా మన బుద్ధి స్థిరంగా ఉన్నప్పుడే అత్యున్నతమైన యోగ స్థితిని పొందుతామని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు బోధించాడు. దీనిలోని అంతరార్థాన్ని అవగాహన చేసుకోవడానికి చెట్టు సరైన ఉదాహరణ. చెట్టు పైభాగం మనకు కనిపిస్తుంది. దాని కింది భాగం వేర్ల మూల వ్యవస్థతో కూడి ఉంటుంది. అది బయటకు కనిపించదు. పైభాగం తీవ్రమైన గాలులకు ఊగుతూ ఉంటుంది. కానీ దానివల్ల వేర్ల వ్యవస్థ ప్రభావితం కాదు. ఎగువ భాగం బాహ్య శక్తుల



ప్రభావంతో ఊగిపోతూ ఉంటే... దిగువ భాగం నిశ్చలంగా, సమాధి స్థితిలో ఉన్నట్టు ఉంటుంది. అది స్థిరంగా ఉడడంతోపాటు మొత్తం చెట్టుకు పోషకాహారాన్ని అందించే బాధ్యతను నిర్వహిస్తుంది. బాహ్యభాగం ఊగిసలాడుతూ... అంతర్గతంగా నిశ్చలంగా ఉండడమే చెట్టుకు యోగ స్థితి. అజ్ఞాన స్థితిలో ఉన్నప్పుడు మన బుద్ధి చంచలంగా ఉంటుంది. అది బయటి విషయాల ప్రభావానికి గురైదానంతట అదే ఊగిసలాడుతూ ఉంటుంది. తాత్కాలికమైన స్పందనలు, ఉద్వేగాలు, కోపాల రూపంలో ఈ ఊగిసలాట మన నుంచి బయటకు వస్తుంది. మన జీవితాలను సమస్యాత్మకం చేస్తుంది. మన వ్యక్తిగత జీవితాలనే కాదు, మన కుటుంబ సభ్యుల జీవితాలను, మనం పని చేసే చోట తోటి వారి జీవితాలను కూడా ఇది సమస్యాత్మకంగా మారుస్తుంది. కొందరు ఈ ఊగిసలాటను అణచివెయ్యడం కోసం ముఖానికి ఒక ముసుగు తొడుక్కుంటారు. అందరిముందూ ధైర్యంగా, ఆహ్లాదంగా ఉన్నట్టు ప్రవర్తిస్తారు. కానీ ఇది ఎక్కువకాలం సాగదు. ఈ బాహ్యమైన ఊగిసలాటలు అనిత్యమైనవని తెలుసుకొని... నిశ్చలంగా ఉన్న అంతరాత్మను చేరుకోవడమే దీనికి పరిష్కారమని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు.


# శాంతిపథంలో తొలి మెట్టు

మనం చదువుకోవాలంటే బడికి వెళ్ళాలి. ఆడుకోవాలంటే ఆట వస్తువులు బజార్లో దొరుకుతాయి. ఇలా మనకు కావలసింది ఏదైనా మన దగ్గర లేదనే విషయాన్ని ప్రపంచం మనకు నేర్పుతుంది. శాంతి విషయంలోనూ ఇలాగే ఆలోచిస్తాం. కానీ అది ఎక్కడో బయట ఉండదు. మన లోపలే ఉంటుంది. ఇది మనం తెలుసుకోవలసిన అతి ముఖ్యమైన విషయం. శాంతి పథంలో ఇదే తొలిమెట్టు.

**శాంతి మీలోనే ఉంది :** మీరు తొలి అడుగు వెయ్యవలసింది ముందుకు కాదనీ, వెనక్కి అనీ నేను చెప్పినప్పుడు చాలామంది 'ఎప్పుడూ ముందుకే అడుగు వెయ్యాలి కదా!' అని ఆలోచిస్తూ ఉంటారు. కానీ మనం ముందుకు కాదు, లోపలివైపు అడుగు వెయ్యాలి. ఎందుకంటే మీకు అవసరమైన శాంతి మీలోనే నిక్షిప్తం అయి ఉంది. ఇప్పుడు కూడా ఉంది. మీరు కోపంతో రగిలిపోతున్న సమయంలో కూడా ఉంటుంది. అలాగే మీరు దుఃఖంలో విలవిలలాడిపోతున్న సమయంలో, సుఖసంతోషాలతో తులతూగుతున్న సమయంలో కూడా ఉంటుంది. ప్రపంచంలో ఎవరు ఎక్కడ ఉన్నా, కటిక పేదవారైనా, గొప్ప ఐశ్వర్య వంతులైనా ప్రతి ఒక్కరూ దాన్ని స్వయంగా అనుభూతి పొందవచ్చు.

**అది అసాధ్యం కాదు**

ఎవరికో దాహంగా ఉందని తెలిసి... నేను నాలుగు గ్లాసుల నీరు ఇచ్చి వచ్చాను. "అతని దాహం తీరిపోయి ఉంటుందా?" అని




ఎవరైనా అడిగిత "నేను నాలుగు గ్లాసుల నీరు ఇచ్చి వచ్చాను, తప్పకుండా తీరిపోయి ఉంటుంది" అని చెబుతాను. కానీ ఆ వ్యక్తి నీరు తాగకుండా ఉంటే దాహం ఎలా తీరుతుంది? శాంతి విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. యుద్ధాలు జరగకపోతే శాంతి ఏర్పడుతుందని భావిస్తారు. కానీ శాంతిగా ఉన్నప్పుడు యుద్ధం ఎలా మొదలైంది? కాబట్టి ఏవైతే జరుగుతున్నాయో వాటన్నిటికీ కారణం శాంతి లోపించడం. 'ఇంతమందిని శాంతి పథంలో నడిపించడం అసాధ్యం' అని మీకు అనిపించవచ్చు.

కానీ ఈ ప్రపంచంలో యాభై శాతం మంది శాంతిపథంలో అడుగు పెట్టినా మిగిలిన వారిపై ఆ ప్రభావం తప్పకుండా ఉంటుంది. మీరు గడిపే ఏ క్షణమైన మళ్ళీ తిరిగిరాదని గుర్తించి, ప్రతి రోజునూ కాపాడు కోవాలి. వృధాగా గడిచి పోకుండా చూసుకోవాలి.

## భీష్మ ఏకాదశి.. ఆ రోజు ఏం చేస్తే మంచిదంటే..?

ఏడాదికి 12 మాసాలు వాటిలో అత్యంత పవిత్రమైన మాసాల్లో ఒకటి మాఘమాసం. ప్రత్యక్ష నారాయణుడు సూర్య భగవానుడికి ప్రీతికరమైన మాసం ఇది. ఈ మాసంలో చేసే నదీ, సముద్ర స్నానం కానీ పూజలకు కానీ ఎంతో ప్రత్యేకత ఉంటుంది. అటువంటి మాఘ మాసంలో శుక్లపక్ష ఏకాదశిని.. భీష్మ ఏకాదశిగా జరుపుకొంటారు. భీష్మ ఏకాదశి రోజు విష్ణు సహస్రనామాలు చదివితే అద్భుతమైన ఫలితం ఉంటుందని శాస్త్ర పండితులు వివరిస్తున్నారు. ఈ భీష్మ ఏకాదశిని జయ ఏకాదశి, అంతర్వేది ఏకాదశి అని కూడా పిలుస్తారని చెబుతున్నారు.

**భీష్మ ఏకాదశి రోజు.. వీటిని తప్పక పాటించాలి :**



భీష్మ ఏకాదశి రోజు ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలి. గడపకు పసుపు, కుంకుమ రాసి గుమ్మానికి తోరణాలు కట్టాలి. తల స్నానం చేసి పసుపు రంగు దుస్తులు లేదంటే సుచిగా ఉన్న దుస్తులను ధరించి శ్రీమహా విష్ణువును ఆరాధించాలి. ఉపవాసం ఉండాలి. రాత్రి జాగరణ చేస్తే ఇంకా మంచిది. భీష్ముడు తండ్రికి ఇచ్చిన మాటని నిలబెట్టుకోవాలని జీవితాంతం బ్రహ్మచారిగా ఉన్నారు. విష్ణు సహస్రనామాలు చదవడం వల్ల దు:ఖాల నుంచి బయట పడవచ్చు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడు గాయపడతాడు. ఆయన అంపశయ్యపై ఉన్నప్పుడు ధర్మరాజుకు విష్ణు సహస్రనామాన్ని బోధిస్తాడు. ఈ పరమ పవిత్రమైన రోజుని భీష్మ ఏకాదశిగా ప్రజలంతా జరుపుకొంటారు. విష్ణు సహస్రనామాల జపించడం వల్లే.. కురుక్షేత్ర యుద్ధంలో పాండవులు విజయాన్ని అందుకున్నారని చెబుతారు. అదీకాక విష్ణు సహస్రనామ పారాయణం చాలా విశిష్టమైనది. ఇది ప్రతి రోజు పారాయణం చేయడం వల్ల విశేష ఫలితం సంప్రాప్తిస్తుందని చెబుతారు.

## మహా కుంభమేళాలో నాగ సాధువులు.. వారి గురించి ఈ ఆశ్చర్యకర విషయాలు తెలుసా?

ప్రస్తుతం ప్రయోగరాజ్‌లో జరుగుతున్న కుంభ మేళాలో తొలి రోజు పవిత్ర స్నానం ఆచరించిన నాగ సాధువులు సాధారణ భక్తులను మంత్రముగ్ధులను చేశారు. నాగసాధువులు స్నానం చేయడం వల్ల పుణ్య జలాలకు మరింత పవిత్రత వస్తుందని అందరూ భావిస్తారు. అందుకే కుంభమేళా సమయంలో తొలి స్నానాన్ని నాగసాధువులకు కేటాయిస్తారు. తల నుంచి కాలి వరకు బూడిద.. త్రిశూలాలు, కత్తులు, ఢమరకం ధరించి విచిత్ర ఆహార్యం.. వాళ్లకు బంధాలు, అనుభంధాలు ఉండవు. సర్వం పరిత్యజించిన సన్యాసులు. చలి కాలమైనా, వేసవి కాలమైనా దిగంబరులుగానే ఉంటారు. జనావాసాలకు దూరంగా సాధనే ప్రపంచంగా



గడుపుతారు. కుంభమేళా సమయంలో మాత్రమే జన సామాన్యంతో కలుస్తారు. ప్రస్తుతం ప్రయోగరాజ్ లో జరుగుతున్న కుంభమేళా లో తొలి రోజు పవిత్ర స్నానం ఆచరించిన నాగ సాధువులు సాధారణ భక్తులను మంత్ర ముగ్ధులను చేశారు నాగసాధువులు స్నానం చేయడం వల్ల పుణ్య జలాలకు మరింత పవిత్రత వస్తుందని అందరూ భావిస్తారు. అందుకే కుంభమేళా సమయంలో తొలి స్నానాన్ని నాగ సాధువులకు కేటాయిస్తారు. బూడిద, భస్మం, గంధం మొదలైన అలంకరణలతో వచ్చే నాగ సాధువులు పవిత్ర స్నానం తర్వాత తిరిగి జన సామాన్యులకు దూరం అయిపోతారు.

ప్రపంచం లోనే అతి పెద్ద మత సమ్మేళనం అయిన కుంభమేళా ప్రారంభం కాగానే, నాగ సాధువుల గురించి చర్చ మళ్లీ మరోసారి తెర పైకి వచ్చింది. దేవాలయాలలో పూజారులు లేదా మఠాలలో నివసించే సన్యాసుల వలే కాకుండా, నాగ సాధువులు పవిత్ర స్నానం తర్వాత మళ్లీ కనిపించరు.

## లక్ష్మీదేవికి గుడ్లగూబ, విష్ణుమూర్తికి గరుత్మంతుడు వాహనం ఎలా అయ్యిందంటే..

నారదుడు గానబంధు వద్ద సంగీతం వెయ్యేళ్ల పాటు నేర్చుకున్నాడట. కఠోర దీక్షతో నారదుడు 3,60.006 రాగాలలో మంచి ప్రావీణ్యం గడించాడు. సహ పాఠకులంతా పొగిడేస్తుంటే సంగీతంలో తనకు తిరుగులేదనే గర్వంతో ఉబ్బిపోయాడు. నారదుడి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇక ఆనందంతో గురువు ఉలూకపతి వద్దకు వెళ్లి గురు దక్షిణగా ఏం కావాలో కోరుకోమన్నాడు. దీనికి ఉలూకపతి ఈ ధరాతలం ఉన్నంత వరకూ సంగీత కళతో పాటు తాను కూడా గుర్తుండిపోయే వరాన్ని ప్రసాదించమని కోరాడు. అలా తన మనసులోని మాట బయట పెట్టాడు. నారదుడు మాత్రం అది చాలా చిన్న కోరిక అని.. అది తను తీర్చాల్సిన అవసరం లేదని.. ఉలూకపతికి ఉన్న సంగీత పాండిత్యమే తీర్చుతుందని చెప్పాడు. భూమిపై సంగీతకళ నిలిచియున్నంత వరకు మీ కీర్తికి ఢోకా లేదని తెలిపాడు. తనకు





సంగీత విద్యను నేర్చినందుకు ప్రతిగా తానే గురుదక్షిణ చెల్లిస్తానని చెప్పాడు. గురుదక్షిణగా లక్ష్మీనారాయణుల కటాక్షము, వారి సేవా భాగ్యమును, శాశ్వత సన్నిధానమును ప్రసాధిస్తున్నానని నారదుడు వెల్లడించాడు. అలాగే ప్రళయం సంభవించినవేళ శ్రీ మహావిష్ణువునకు గరుత్మంతునివలె శ్రీమహాలక్ష్మికి నీవు వాహనమై తరిస్తావని చెప్పాడు. నారదుడు ఇచ్చిన వరంతో ఉలూకపతి.. శ్రీ మహావిష్ణువునకు గరుత్మంతునివలె శ్రీమహాలక్ష్మికి వాహనంగా మారాడు.

## థార్ ఎడారి సమీపంలోని ఈ ఆలయాల గురించి తెలిస్తే..

రాజస్థాన్‌లోని బార్మర్ నుంచి 35 కి.మీ దూరంలో, థార్ ఎడారి సమీపంలో ఉన్న పట్టణంలో ఐదు దేవాలయాలున్నాయని తెలుసుకున్నాం కదా. ఇప్పటికే బార్మర్ కొండపై ఉన్న రెండు ఆలయాల గురించి తెలుసుకున్నాం కదా.. ఇప్పుడు మిగిలిన మూడు ఆలయాల గురించి తెలుసుకుందాం. 3వ శతాబ్దంలో నిర్మించబడిన అతి పురాతన ఆలయం శ్రీ నకోడ జైన్ దైవాలయం. ఈ ఆలయాన్ని చాలా సార్లు పునర్నిర్మాణం జరిగింది. ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో ఆలంషా ఆక్రమించి దోచుకున్నాడు. అయితే ఈ ఆలయంలోని విగ్రహాన్ని స్థానికులు దాచడంతో ఆలంషాకు చిక్కలేదు. ఆ తరువాత 15వ శతాబ్దంలో విగ్ర




హం తిరిగి తీసుకొచ్చి ఆలయాన్ని పునరుద్ధరించారు. ఈ ఆలయాల్లో మిగిలిన రెండు దేవాలయాల్లో ఒకటి.. దేవక-సూర్య దేవాలయం. ఈ ఆలయాన్ని 12వ లేదా 13వ శతాబ్దంలో బార్మర్ నుండి 62 కి.మీ.ల దూరంలో బార్మర్-జైసల్మేర్ రోడ్డు వెంబడి ఉన్న దేవ్కా అనే చిన్న గ్రామంలో ఉన్న ఈ ఆలయ నిర్మాణం జరిగింది. ఈ ఆలయం అద్భుతమైన వాసు శిల్పకళకు నిలువెత్తు నిదర్శనం. ఈ గ్రామంలో గణేశుడి రాతి శిల్పాలున్న మరో రెండు దేవాలయాల శిధిలాలు కూడా ఉన్నాయి. జసోల్‌లో రాణి భటియాని అనే ఆలయం ఉంది. రాణి భటియాని మంగనియార్‌కు దివ్య దర్శనం ఇచ్చినట్లు చెబుతారు.

కాబట్టి రాణి భటియాని.. మంగనియర్ బార్డ్ కమ్యూనిటీ ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ దేవతను మజిసా లేదా తల్లి అని కూడా పిలుస్తారు. రాజపుత్ర రాణి అయిన ఆమె తర్వాతి కాలంలో దేవతగా మారిందట.

## తిరునల్లార్ శని దేవాలయంలోని నల పుష్కరిణి విశిష్టత

తమిళనాడు రాష్ట్రంలోని తంజావూర్ జిల్లాలో రెండు నదుల మధ్య తిరునల్లార్ శని దేవాలయం ఉంది. ఈ ఆలయంలో శనితో పాటు శివుడు కూడా కొలువై ఉన్నాడు. ఇక్కడ ముందుగా శనీశ్వరుడిని దర్శించుకున్న మీదట శివుడిని దర్శించుకుంటారు. ఇక్కడ ఉన్న నల పుష్కరిణిలో స్నానమాచరిస్తే సకల శని దోషాలు తొలగిపోతాయని చెబుతారు. అందుకే భక్తులు తప్పనిసరిగా ఇక్కడకు వస్తే నలపుష్కరిణిలో స్నానమాచరిస్తారు. నలపుష్కరిణి విశిష్టతను తెలిపే కథ ఒకటుంది. అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం. విదర్భ చక్రవర్తి భీమునికి దమయంతి అనే కూతురు ఉంది. ఆమె అపురూపమైన అందగత్తె. ఆమె ముగ్ధ మనోహర రూపానికి రాజులు, దేవతలంతా దాసోహమై ఆమెను వివాహం చేసుకునేందుకు యత్నించారు. దమయంతి మాత్రం వారం దరినీ కాదని నల మహారాజును వివాహం చేసుకుంది. తమను కాదని నల మహారాజును దమయంతి వివాహం చేసుకోవడం దేవతలకు అస్సలు నచ్చలేదట. వారంతా శని దేవుని వద్దకు వెళ్లి ఆ జంటను ఇబ్బందులు పెట్టమని



వేడుకున్నారంట. సరేనన్న శనీశ్వరుడు నలుడిని అష్టకష్టాల పాలు చేశాడట. రాజ్యం, సిరి సంపదలు అన్నీ పోవడంతో బంధువులు కూడా దూరం పెట్టారట. చివరకు నలుడికి భార్య కూడా దూరమైందట. దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించాడు. దేశదేశాలు తిరిగి తిరునల్లార్ శని దేవాలయానికి వచ్చి అక్కడి పుష్కరిణిలోస్నానమాచరించి శివుడిని పూజించాడట.

అంతే నలునికి శని బాధలు తొలగిపోయి ఆయన రాజ్యం ఆయనకు దక్కిందట. అందుకే ఈ పుష్కరిణికి 'నలతీర్థం' అని పేరు వచ్చింది.

# ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది

### కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు బలంగా కోరుకుంటున్నారు

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాగంటి సునీత గెలుపు ఖాయం

### కారు గుర్తుకు ఓటేస్తామని ప్రజలే స్వచ్ఛందంగా చెబుతున్నారు

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

### రహమత్ నగర్ లో ఇంటింటి ప్రచారం చేసిన అంజయ్య యాదవ్, పార్టీ శ్రేణులు





**షాద్ నగర్, అక్టోబర్ 15:** సంక్షేమ సారథి, హైదరాబాద్ అభివృద్ధి ప్రదాత మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని నగర ప్రజలు బలంగా కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా బుధవారం రహమత్ నగర్ డివిజన్ లో మాగంటి సునీతకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించిన అనంతరం మాట్లాడారు. నాటు కేసీఆర్ పాలనను ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేకపోతున్నారని, ఎవరిని కదిలించిన కేసీఆర్ సంక్షేమాన్ని గుర్తు చేస్తూ ఆయన నాయకత్వం మరో మరో ప్రజలకు అవసరమనే విషయాన్ని బహిరంగంగానే చెబుతున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన నగర బస్తీలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఏ విధంగా అభివృద్ధి చెందిందో మనందరికీ తెలుసు అని, ప్రపంచ స్థాయి పరిశ్రమలు, అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా నగరంలో మౌలిక వసతులు కల్పన, సామాన్య ప్రజలు సైతం ప్రశాంత వాతావరణంలో జీవించే విధంగా శాంతి భద్రతల పరిరక్షణ, నగరవాసులకు ఉపాధి మార్గాలు చూపే కేంద్రాల ఏర్పాటు వంటి ఎన్నో వసతులను కల్పించిన ఘనత కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాగంటి సునీత గెలుపు ఖాయమనే భావన కలుగుతుందని, మోసపూరిత ప్రకటనలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే స్థితిలో లేరనే విషయం ప్రజలతో మాట్లాడితే తెలుస్తుందని వివరించారు. బీఆర్ఎస్ పార్టీపై, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం ఉందని చెప్పారు. ఏ గడపను కదిలించిన కారు గుర్తుకు ఓటేస్తామని ధీమాగా చెప్పడం గర్వంగా ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాగంటి సునీత గెలుపు కోసం తమ వంతుగా కృషి చేయాలని కోరారు. షాద్ నగర్ నియోజకవర్గ స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ నూతన అధ్యక్షుడిగా బూడిద శ్రీహరి , గౌరవ అధ్యక్షుడిగా కళ్లెం సంపత్



**యాదాద్రి భువనగిరి అక్టోబరు 15:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. యూనియన్ అధ్యక్షుడిగా బూడిద శ్రీహరి ( ఆంధ్రజ్యోతి ), గౌరవ అధ్యక్షుడిగా కళ్లెం సంపత్ ( సాక్షి ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం యాదగిరిగుట్టలో ప్రింట్ మీడియా జర్నలిస్టులు యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ నూతన కమిటీ ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన అధ్యక్షుడిగా బూడిద శ్రీహరి( ఆంధ్రజ్యోతి) ,కళ్లెం సంపత్ ( సాక్షి )లతోపాటు గౌరవ సలహాదారులుగా రాఘవుల అశోక్ కుమార్ ( ఈనాడు ), రాగి సహదేవ్ ( గ్రేటర్ డిజిటల్ న్యూస్ పోస్ట్ ), కైరంకొండ నవీన్ కుమార్ ( యాదగిరి న్యూస్ ), రాగి చంద్రశేఖర్ లు ఎన్నికయ్యారు . యూనియన్ ముఖ్య సమన్వయకర్తగా తండ జహంగీర్ నమస్తే తెలంగాణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా సిహెచ్ శేఖర్ ( ప్రజాపక్షం ) , ఆకుల గిరిబాబు ( ఆంధ్రప్రభ ) , ఉపాధ్యక్షులుగా పుట్ట హను మంత్ సోలాపూర్ వెంకటేష్ , ప్రధాన కార్యదర్శిగా ఇండ్ల మచ్చేందర్ ( ప్రజాతంత్ర ) , సెక్రటరీ జనరల్గా ఏలూరీ విక్రమ్ ( ఈనాడు ), కోశాధికారులుగా ఆరుట్ల కిషోర్ కుమార్,డంగు నరేందర్, ప్రచార కార్యదర్శి మొగిలిపాక కనకరాజు,సంయుక్త కార్యదర్శులుగా కొల్ల సందీప్ రెడ్డి , బి అమర్నాథ్ , కార్యవర్గ సభ్యులుగా సుక్కల సంజీవ, శిఖ సాయి కిషోర్ , కర్రే గణేష్ , మీస వెంకటేష్,ఓరుగంటి శివకుమార్,తదితరులు ఎన్నికయ్యారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని,జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది.

# 18న తెలంగాణ రాష్ట్ర బందును విజయవంతం చేయాలి

### బీసీ జేఏసీ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గుండాగాని వేణు



**మరిపెడ ఆగస్టు 15:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో బీసీ బందును విజయవంతం చేయాలని బిసి జేఏసీ చైర్మన్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుండాగాని వేణు పిలుపునిచ్చారు,బీసీ రిజర్వేషన్లు పెంచాలని దశాబ్దాలుగా మనం పోరాటం చేయడం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచుతూ జీవో నెంబర్ తొమ్మిదిని విడుదల చేయడం జరిగింది, బీసీ రిజర్వేషన్ల పెంపును వ్యతిరేకిస్తూ రెడ్డి జాగృతికి చెందిన కొందరు నేతలు మన బిసి రిజర్వేషన్లను కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారని, మనని అడుగడుగునా అవమానిస్తున్నారని,ఐదు శాతం లేనటువంటి రెడ్డి వాళ్ళు 60% ఉన్న బీసీలను రాజకీయంగా అణిచివేయాలని చూస్తున్నారని, బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాల్సిన పార్టీలు బీసీల పట్ల చిన్నచూపు చూపుతూ తమాషా చేస్తున్నారని, అన్నారు,ఇలాంటి కీలక సమయంలో మన బీసీల భవిష్యత్తు కోసం మన జాతి ఆత్మగౌరవం కోసం హైకోర్టు తీర్పును నిరసిస్తూ అలాగే బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణలు కల్పించాలని, ప్రధాన డిమాండ్లతో బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ఈనెల 18వ తారీఖున తెలంగాణ రాష్ట్ర బందుకు పిలుపునివ్వడం జరిగిందని. ఈ బంద్ నేటి మన బిడ్డల భవిష్యత్తు కోసమే మన ఆత్మ గౌరవాన్ని చాటడానికి మన బీసీల ఐక్యతను మరొకసారి రుజువు చేస్తూ నేటి నుంచి 18వ తారీఖున నిర్వహించే రాష్ట్ర బంద్ వరకు జరుగు కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సీనియర్ నాయకులు రాంపల్లి అబ్బయ్య, బిఎస్ రాజు, మరిపెడ మండలం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉప్పుల రమేష్,ప్రధాన కార్యదర్శి కొత్తకొండ భరత్, రామచంద్రయ్య,యూత్ అధ్యక్షులు పవన్,సాయి, లింగమూర్తి,అర్జున్, ప్రవీణ్ ,బీసీ యువ నాయకులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి ఎదల్ల యాదవ రెడ్డి సన్మానం

### మహబూబాబాద్ నేతతో ముఖ్యమంత్రి ఆత్మీయ భేటీ అభివృద్ధి, పార్టీ బలోపేతంపై చర్చ

### వరంగల్ పర్యటనలో ముఖ్యమంత్రిని కలిసిన మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

### కండువా కప్పి ఘన సత్కారం సాదరంగా పలకరించిన సీఎం



**వరంగల్ అక్టోబర్ 15:** తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా, మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఎదల్ల యాదవ రెడ్డి ప్రత్యేకంగా ఆయనను కలుసుకున్నారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో ఎదల్ల యాదవ రెడ్డి ముఖ్యమంత్రికి కండువా కప్పి ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి, ఎదల్ల యాదవ రెడ్డిని సాదరంగా పలకరించి, ఆత్మీయంగా మాట్లాడారు. ఇద్దరి మధ్య జరిగిన ఈ పలకరింపు అక్కడి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ భేటీలో ప్రధానంగా మహబూబాబాద్ జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, అలాగే రాబోయే రోజుల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే వ్యూహాలపై చర్చ జరిగినట్లు సమాచారం. జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై ముఖ్యమంత్రికి ఎదల్ల యాదవ రెడ్డి వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా నేతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రత్యేకంగా సమయం కేటాయించి మాట్లాడటం పట్ల మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. భవిష్యత్తులో జిల్లా అభివృద్ధికి, పార్టీ పటిష్టతకు ఈ భేటీ దోహదపడుతుందని ఆకాంక్షిస్తున్నారు.

# పేద విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపాలి

### ● ప్రభుత్వ బడి పట్ల నమ్మకాన్ని కలిగిద్దాం ● యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపు



**వేంపల్లె అక్టోబర్ 15 :** ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థుల జీవితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యా వెలుగును నింపాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఇటీవల మెగా డీఎస్సీలో ఎంపికై పాఠశాలల్లో విధులు చేపట్టిన నూతన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేసే కార్యక్రమంలో భాగంగా బుధవారం వేంపల్లె ,వేముల, చక్రాయపేట మండలాల పరిధిలోని పలు పాఠశాలలను యుటిఎఫ్ నాయకులు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో ప్రభుత్వ పాఠశాలకు విద్యనభ్యసించడానికి వచ్చే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రత్యేకించి నూతన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థుల పట్ల ప్రేమాభిమానాలు కనపరచాలన్నారు. విద్యార్థులతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రుల అభిమానాన్ని చూరగొంటూ ప్రభుత్వ బడిపై విశ్వాసాన్ని కలిగించాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాన్ని కేవలం వృత్తిగా కాకుండా నవ సమాజాన్ని తయారు చేసే బాధ్యతగా చూడాలన్నారు. నిరంతర శ్రమ, కృషి, పట్టుదల ద్వారా ఎన్నో అవరోధాలను అధిగమించి ఉపాధ్యాయులుగా ఎంపికై, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా కొనసాగించాలని కోరారు. అలాగే బోధనను వినూత్న పద్ధతుల ద్వారా కొనసాగిస్తూ విద్యార్థులకు చేరువ కావాలన్నారు. కేవలం బోధనకే పరిమితం కాకుండా రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథాన్ని పిల్లలకు కలిగించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమాజంలో జరుగుతున్న అంశాల పట్ల విద్యార్థికి పరిపూర్ణ అవగాహన కలగజేసే బాధ్యత కూడా ఉపాధ్యాయులదే అన్నారు. వృత్తి పట్ల అంకిత భావం, పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేసే ఉపాధ్యాయులకు బోధనలో, వృత్తిపరంగా ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులకు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ధ్యేయంగా, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే యూటీఎఫ్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ బడి కోసం, బడిలో చదువుకునే పేద విద్యార్థుల కోసం, వారి కోసం పనిచేసే ఉపాధ్యాయుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహించే యుటిఎఫ్ లో నూతన ఉపాధ్యాయులు సభ్యులుగా చేరి సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియమాకాలు చేపట్టినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వ బడిలో విద్యాబోధనకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. 12వ పిఆర్సీని అమలు చేయడంలో జాప్యం తగదని, తక్షణం పిఆర్ సి కమిషన్ ను నియమించి 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏలతో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన 25 వేల కోట్ల బకాయిల తక్షణ చెల్లింపులకు చర్యలు చేపట్టాలన్నారు. హైస్కూల్ ప్లస్ లలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. హైస్కూల్ ప్లస్ కొనసాగింపుకు చర్యలు చేపట్టాలని, హై స్కూల్ ప్లస్ లలో శాశ్వత ప్రాతిపదికన పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. 2025 జూన్ లో బదిలీలు పొందిన ఉపాధ్యాయులు రిలీవర్ లేక అదే పాఠశాలలో కొనసాగుతున్నారని వారిని రిలీవర్ తో సంబంధం లేకుండా కోరుకున్న పాఠశాలకు రిలీవ్ చేసి పంపాలన్నారు. బోధనేతర కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో తమ పోరు తీవ్రతమవుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా కార్యదర్శులు చెరుకూరి శ్రీనివాసులు, సి.వి.రమణ, వేంపల్లె మండల నాయకులు టి.వెంకటరమణ, సయ్యద్ సనావుల్లా, రాజశేఖర్, రాధా పాల్గొన్నారు.

# రాష్ట్రానికి ప్రత్యేక హెూదా విషయంలో అన్యాయం చేసిన నాయకులు గో బ్యాక్

### - నల్ల జెండాలు ప్రదర్శిస్తూ వామపక్షాలు సిపిఐ, సిపిఎం నాయకులు నిరసన





**పత్తికొండ అక్టోబర్ 15:-** రాష్ట్ర విభజన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాయలసీమకు ప్రత్యేక హెూదా కల్పిస్తామని మాయమాటలు చెప్పి రాయలసీమకు తీరని ద్రోహం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గో బ్యాక్.. గో బ్యాక్.. అంటూ వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఎం నాయకులు కర్నూలు జిల్లా పత్తికొండలో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పత్తికొండ పట్టణంలో వామపక్షా నాయకులు నల్లజెండాలు బ్యాడ్జీలు చేతబట్టి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక నాలుగు స్తంభాల మండపం వద్ద ఏర్పాటుచేసిన నిరసనను ఉద్దేశించి సీనియర్ నాయకులు భీమ లింగప్ప, రంగారెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడతామని మాయమాటలు చెప్పిన నరేంద్ర మోడీ 16న కర్నూలుకు వస్తున్నారని, ఈ పర్యటనతో కర్నూలుకు ఒరిగిందేమీ లేదని ఆదాని, అంబానీ కంపెనీలకు ఇక్కడి సంపదను కట్టబేట్టేందుకే ఈ సూపర్ జిఎస్టి కార్యక్రమమని ఎద్దేవా చేశారు. రాయలసీమ ప్రజలు కళ్ళు తెరిచి జరుగుతున్న మోసాన్ని గ్రహించాలన్నారు.

# టీమ్ఇండియాకు కలిసొస్తుందా...?



మహిళల ప్రపంచకప్ 2025లో శ్రీలంక-న్యూజిలాండ్ మధ్య మంగళవారం జరిగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసిన వెంటనే వర్షం కురవడంతో న్యూజిలాండ్ బ్యాటింగ్ చేయలేకపోయింది. దీంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటన చేశారు. ఇక ఇరు జట్లు తలా ఒక పాయింట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు 6 వికెట్ల నష్టానికి 258 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ సాధించింది. అయితే లంక ఇన్నింగ్స్ అనంతరం న్యూజిలాండ్ ఛేజింగ్ ప్రారంభించేలోపే స్టేడియంలో మళ్లీ వర్షం కురవడంతో మ్యాచ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో మ్యాచ్ క్యాన్సిల్ అయ్యింది. ఇక ఈ మ్యాచ్ రద్దవడంతో శ్రీలంక 2 పాయింట్లతో పట్టికలో ఏడో స్థానంలో ఉంది. ఇప్పటిదాకా శ్రీలంక గెలుపు నమోదు చేయలేదు. నాలుగు మ్యాచ్‌ల్లో రెండు ఓడగా, ఇంకా రెండు మ్యాచ్‌లు రద్దు అయ్యాయి. మరోవైపు న్యూజిలాండ్ 3 పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. అయితే ఈ మ్యాచ్ రద్దు అవ్వడం ఈ రెండు జట్లకు భారీ దెబ్బకొట్టినట్లైంది. అయితే టోర్నీలో ప్రస్తుతం భారత్- కివీస్ మధ్య సెమీస్ రేసు రసవత్తరంగా ఉంది. తాజాగా మ్యాచ్ క్యాన్సిల్ అవ్వడంతో శ్రీలంకకు సెమీఫైనల్ అవకాశాలు కష్టమయ్యాయి. మరోవైపు కివీస్ కూడా సెమీస్ ఛాన్స్‌లు సంక్లిష్టం చేసుకుంది. ఇది భారత్‌కు ఒక రకంగా మంచి అవకాశం. టీమ్ఇండియా తమ తదుపరి మ్యాచ్‌ల్లో అన్నింట్లో నెగ్గితే 10 పాయింట్లు వస్తాయి. ఒకవేళ కివీస్ ఇకపై ఆడే 3 మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే 9 పాయింట్లే అవుతాయి. ఇక్కడ మరో ఇంట్రెస్టింగ్ ఏటంటే భారత్- కివీస్ మధ్య కూడా ఒక మ్యాచ్ ఉంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన వాళ్లకు సెమీ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఈ మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటింగ్ ఎంచుకొని నిలక్షి డి సిల్వా (55 పరుగులు నాటౌట్, 28 బంతుల్లో) మెరుపులు మెరిపించింది. కేవలం 26 బంతుల్లోనే 50 పరుగులు మార్క్ అందుకుంది. ఈ క్రమంలో వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో వేగవంతమైన అర్ధశతకం సాధించింది. ఇందులో 7 ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. కెప్టెన్ చమరి అటపట్టు (53 పరుగులు) అర్ధశతకం సాధించింది. దీంతో 6 వికెట్లకు లంక 258 పరుగులు చేసింది. కెప్టెన్ అటపట్టు, యువ బ్యాటర్ విశ్మీ గుణరత్నె (42)తో కలిసి 101 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. హసిని పెరెరా కూడా 44 పరుగులతో జట్టుకు మద్దతు ఇచ్చింది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే అటాపట్టు అద్భుతమైన కవర్ డ్రైవ్‌తో ప్రారంభించి తన ధోరణి స్పష్టంచేసింది. తొలి విజయానికై ఎదురుచూస్తున్న శ్రీలంక టాప్‌ఆర్డర్‌లో వ్యూహాత్మక మార్పు చేసింది. 20 ఏళ్ల గుణరత్నెను కెప్టెన్‌తో కలిసి ఓపెనింగ్‌కు పంపింది, ఆ నిర్ణయం విజయవంతమైంది.

# విరాట్ స్టైల్‌కు అభిమానులు ఫిదా



భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా వన్డే సిరీస్ ప్రారంభానికి వారం రోజుల కంటే తక్కువ సమయం ఉంది. అంతకుముందు, విరాట్ కోహ్లి భారతదేశానికి తిరిగి వచ్చాడు, ఇక్కడి నుంచి అతను ఇతర భారత ఆటగాళ్లతో కలిసి ఆస్ట్రేలియాకు వెళ్తాడు. కింగ్ కోహ్లిని మంగళవారం నాడు న్యూఢిల్లీ విమానాశ్రయంలో చూశారు, అక్కడ అతనిని ఘనంగా స్వాగతించారు. విమానాశ్రయంలో విరాట్ నల్లటి చొక్కా, తెలుపు ప్యాంటులో కనిపించాడు, అతని ఈ లుక్ ఫోటో బాగా వైరల్ అవుతోంది. విరాట్ కోహ్లి న్యూఢిల్లీ విమానాశ్రయంలో కనిపించగానే అభిమానులు ఎగబడ్డారు. అందుకే అతని నల్ల చొక్కా, తెలుపు ప్యాంటు ఫోటోను ఫ్యాన్స్ షేర్ చేస్తున్నారు. %ఖూా% 2025 ముగిసిన తర్వాత విరాట్ కోహ్లి తన పిల్లలు, భార్యతో కలిసి లండన్ వెళ్లారు. ఇప్పుడు ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లేందుకు టీంతో కలిసేందుకు లండన్ నుంచి వచ్చారు. అతను గత సంవత్సరం %ు%20 ఫార్మాట్ నుంచి,టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. నివేదిక ప్రకారం, భారత జట్టు 2 వేర్వేరు ఫార్మాట్‌లలో ఆస్ట్రేలియాకు బయలుదేరుతుంది. కొంతమంది ఆటగాళ్ళు ఉదయం, మిగిలిన ఆటగాళ్ళు సాయంత్రం టిక్కెట్లు దొరికాయి. వారు వేర్వరు టైంలలో ఆస్ట్రేలియా విమానాన్ని పట్టుకుంటారని చెప్పారు. టీమ్ ఇండియా ఇక్కడి నుంచి నేరుగా పెర్త్ వెళ్తుంది, అక్కడ అక్టోబర్ 19న భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మొదటి వన్డే మ్యాచ్ జరగనుంది. రిటైర్మెంట్ ఊహాగానాల మధ్య, విరాట్ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత మొదటిసారిగా వన్డే మ్యాచ్ ఆడుతున్నాడు. కొద్ది రోజుల క్రితం చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆస్ట్రేలియా పర్యటన కోసం భారత జట్టును ప్రకటించినప్పుడు, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వన్డే ప్రపంచ కప్ 2027లో ఆడటంపై ఎటువంటి స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఈ వన్డే సిరీస్‌కు శుభ్‌మన్‌గిల్ భారత్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. చాలా కాలం తర్వాత రోహిత్ శర్మ ఈ వన్డే సిరీస్‌లో బ్యాట్స్‌మెన్‌గా కనిపిస్తాడు. గిల్ వన్డే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం ఇదే మొదటిసారి. ఇటువంటి పరిస్థితిలో 2027 ప్రపంచ కప్ కోసం విరాట్- రోహిత్ పట్ల చీఫ్ సెలెక్టర్ల వైఖరి ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల కెరీర్‌కు మంచి సంకేతం కాదని విశ్లేషకులు అంటున్నారు.



# ఎంపికలో సమూల మార్పులు చేయాలి

- ఆటగాళ్లు సెలక్టర్లకు అస్సలు భయపడకూడదు
- టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానే



టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానే సెలక్షన్ కమిటీలో నియామకాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. డొమెస్టిక్ క్రికెట్ సెలక్టర్ల ఎంపికలో పాత పద్ధతులతో కాకుండా, సమూల మార్పులు చేసి కొత్త విధానాలు అనుసరించాల్సి ఉందని అన్నాడు. అలాగే యువ ఆటగాళ్లు సెలక్టర్లకు అస్సలు భయపడకూడదని చెప్పాడు. రీసెంట్‌గా తన యూట్యూబ్ ఛానెల్‌లో ఛెతేశ్వర్ పుజారాతో రహానే చిట్‌చాట్ నిర్వహించాడు. ఈ క్రమంలోనే రహానే ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం సెలక్షన్ కమిటీలో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలంటే సదరు వ్యక్తి కనీసం 10 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉండి, క్రికెట్ నుంచి రిటైరై ఐదు సంవత్సరాలు దాటాలి. ఇదీ ప్రస్తుత నిబంధన. అలా అయితేనే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఈ లెక్కన ఛెతేశ్వర్ పుజారా రీసెంట్‌గానే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. అతడు సెలక్షన్ కమిటీలో దరఖాస్తూ చేసుకోవాలంటే 2030 దాకా ఆగాల్సిందే! అయితే ఇలా కాకుండా రీసెంట్‌గా రిటైరైన క్రికెటర్లే సెలక్షన్ కమిటీలో ఉండాలని అభిప్రాయపడ్డాడు. 'ఆటగాళ్లు సెలక్టర్లకు భయపడకూడదు. నేను ముఖ్యంగా దేశవాళీ క్రికెట్‌లో సెలక్షన్ కమిటీ నియామకం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. సెలక్షన్ కమిటీ నియామకంలో మార్పులు జరగాలి. కెరీర్‌లో అత్యుత్తమ స్థాయిలో క్రికెట్ ఆడి ఇటీవల రిటైర్ అయినా వాళ్లను సెలక్టర్లుగా నియమించాలి. అంతేకాని ఎప్పుడో 7- 8ఏళ్ల కిందట రిటైర్ అయిన వాళ్లను సెలక్టర్లుగా ఎంపిక చేస్తే ఎలా. అలా ఎంపిక చేయొద్దు. ఎందుకంటే క్రికెట్‌లో ఎప్పటికప్పుడు చాలా మార్పులు వస్తున్నాయి' 'అందుకు అనుగుణంగా సెలక్టర్ల మైండ్ సెట్ మారాల్సిన అవసరం ఉంది. 20-30ఏళ్ల కిందట క్రికెట్ ఎలా ఆడారు అన్న విధానాలతో నిర్ణయాలు తీసుకునేవారు వద్దు. టీ20, ఐపీఎల్ వంటి ఫార్మాట్లతో కొత్త తరం ఆడుతున్న మోడ్రన్ స్టైల్ క్రికెట్‌ను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సెలక్షన్ కమిటీలో దాదాపు అన్ని రాష్ట్రాల వాళ్లు ఉండేలా చూడాలి. అప్పుడే ఆటగాళ్లు స్వేచ్ఛగా, ధైర్యంగా క్రికెట్ ఆడగలరు' అని రహానే అన్నాడు. దీనికి పుజారా కూడా రహానే అభిప్రాయంతో ఏకీభవించాడు.

# భారత్-పాక్ మధ్య ముగిసిన హ్యాండ్‌షేక్ వివాదం



ఇటీవల ముగిసిన ఆసియా కప్ 2025 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య నెలకొన్న నో హ్యాండ్‌షేక్ వివాదం యావత్ క్రీడా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. పుల్వామా ఉగ్రదాడి తర్వాత భారత క్రికెటర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ పాకిస్థాన్ ఆటగాళ్లతో, అధికారులతో షేక్ హ్యాండ్ చేయకుండా తమ వైఖరిని కొనసాగించారు. అయితే, మలేషియాలో అక్టోబర్ 14న జరిగిన సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్ 2025 హాకీ మ్యాచ్‌లో మాత్రం పరిస్థితి మారింది. భారత్ %ఖ%-21 జట్టు, పాకిస్థాన్ జూనియర్ హాకీ ప్లేయర్స్‌తో మ్యాచ్‌కు ముందు హ్యాండ్‌షేక్ ఇవ్వడం, హై-ఫైవ్ ఇవ్వడం జరిగింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మలేషియాలో జరిగిన సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్ హాకీ మ్యాచ్ ప్రారంభం కావడానికి ముందు భారత్, పాకిస్థాన్ ఆటగాళ్లు ఒకరికొకరు హై-ఫైవ్ ఇచ్చుకున్నారు. ఈ సంఘటన హ్యాండ్‌షేక్ వివాదానికి ముగింపు పలికినట్లు క్రీడాభిమానులు భావిస్తున్నారు. వాస్తవానికి, ఈ మ్యాచ్ కంటే ముందే, పాకిస్థాన్ హాకీ సమాఖ్య తమ జూనియర్ జట్టుకు నో-హ్యాండ్‌షేక్ పరిస్థితికి సిద్ధంగా ఉండాలని, భారత జట్టు హ్యాండ్‌షేక్ ఇవ్వడానికి నిరాకరిస్తే, దానిని పట్టించుకోవద్దని, భారత ఆటగాళ్లతో భావోద్వేగంగా ఎలాంటి వాదనకు లేదా ఘర్షణకు దిగొద్దని ఆదేశాలు జారీ చేసింది. గతంలో పాకిస్థాన్ హాకీ జట్టు భారత్‌కు ఆడటానికి రాలేదు. ఆ సమయంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు అధికంగా ఉండేవి. ఈ వివాదం సరిగ్గా సెప్టెంబర్ 14న జరిగిన ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్‌తో మొదలైంది. పుల్వామా ఉగ్రదాడి జరిగిన తర్వాత భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంగా భారత జట్టు నో హ్యాండ్‌షేక్ విధానాన్ని అమలు చేసింది. ఆ మ్యాచ్‌కు ముందు టాస్ సమయంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పాక్ కెప్టెన్ సల్మాన్ అఘాతో హ్యాండ్‌షేక్ ఇవ్వడానికి నిరాకరించాడు. తొలి మ్యాచ్‌లో మాత్రమే కాకుండా, సూపర్-4, ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లలో కూడా భారత క్రికెట్ జట్టు ఇదే నో హ్యాండ్‌షేక్ విధానాన్ని కొనసాగించింది. మ్యాచ్‌లు గెలిచిన తర్వాత కూడా భారత ఆటగాళ్లు పాక్ టీమ్‌తో షేక్ హ్యాండ్ చేయకుండానే నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు.



# కోహ్లి, రోహిత్‌తోపాటు జర్నీ చేయని గంభీర్

భారత క్రికెట్ అభిమానుల ఎదురుచూపులు ఫలించాయి. ఆస్ట్రేలియాతో జరగబోయే ముఖ్యమైన మూడు వన్డేల సిరీస్ కోసం విరాట్ కోహ్లి, రోహిత్ శర్మతో కూడిన టీమిండియా తొలి బ్యాచ్ ఆటగాళ్లు ఆసీస్‌కు బయలుదేరారు. అయితే, ఈ తొలి బృందంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లేకపోవడం విశేషం. సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మతో సహా మొదటి బ్యాచ్ ఆటగాళ్లు బుధవారం (అక్టోబర్ 15, 2025) ఉదయం ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు పయనమయ్యారు. జట్టు సభ్యులు: విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, కొత్త వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ యశస్వి జైస్వాల్, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి, పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ ఈ తొలి బృందంలో ఉన్నారు. ఆటగాళ్లతో పాటు కొంతమంది సపోర్ట్ స్టాఫ్ కూడా ఆస్ట్రేలియా వెళ్లారు. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కోచింగ్ సిబ్బందిలోని మరికొంతమంది సభ్యులు మాత్రం బుధవారం సాయంత్రం తర్వాత ఆస్ట్రేలియాకు బయలుదేరనున్నారు. ఈ సిరీస్‌కు ముందు, టీమిండియా వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ టెస్టు సిరీస్ మంగళవారం (అక్టోబర్ 14) ముగియడంతో, అందులో పాల్గొన్న ఆటగాళ్లు ఆ తరువాత రోజు ప్రయాణానికి సిద్ధమయ్యారు. గంభీర్ కూడా వెస్టిండీస్ టెస్ట్ సిరీస్‌లో జట్టుతో ఉన్నారు. టెస్టులు, టీ20ల నుంచి వైదొలిగిన తర్వాత, వన్డే ఫార్మాట్‌లో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ పునరాగమనం చేస్తుండటం పట్ల ఈ సిరీస్‌పై మరింత ఆసక్తి నెలకొంది. వీరు చివరిసారిగా ఈ ఏడాది మార్చిలో ఛాంపియన్స్ ట్రోఫీలో వన్డే మ్యాచ్ ఆడారు. ఆస్ట్రేలియా సిరీస్‌లో వారి అనుభవం జట్టుకు చాలా విలువైనదని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ విజయం తర్వాత జరిగిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. అయితే, 2027 వన్డే ప్రపంచకప్ భవితవ్యంపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వకుండా, "ప్రస్తుత కాలంలో ఉండటం చాలా ముఖ్యం.

# ఆఫ్ఘనిస్తాన్ చేతిలో బంగ్లాదేశ్ చిత్తు



ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌పై జరిగిన 3 వన్డేల సిరీస్‌లో సంచలన ప్రదర్శన చేసింది. అబుదాబిలో అక్టోబర్ 14న జరిగిన చివరి మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిచి, సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఇది ఆఫ్ఘనిస్తాన్‌కు వరుసగా 5వ వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. చివరి వన్డే మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఏకంగా 200 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. అబుదాబిలో ఈ రికార్డు తేడాతో ఓడిపోవడం బంగ్లాదేశ్‌కు ఇదే మొదటిసారి. ఆఫ్ఘనిస్తాన్‌కు వరుసగా ఐదో వన్డే సిరీస్ విజయాన్ని అందించడంలో ఇబ్రహీం జద్రాన్ కీలక పాత్ర పోషించాడు. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో జద్రాన్ మొత్తం 213 పరుగులు సాధించాడు. ఈ పరుగులు 71 సగటుతో 14 ఫోర్లు, 3 సిక్సుల సహాయంతో చేశాడు. అయితే, ఈ సిరీస్‌లో జద్రాన్ రెండుసార్లు సెంచరీని కేవలం 5 పరుగుల తేడాతో కోల్పోయాడు. సిరీస్‌లో రెండో, మూడో వన్డేల్లో అతడు 95 పరుగుల ఇన్నింగ్స్ ఆడటం విశేషం. చివరి వన్డేలో, ఇబ్రహీం జద్రాన్ (95 పరుగులు), మహ్మద్ నబీ (62 పరుగులు) అద్భుతంగా ఆడటంతో ఆఫ్ఘనిస్తాన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. 294 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్‌లకు ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు కేవలం 27.1 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా ఆఫ్ఘనిస్తాన్ 200 పరుగుల భారీ తేడాతో మ్యాచ్‌ను గెలిచి, సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. బంగ్లాదేశ్ పతనాన్ని శాసించిన బౌలర్‌లలో ప్రధానంగా బిలాల్ షామీ ముందున్నాడు.

గురువారం, అక్టోబర్ 16, 2025
నిజాలు నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



# సాయిదుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు



## బర్త్‌డే విషెస్‌గా ఫస్ట్ గ్లింప్స్ విడుదల

సాయిదుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎస్.వై.జి' (సంబరాల ఏటిగట్టు). ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి దర్శకత్వం వహిస్తున్నారు. సాయి దుర్గాతేజ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'అసుర సంధ్యవేళ మొదలైంది.. రాక్షసుల ఆగమనం..' అంటూ సాయి దుర్గాతేజ్ పవర్‌ఫుల్ డైలాగుతో ఆకట్టుకున్నారు. 'విరూపాక్ష' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత టాలీవుడ్ హీరో సాయిదుర్గతేజ్ శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ఈ సినిమాకు రోహిత్ కె.పి దర్శకత్వం వహిస్తుండగా.. ప్రైమ్ షో ఎంటర్‌టైన‌మెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.సాయి ధరమ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి అతడికి బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. ఫస్ట్ గ్లింప్స్‌ను వదిలారు. సాయి తేజ్ ఇందులో బాలీ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. 125కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఐశ్వర్యలక్ష్మీ కథానాయికగా నటిస్తుండగా. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# శర్వానంద్‌తో శ్రీను వైట్ల తదుపరి మూవీ



శ్రీను వైట్ల ఒకప్పుడు తెలుగులో క్రేజీయెస్ట్ డైరెక్టర్. యువ కథానాయకులతోనే కాదు స్టార్ హీరోలతోనూ సినిమాలు చేసి తన సత్తాను చాటుకున్నారు. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ సక్సెస్ ను అందుకున్నాయి. అయితే... 2011లో వచ్చిన 'దూకుడు' తర్వాత మళ్ళీ శ్రీను వైట్ల ఆ స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. అంతేకాదు... 2018లో వచ్చిన 'అమర్ అక్బర్ ఆంథోని' సినిమా తర్వాత ఆయన ఏకంగా ఐదేళ్ళు దర్శకత్వానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇక గత యేడాది 'విశ్వం' సినిమాతో మళ్ళీ లైమ్ లైట్ లోకి వచ్చిన శ్రీను వైట్ల... ఆ తర్వాత ఎట్టకేలకు ఓ ప్రాజెక్ట్ ను సెట్ చేయగలిగాడు. 'ఢీ' సినిమా తర్వాత దానికి సీక్వెల్ గా మంచు విష్ణుతోనే శ్రీను వైట్ల సినిమా చేస్తాడనే ప్రకటన వచ్చింది. కానీ అది పట్టాలెక్కలేదు. ఈ లోగా గోపీచంద్ హీరోగా 'విశ్వం' సినిమాను శ్రీను వైట్ల తెరకెక్కించాడు. ఇది థియేటర్లలో పెద్దంత ఆడకపోయినా... ఓటీటీలో బాగానే వీక్షకులను మెప్పించింది. అప్పటి నుండి మరో సినిమాను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడు. ఆ మధ్య నితిన్ హీరోగా శ్రీను వైట్ల ఓ సినిమా చేయబోతున్నాడనే ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు శర్వానంద్ తో శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లాక్ అయ్యిందని తెలుస్తోంది. 'విశ్వం'కు రచన చేసిన నందు ఈ సినిమాకూ వర్క్ చేస్తున్నాడని అంటున్నారు. శ్రీను వైట్ల చెప్పిన కథ నచ్చడంతో శర్వానంద్ ఈ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. దాంతో మిగిలిన నటీనటులు, టెక్నీషియన్స్ ను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అతి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తుందని, వచ్చే యేడాది ప్రారంభంలో ఇది సెట్స్ పైకి వెళుతుందని అంటున్నారు. మరి శర్వా - శ్రీను వైట్ల తొలి కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాతో మరోసారి వీరిద్దరూ సక్సెస్ ట్రాక్ ఎక్కుతారేమో చూడాలి.

# ఛార్మీతో రిలేషన్ షిప్ వార్తలపై క్లారిటీ ఇచ్చిన పూరి జగన్నాథ్



"ఛార్మీ నాకు తన 13వ ఏట నుంచే తెలుసు. గత 20 సంవత్సరాలుగా మేమిద్దరం మంచి స్నేహితులుగా ఉన్నాం. కలిసి ఎన్నో సినిమాలకు పనిచేశాం. కానీ మా మధ్య ఎలాంటి రొమాంటిక్ వ్యవహారం లేదు" అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో యువత కారణంగానే ఇలాంటి పుకార్లు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.పుకార్లు రావడానికి గల కారణాన్ని విశ్లేషిస్తూ, "ప్రస్తుతం ఛార్మీకి ఇంకా పెళ్లి కాలేదు, తను సింగిల్‌గా ఉంది కాబట్టే ఈ రూమర్లు ఇంత బలంగా వస్తున్నాయి. ఒకవేళ ఆమె వయసు 50 ఏళ్లు ఉండి, వేరొకరితో పెళ్లి జరిగి ఉంటే ఈ విషయం గురించి ఎవరూ పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఆమె ఒంటరిగా ఉండటమే ఇలాంటి వార్తలకు కారణమవుతోంది" అని పూరీ వివరించారు. తమ మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమేనని, అది ఎప్పటికీ శాశ్వతంగా ఉంటుందని ఆయన తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యలతో పూరీ తనకూ, ఛార్మీకి మధ్య ఉన్న బంధంపై వస్తున్న ఊహాగానాలకు మరోసారి చెక్ పెట్టారు.

# చిరంజీవి సినిమాలో బంపర్ ఆఫర్ కొట్టేసిన కేరళ బ్యూటీ



'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కలయికలో రాబోతున్న కొత్త సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ చిత్రాన్ని నవంబర్ 5వ తేదీన పూజ కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి.పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో చిరంజీవి సరసన నటించే హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్ ను ఎంపిక చేశారని సమాచారం. ఇప్పటికే ప్రభాస్ సరసన నటిస్తున్న మాళవిక, గతంలో 'తంగలాన్'లో విక్రమ్, మలయాళంలో మోహన్‌లాల్ వంటి సీనియర్ స్టార్లతో కలిసి పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు మెగాస్టార్‌తో జతకట్టే అవకాశం దక్కించుకుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుండగా, 'మిరాయ్' చిత్ర దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. చిరంజీవి పుట్టినరోజున అధికారికంగా ప్రకటించిన ఈ ప్రాజెక్ట్‌పై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.ప్రస్తుతం చిరంజీవి వరుస సినిమాలతో ఫుల్ జోష్ మీదున్నారు. ఇప్పటికే యంగ్ డైరెక్టర్ వసిష్ఠతో 'విశ్వంభర' చిత్రాన్ని పూర్తి చేయగా, మరోవైపు సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో చేస్తున్న సినిమా చివరి దశ చిత్రీకరణలో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తికాకముందే బాబీతో మరో సినిమాను మొదలుపెడుతుండటం ఆయన స్పీడ్‌కు అద్దం పడుతోంది.

# నేపథ్య గాయని రావు బాలసరస్వతి కన్నుమూత

అలనాటి గాయని రావు బాలసరస్వతి దేవి (97) అనారోగ్యంతో హైదరాబాద్ మణికొండలోని స్వగృహంలో అక్టోబర్ 15వ తేదీ ఉదయం 8 గంటలకు తుదిశ్వాస విడిచారు. 1928 ఆగస్ట్ 29న జన్మించిన రావు బాలసరస్వతి గొంతు ఆకాశవాణి సంగీత కార్యక్రమాలతో తెలుగు వారికి సుపరిచితం. సినిమాలలో తొలి నేపథ్య గాయనిగానూ ఆమె ఎంతో పేరు తెచ్చుకున్నారు. 'స్వప్నసుందరి, పిచ్చిపుల్లయ్య, పెళ్ళిసందడి, శాంతి, షావుకారు, దేవదాసు, లైలా మజ్ను, భాగ్యలక్ష్మి, మంచి మనసుకు మంచి రోజులు' తదితర చిత్రాల్లో ఘంటసాల, ఏ.ఎం.రాజా, సౌందర్‌రాజన్, పిఠాపురం నాగేశ్వరరావు, జిక్కి, ఏ.పి. కోమల లాంటి వారితో కలిసి ఆమె పాటలు పాడారు. రావు బాల సరస్వతి అసలు పేరు సరస్వతి. తల్లి తండ్రుల పేర్లు విశాలాక్షి, కావేటి పార్థసారథి. ఆమె తండ్రి గాయకులు, ప్రధానంగా వీణ, సితారు వాయించేవారు. చెన్నై లో కొంత కాలం ఉండి అనంతరం గుంటురుకి మారారు. ఆలకూరు సుబ్బయ్య వద్ద బాల సరస్వతి 1939లో కర్ణాటక సంగీతం



మూడు సంవత్సరాలు అభ్యసించారు. ఆపైన బాల సరస్వతిని ఆమె తండ్రి ముంబై తీసుకెళ్ళి, హిందుస్తానీ సంగీత ప్రముఖులైన ఖేల్కర్, సినీ సంగీత దర్శకులు వసంత్ దేశాయ్ వద్ద అభ్యాసం చేయించారు. అలానే మద్రాసులో పిచ్చుమణి అయ్యర్ దగ్గర ఆమె వీణ నేర్చుకున్నారు.సి. పుల్లయ్య దర్శకత్వం వహించిన 'సతీ అనసూయ'లో రావు బాలసరస్వతి గంగ వేషం వేశారు. ఆ యూనిట్ లో ఆమె చిన్నపిల్ల. దానికి ఆకుల నరసింహారావు సంగీత దర్శకులు. చిన్నప్పుడు పాటలు పాడటానికి వెళ్ళినప్పుడు ఆమెను బేబీ సరస్వతి అని పిలిచేవారు. ఆ తర్వాత బాల సరస్వతి అనడం మొదలు పెట్టారు. అదే చివరకు ఆమె పేరు అయిపోయింది. బాల సరస్వతి సుమారు 12 సినిమాలలో బాల నటిగా కనిపించారు. 1943లో ప్లే బ్యాక్ కొత్తగా వచ్చింది. దానికి ముందు ఎవరి పాటలు వారే పాడుకునే వారు. ఆ సమయంలో భాగ్యలక్ష్మి సినిమాకు మొట్టమొదటగా ప్లే బ్యాక్ పాడారు బాల సరస్వతి. పెద్దాయక ఆమె తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషా చిత్రాలలో పాటలు పాడారు. ముఖ్యంగా శ్రీశ్రీ, ఆరుద్ర, కొసరాజు, కృష్ణశాస్త్రి రాసిన పాటలను ఆమె ఎక్కువగా పాడారు. కోలంక జమీందారీకి చెందిన రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు ఆమెను 1944లో వివాహమాడారు. జమీందారీ కట్టుబాట్ల వల్ల, నటిగా సినిమాల్లో పాల్గొనడం తగ్గించారు.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com